ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 51 పేజీలు: 10+4 వెల: 6.50

**హార్ముజ్ జలసంధికి దగ్గరగా బ్రిటన్ జలాంతర్గామి**

**ఖతార్ సముద్ర జలాల్లో కూలిన సైనిక హెలికాప్టర్**

5

## మోడీ@8931



**పాలనలో నరేంద్రమోడీ సరికొత్త రికార్డు**

**ముఖ్యమంత్రి, ప్రధాని పదవిలో నిర్విరామంగా కొనసాగింపు**

5

## ఇదో పరీక్ష.. పాసవుదాం

**సరఫరా, పంపిణీలో అవరోధం లేకుండా చర్యలు తీసుకోండి**

**పెట్రోలు, గ్యాస్, ఎరువుల లభ్యతలో జాగ్రత్త వహించండి**

**అత్యవసర కేబినెట్ భేటీలో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, మార్చి 22:** అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్న నేపథ్యంలో దేశీయంగా పెట్రోలియం, విద్యుత్, ఎరువుల లభ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం కీలక సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా వనరుల పంపిణీ వ్యవస్థలో ఎక్కడా అంతరాయం కలగకూడదని అధికారులను ప్రధాని ఆదేశించారు. పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల కొరత రాకుండా చూడటం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. వనరుల రవాణాకు సంబంధించి సమర్ధవంతమైన >>2



### ఇజ్రాయెల్ అణుకేంద్రాలపై

# ఇరాన్ దాడులు

**48 గంటల్లో హార్ముజ్ జలసంధిని తెరవాల్సిందే: ట్రంప్**

**శత్రుదేశాల నౌకలు మినహా అన్నింటినీ అనుమతిస్తాం: ఇరాన్**

**క్షిపణి కేంద్రాన్ని సందర్శించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**

**టెహ్రాన్ / జెరూసలెం / వాషింగ్టన్, మార్చి 22:** మధ్యప్రాచ్యంలో ఉధృతం అవుతున్న యుద్ధం ప్రపంచదేశాలను కలవరపరుస్తోంది. ఇరాన్ తన ఖండాంతర క్షిపణులతో కొనసాగిస్తున్న దాడులు అమెరికానుసైతం కలవరపెడుతున్నాయి. డిగోగార్షియాలోని యుఎస్ బేస్‌లపై దాడికియత్నించింది. అంతేకాకుండా ఇజ్రాయెల్ లక్ష్యంగా తన దాడులు ముమ్మరంచేసింది. ఇజ్రాయెల్‌లోని డిమోనా నగరంలో ఉన్న అణుశుద్ధికేంద్రమే లక్ష్యంగా జరిపిన దాడిలో రెండు భవనాలు ధ్వంసం అయ్యాయి. అణుశుద్ధికేంద్రానికి కేవలం 20 కిలోమీటర్ల లోపే ఈ దాడులుజరిగాయి. ఇజ్రాయెల్ లోనిమినీ ఇండియాగా పిలిచే ప్రాంతండిమోనా, అరద్‌నగరాలపై ఇరాన్ క్షిపణులు దాడిచేసాయి. 100 మందికిపైగా గాయపడ్డారు. ఇజ్రాయెల్‌పై జరిపిన దాడిలో సుమారు 80 మందికిపైగా గాయపడినట్లు తేలింది. ఇప్పటివరకూ అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు >>2

### రైతు ఖాతాల్లోకి

# 9 వేల కోట్లు

### 45 రోజుల్లో జమ చేస్తాం

### తొలి విడతగా రూ. 3600 కోట్లు



ఆదివారం నర్మెటలో రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తుమ్మల, వివేక్, పొన్నం, పొంగులేటి, దామోదర తదితరులు

**సిద్దిపేటను కాంగ్రెస్‌కిస్తే మంత్రి పదవి ఇస్తా..**

**నర్మెటలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ప్రారంభించిన సిఎం రేవంత్**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** 2029 సాధారణ ఎన్నికల్లో తిరిగి మళ్లీ మేం అధికారంలో వస్తాం... సిద్దిపేట నుంచి నాలుగు దశాబ్దాలుగా పాలిస్తున్న పాలకులకు చమరగీతం పాడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినికి గెలిపిస్తే మంత్రిని చేసే బాధ్యత నాది అన్ని సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నంగనురూర్ మండలం నర్మెటలో రూ.300 కోట్లతో నిర్మించిన అయిల్‌ఫాం ఫ్యాక్టరీని ప్రారంభించి రూ.80 కోట్లతో నిర్మించ తలపెట్టిన అయిల్ రిఫైనరీతో పాటు రూ.750 కోట్లతో నిర్మించ తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మొదట విడతలో భాగంగా 70 లక్షల మంది రైతులకు ఎకరం లోపు రూ.3600 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 45 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసి రైతును రాజును చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రజాపాలనలో ఆర్థిక సస్యలు, ఇబ్బందులు వచ్చిన రైతుల సంక్షేమానికి ఎక్కడ లోటు రాన్వికుండా నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. రైతుల కళ్ళల్లో అనందం చూడడానకి ప్రభుత్వం నిరంతరం తాపాత్రయ పడుతుందన్నారు. రాష్ట్రంలో 3 లక్షల ఎకరాలలో అయిల్ ఫాం పంట సాగువుతుందని..10 లక్షల ఎకరాలలో అయిల్‌ఫాం సాగు చేసిన రైతు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులను లాభాసాటి చేయడానికి అయిల్‌ఫాం పంట ఎంతో మేలు చేస్తుందన్నారు. పంటల్లో మార్పు రావాల్సి నఅవసరంఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో పంటల మార్పిడి ద్వారా రైతులు తలెత్తుకొని నిలిచేలా కృషి చేద్దామన్నారు. సిద్దిపేటలో నిర్మించి అయిల్ ఫాం ఫ్యాక్టరీ తరహాల్లోనే కొడంగల్ నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలోని 12 వేల 728 గ్రామాలు అంకాపూర్ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. కెసిఆర్ 114 నెలలో నెలకు రూ. 2 వేల 533 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేస్తు తమ ప్రభుత్వం 28 నెలల్లో ప్రతి నెల రూ.5 వేల 500 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. అకాల,వడగండ్ల వర్షాలతో రైతులు పంటలు నష్టపోతే ప్రతి రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం అందించమన్నారు.గతంలో ఈ ప్రాంతంలో పసుపు, మొక్కజొన్న. ఎర్రజొన్న తదితర పంటలు పండించే వారని పంటల సాగులో మార్పురావాలన్నారు. దేశంలోనే వరి పంటను పండించడంలో తెలంగాణ నంబరువన్‌గా నిలిచిందన్నారు.రైతు పండించిన పంటలను అంతర్జాతీయస్థాయికి ఎగుమతి చేసేలా >>2



## నేడు అసెంబ్లీకి వైద్య విధాన పరిషత్ బిల్లు

**12,589 మంది సిబ్బందికి ప్రయోజనం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 22:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా నేడు(సోమవారం) తెలంగాణ వైద్య విధాన పరిషత్ (రద్దు) బిల్లు, 2026ను ప్రవేశ పెట్టనున్నారు. ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి దామోదర్ రాజనరసింహ తెలంగాణ వైద్య విధాన పరిషత్ (రద్దు) బిల్లు, 2026ను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం సొసైటీ పరిధిలో ఉన్న టివివిపిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (డిఎస్‌హెచ్ఎస్)గా మార్చడానికి ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇందుకుసంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ తగిన ప్రతిపాదనలను >>2

**వేగంగా ఎస్ఎల్‌బిసి పనులు**

**మన్నెవారిపల్లె వద్ద ప్రారంభం**

**ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగం హర్షం**

6

## టిడిఆర్‌లో మార్పులు



**భవన నిర్మాణాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం**

**21 మీటర్లు దాటినవే హైరైజ్డ్ భవనాలు**

**పలు సడలింపులిచ్చిన ప్రభుత్వం**

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భవన నిర్మాణరంగానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టిడిఆర్ నిబంధనలలో మార్పు తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలను మార్పులు చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012కు కీలక సవరణలు చేస్తూ జిఓఎంఎస్ 95ను మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులలలో టిడిఆర్ వినియోగం, హైరైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఇకపై 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే హైరైజ్ భవనాలుగా పరిగణించనున్నారని ఉత్తర్వులలో పేర్కొన్నారు. పారిశ్రామిక భవనాల్లో ఉండే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, బాయిలర్ రూములు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులు, ఇతర నిర్మాణ ఫీచర్లలను పరిగణలోకి తీసుకోరు. టిడిఆర్ వినియోగంపై సైతం పలు నిబంధనలు విధించారు. చిన్న ప్లాట్లకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే 750 చ.మీ నుండి 2000 చ.మీ మధ్య ఉండే ప్లాట్లలో 18 మీటర్ల నుండి 21 మీటర్ల ఎత్తు వరకు భవనాలు నిర్మించాలంటే టిడిఆర్ వినియోగం తప్పనిసరి చేశారు. బహుళ అంతస్తుల భవనాలను పరిశీలిస్తే 10 అంతస్తుల నుండీ 20 అంతస్తులలోపు ఉండే భవనాలకు 10 అంతస్తుల పైబడిన బిల్ట్‌అప్ ఏరియాపై 3 శాతం టిడిఆర్ ఉపయోగిస్తుండాలి. 20 అంతస్తుల పైబడిన ఏరియాపై 5 శాతం టిడిఆర్ వినియోగించాల్సి ఉంటుందని స్పష్టమైన నిబంధనలు విధించారు. ప్రధానంగా టిడిఆర్‌ను భవన నిర్మాణ అనుమతి సమయంలో 50 శాతం సమర్పించాల్సి ఉంటుందని, మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసి) పొందే ముందు సమర్పించడం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అదనపు అంతస్తులకు వెసులుబాటును సైతం కల్పించారు. 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 40 ఫీట్ల రోడ్డు ఉన్న ప్రాంతాలలో 3 అదనపు అంతస్తుల వరకు అనుమతి ఇవ్వనుండగా, 60 ఫీట్ల రోడ్డు ఉన్న పరిధిలో 4 అదనపు అంతస్తులు, 80 ఫీట్ల రోడ్డు ఉన్న ప్రాంతంలో 5 అదనపు అంతస్తుల వరకు అనుమతి >>2

### అంకెల బడ్జెట్ కాదు..

# మాది ప్రజా బడ్జెట్

**తొలివిడత రైతు భరోసా విడుదల**

**దేశంలో ఎక్కడా లేనివిధంగా బీమా పథకం**

**మీడియాతో డి.సిఎం భట్టి విక్రమార్క**



ఆదివారం ఖమ్మం కాంగ్రెస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

**ఖమ్మం, మార్చి 22, ప్రభాతవార్త:** మాది పీపుల్స్ బడ్జెట్. సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఉపయోగపడే సంఖ్యలు ఇవి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.రాష్ట్రంలో పుట్టడం మా అదృష్టం, ఈ రాష్ట్రంలో జీవించడం మా భాగ్యం అన్న భరోసాను ప్రభుత్వం కల్పిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం కాంగ్రెస్ భవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇల్లు ఎక్కడ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిడ్డ పుట్టినప్పటినుంచి చనిపోయే పండు ముదుసలి వరకు ప్రతి ఒక్కరికి ఏదో రకంగా ఒక ప్రభుత్వ పథకం దేశంలో ఎక్కడా లేని రీతిలో ఈ రాష్ట్రంలో అందుతుంది అన్నారు.కులం, మతం, ప్రాంతం భేదం లేకుండా రాష్ట్రంలో అందరికీ 5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకం. సిపెక్ సర్వే ఆధారంగా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా బీమా పథకం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.మన పిల్లలే రేపటి సంపద, వారి భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తుగా భావించి వారంలో ఆరు రోజులు పౌష్టిక ఆహారం అందుబాటులోకి తీసుకువచ్చా. ఆరు రోజుల్లో మూడు రోజుల పాటు రాగిజావ మూడు రోజులపాటు మన బిడ్డలకు >>2



## కాంగ్రెస్‌కో దండం..

**25న రాజినామా చేస్తా..**

**కార్యకర్తలతో మాట్లాడి భవిష్యత్ కార్యక్రమం నిర్ణయిస్తా**

**-సీనియర్ నేత జీవన్‌రెడ్డి**

**హైదరాబాద్,మార్చి 22,ప్రభాతవార్త:** "ఆత్మాభిమానం చంపుకొని, అవమానాలను భరిస్తూ పార్టీలో కొనసాగలేను.మీకో దండం మీ పార్టీకో దండం, పార్టీలో గౌరవం లేని చోట ఉండటం కంటే బయటకు రావడమే మంచిదని నిర్ణయించుకున్నాను." అంటూ నిన్న మంత్రులకు తెగేసి చెప్పిన జీవన్‌రెడ్డి మార్చి 25న తన భవిష్యత్ కార్యకర్తలతో సమావేశం కాబోతున్నారు. 1984 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఆయన కొనసాగుతూ వస్తున్నారు. 1983లో ఎన్టీఆర్ క్యాబినెట్‌లో >>2

## ఇక పాలిటెక్నిక్, ఐటిఐలు స్కిల్స్ వర్సిటీలోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి22:** నైపుణ్యాభివృద్ధి విద్యలో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి.ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, >>2

**30 యేళ్ల క్రితమే ఐటి రంగాన్ని అభివృద్ధి చేశా..**

**ఎపిలో 15% వృద్ధి రేటు సాధించాం..**

**విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది..**

**హైదరాబాద్‌ను గ్లోబల్‌సిటీగా మార్చడానికి ఎంతో కష్టపడ్డా**

**ఐఎస్‌బి సమ్మిట్‌లో ఎపి సిఎం చంద్రబాబు**

# క్వాంటం దిశగా అడుగులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 22 ప్రభాతవార్త:** నేడు ప్రపంచం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్ టెక్నాలజీ దిశగా అడుగులు వేస్తుందని, డ్రోన్లు, ఎయిర్ ఆంబులెన్సుల విస్తరణ వేగంగా జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడంలో తాము ఎంతో కష్టపడ్డామని కీలక వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని ఇండియాన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బి)లో నిర్వహిస్తున్న సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్‌లో ఆదివారం చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్తు సాంకేతికత, ఏఐ వినియోగం, డేటా భద్రతపై మాట్లాడుతూ ఐటి రంగం ప్రాముఖ్యతను గుర్తించిన తాము 30 ఏళ్ల క్రితమే ఐటి రంగం మీద దృష్టి కేంద్రీకరించామని అన్నారు. నేడు డ్రోన్ టెక్నాలజీకి అత్యధిక ప్రాధాన్యత ఉందని, ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీని ప్రపంచం గమనిస్తుందన్నారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా డేటా సెంటర్లు, పాలసీల రూపకల్పన చేపట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. విద్యుత్ సంక్షోభం నుంచి మిగులు విద్యుత్ సాధించే విధంగా నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పయనించిందని, ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ, విండ్, సోలార్ విద్యుత్ రంగాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ వినియోగంలో దక్షిణ భారత్‌లోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. 2014 నుంచి 2019మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని, నేడు మరోసారి అభివృద్ధి, సాంక్షేమాలను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థాయి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా >>2



ఐఎస్‌బి సమ్మిట్‌లో ఎపి సిఎం చంద్రబాబు



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హౌరాలో బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళతో మాట్లాడుతున్న శిబ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి రుద్రనీల్ ఘోష్

## నేటి సాయంత్రం కేబినెట్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి22:** సోమవారం సాయంత్రం 5 గంటలకు అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో రాష్ట్ర కేబినెట్ సమావేశం జరుగనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కేబినెట్ సమావేశానికి మంత్రులు అధికారులు హాజరు కానున్నారు.ఈ సమావేశంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే పలు కీలక బిల్లులపై చర్చించి ఆమోదించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల నుంచి 10% కోతవిధించి ఆ సొమ్మును వారి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిన నేపథ్యంలో కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ మేరకు అసెంబ్లీలో చట్టాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇదే సమయంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే మెసేజ్‌లను పెట్టే వారిపై చర్యలు తీసుకునేందుకు చట్టం తేనున్నారు. కాగా, సోమవారం ఉ.10 గంటలకు అసెంబ్లీ,మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీలో 2వైద్య విధాన పరిషత్ సవరణ బిల్లు,రెగ్యులరైజేషన్ స్టాఫ్ ప్యాటర్న్ సవరణ బిల్లు) బిల్లులు ప్రవేశపెట్టిన తర్వాత బడ్జెట్‌పై చర్చ ప్రారంభం కానుంది. కాగా.అసెంబ్లీ,మండలిలో ప్రశ్నోత్తరాలు ప్రారంభం కానున్నాయి.

## కాంగ్రెస్‌కో దండం..

>> ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు.నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రి వర్గంలో పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేశారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా జగిత్యాలలో పోటీ చేసి టిడిపి అభ్యర్థి గొడిశాల రాజేశం గౌడ్ చేతిలో ఓటమిపాలైనా ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగినారు. 1989లో జీవన్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచి,1994లో ఓటమిపాలైనారు.అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే రాష్ట్ర చేనేత జౌళీశాఖ మంత్రిగా వ్యవహరించిన ఎల్.రమణ పార్లమెంట్ సభ్యుడిగా కరీంనగర్ నుంచి ఎన్నిక కావడంతో జరిగిన 1996లో జరిగిన ఉప ఎన్నికలలో ఆయన తిరిగి ఆయన గెలిచి 2009వరకు వైఎస్‌ఆర్ కేబినెట్‌లో రోడ్లు భవనాలుశాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో ఎల్ రమణ చేతిలో ఓటమిపాలైనారు. 2014లో టిఆర్‌ఎస్ ప్రభంజనం ఎదిరించి జీవన్‌రెడ్డి విజేతగా నిలిచారు. 2018లో జరిగిన ఎన్నికలలో ఓటమిపాలైనప్పటికి ఆదిలాబాద్,కరీంనగర్,నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎన్నికలలో ఆయన ఎమ్మెల్సీ గా గెలుపొందారు. 2023 శాసనసభ ఎన్నికలలో ఎమ్మెల్యేగా, 2024 నిజామాబాద్ లోక్‌సభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చినప్పటికి ఆయన ఓటమిపాలైనారు. దీనితో కాంగ్రెస్ జీవన్‌రెడ్డి నాయకత్వంపై విశ్వాసం కోల్పోయింది. జగిత్యాలలో బిఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన డా.సంజయ్‌ను పార్టీలోకి తీసుకోవడంతో జీవన్‌రెడ్డికి ఆగ్రహం కలిగించింది. గత 20 నెలలుగా పార్టీ పిరాయింపులపై ఆయన పార్టీ అధినాయకత్వంపై విభేదిస్తూ వచ్చారు. ఇక పార్టీల ఇమడలేక ఆయన అనుచరులకు ఆదివారం పత్రికా ప్రకటనతో విజ్ఞప్తి చేశారు.నాలుగు దశాబ్దాలకుపైగా, నాతో కలిసి ప్రయాణం చేసిన రాజకీయ సహచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు భవిష్యత్ కార్యాచరణ కోసం తనతో సమావేశం కావాలని కోరారు. గత 20 మాసాల నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను మీరు గమనిస్తున్నారనీ ఆయన వివరించారు. ఈ పరిస్థితులలో, ఇంకనూ అవమానాలకు గురి అవుతూ, మానసిక క్షోభతో, కాంగ్రెస్ పార్టీలో కొనసాగటం సాధ్యంకాని పరిస్థితులలో మన రాజకీయ ప్రస్థానంపై చర్చకు రావాలని ఆయన కోరారు. మార్చి 25 జగిత్యాల గొల్లపల్లి రోడ్ బండారి గార్డెన్ లో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని నాకు మానసిక స్థైర్యం కలిగిస్తు, మార్గదర్శకం కాగలరని జీవన్‌రెడ్డమనవి చేశారు. ఆయన బిఆర్‌ఎస్‌లో చేరుతారని ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బలంగా ప్రచారం జరగుతోన్నది. బిఆర్‌ఎస్ నుంచి ఫిరాయించిన పది నియోజక వర్గాలలో కాంగ్రెస్ వీరవిధేయులు జీవన్‌రెడ్డి తరహాలోనే అసంతృప్తితో ఉన్నారు. వీరంతా కూడా జీవన్‌రెడ్డి తరహాలోనే ఇంకా రెండున్నరేళ్ళ కాంగ్రెస్‌పాలన ఉన్నప్పటికి పార్టీకి దండం పెట్టి వారి రాజకీయభవిష్యత్ కోసం ప్రత్యామ్నయ రాజకీయ పార్టీలవైపు అడుగు వేయాలని చూస్తున్నారు. బిజెపి,బిఆర్‌ఎస్ అసంతృప్తులకు గాలం వేసే పనిలో ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీకి ఏ పార్టీ సరైన ప్రత్యర్థని భావిస్తారో అటువైపు ఈ నాయకులు అడుగులు పడబోతున్నట్ల రాజకీయ పరిశీలకు అభిప్రాయపడుతున్నారు.

## ఇదో పరీక్ష.. పాసవుదాం

>> లాజిస్టిక్స్ వ్యవస్థను నిర్వహించాలని ప్రధాని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులను నిశితంగా గమనిస్తూ, వినియోగదారులకు, పరిశ్రమలకు భారం కలగకుండా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోదీ చర్చించారు. గ్యాస్,పెట్రోల్, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని, సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సంక్షోభ పరిస్థితులపై ప్రధాని మోదీ స్పందిస్తూ. ఇది మన దేశ సామర్థ్యానికి, సహనానికి ఒక కీలక పరీక్ష అని అభివర్ణించారు. పశ్చిమ ఆసియా సంఘర్షణ వల్ల తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రజా చైతన్యం, ప్రభుత్వ కృషీ తోడవాలని ఆయన ఆకాంక్షించారు. సరఫరా గొలుసులో తలెత్తే అడ్డంకులను అధిగమించేందుకు నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన హామీ ఇచ్చారు. ప్రపంచ ఇంధన రవాణాలో దాదాపు 20 శాతం వాటా కలిగిన హార్ముజ్ జలసంధి ప్రస్తుతం ప్రధాన ఆందోళనకర అంశంగా మారింది. ఇరాన్ ఈ మార్గంపై పట్టు సాధించి నౌకల రాకపోకలను పరిమితం చేయడం వల్ల భారతదేశానికి చేరే చమురు సరఫరాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతీకార దాడుల వల్ల ఈ కీలక జలమార్గం యుద్ధ భూమిగా మారింది.

పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రధాని మోదీ దౌత్యపరమైన వ్యూహాలను కూడా అమలు చేస్తున్నారు. సంఘర్షణ మొదలైనప్పటి నుండి ఆయన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, జోర్డాన్ వంటి గల్ఫ్ దేశాలతో పాటు ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల అధినేతలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రాంతీయ శాంతిని పునరుద్ధరించడం ద్వారా ప్రపంచ ఇంధన భద్రతను కాపాడాలని భారత్ కోరుతోంది. అత్యవసర కేబినెట్ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పూరి, శరభానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌లు హాజరయ్యారు.

## టిడిఆర్‌లో మార్పులు

>> ఇవ్వనున్నారు. అయితే ఇవి అగ్నిమాపక శాఖ, ఏయిర్‌పోర్టు నిబంధనలను అనుగుణంగా ఇవ్వనున్నారు. సెట్‌బ్యాక్‌లను సైతం సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైరైజ్ భవనాల్లో టిడిఆర్ వినియోగించి నిర్మించే భవనాలలో పలు సడలింపులు చ ఏశారు. 10 శాతం వరకు సడలింపు పొందే అవకాశం కల్పించారు.

అయితే, భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్‌బ్యాక్ ఉండాలనే నిబంధనను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. ఒకవేళ మాస్టర్ ప్లాన్ రోడ్లను మార్చినప్పుడు, తొలగించినప్పుడు, దరఖాస్తుదారులు వర్తించే కన్వర్షన్ ఛార్జీలు చెల్లించడం, దానికి సమానమైన టిడిఆర్ సమర్పించే వెసులుబాటును కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం జారీ చేసిన కొత్త నిబంధనల కారణంగా టిడిఆర్ వినియోగం పెరగడంతోపాటు భవన నిర్మాణాలకు, రియల్‌ఎస్టేట్‌కు కొత్త ఊపు ఇచ్చినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తుంది.

## వైద్య విధాన పరిషత్ బిల్లు

>> ప్రభుత్వానికి సమర్పించింది. వైద్య విధాన పరిషత్‌ను డిఎస్‌హెచ్‌ఎస్‌గా మార్చాలంటే చట్టం చేయాల్సిన అవసరం ఉన్నందున.. వైద్య, ఆరోగ్య శాఖ పంపించిన ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో బిల్లును ప్రతిపాదించనుంది. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొంది చట్టం వస్తే.. టివివిపి కింద జిల్లా పనిచేస్తున్న 184 ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలాల్లో పనిచేస్తున్న 12,589 మందికి లబ్ధి చేకూరనుంది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రస్తుతం సొసైటీ కింద ఉండడం వల్ల ఇందులో పనిచేసే వైద్యులు, నర్సులు, సిబ్బందికి 010 కింద వేతనాలు అందడం లేదు. వారి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాల్సి వస్తుంది. దీంతో ప్రతి నెలా చాలా మంది ఉద్యోగులకు జీతాలు చాలా ఆలస్యంగా అందుతున్నాయి. ఫలితంగా ఉద్యోగులు, సిబ్బంది, వైద్యులు చెల్లించాల్సిన ఈఎంఐలతోపాటు ఇతర అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా టివివిపి కింద జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు కలిపి మొత్తంగా 184 వరకు ఉన్నాయి.

వాటిల్లో సుమారు 12,589 మంది ఉద్యోగులు, సిబ్బంది,నర్సులు, వైద్యులు ఉన్నారు. అందులో పనిచేస్తున్న వారిలో 4300 మంది వైద్యులే ఉన్నారు. టివివిపి కొత్త డిఎస్‌హెచ్ ఎస్‌గా మారితే వారికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సర్వీస్, పదవీ విరమణ, ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయి.

## వారం - వర్జ్యం

23-03-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
పంచమి సా.6.40
కృత్తిక రా.8.50
వర్జ్యం : ఉ.9.46-ఉ.11.15
దు.మ.12.38-మ.1.27, 2)మ.3.04-మ.3.53
శుభసమయం:ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** భాగస్వాములతో కలిసి చేసే స్పెక్యులేషన్ వ్యవహారాలకు దూరంగా ఉండండి. ఋణాలు చేస్తారు.

**వృషభం:**రాజకీయ సంబంధమైనటువంటి స్నేహాలు, పరిచయాలు వృద్ధిచెందుతాయి. నూతన విద్యావకాశాలు కలవు.

**మిథునం:** దీర్ఘకాలిక సమస్యలు చికాకు కలిగిస్తాయి. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కర్కాటకం:**పనులలో పురోగతి ఉంటుంది. సంతానంనకు విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.విలువైన వస్తువులు కొనుగోలు.

**సింహం:**ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటిలో శుభకార్య ప్రస్తావన ఉంటుంది. స్థలాలు కొనుగోలు.

**కన్య :** పెండింగ్ కార్యక్రమాలు పూర్తిచేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశించిన రీతిలో ఉండవు. పరిశోధనలు ఫలిస్తాయి.

**తుల :** మాతృవర్గీయ బంధువుల ద్వారా ఆశించినటువంటి సహాయాన్ని పొంద గలుగుతారు. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**వృశ్చికం:**కోర్టు కేసులు పరిష్కారమై ఊరట చెందుతారు. కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారములను చక్కబెడతారు.

**మకరం:** ఆధునికత కన్న సనాతన సాంప్రదాయాలకు విలువనిస్తారు. ఆరోగ్యంలో క్రమవృద్ధి కనబడుతుంది.

**కుంభం:** అతికష్టం మీద ఋణ ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఉద్యోగాల పరంగా శ్రమ అధికంగా వుంటుంది.

**మీనం :** వ్యాపార విస్తరణకు అవసరమైన పెట్టుబడి విషయంలో స్తబ్ధత నెలకొంటుంది. ఆరోగ్య విషయం జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అంకెల బడ్జెట్ కాదు.. మాది ప్రజా బడ్జెట్

>> పాలు అందిస్తామన్నారు. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలంటే దేహదారుఢ్యం కావాలి అందుకు పౌష్టిక ఆహారం అవసరమని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎదిగే పిల్లలకు బలమైన ఆహారం ఇస్తే మెదడు చురుకుగా పని చేస్తుందని తెలిపారు.యుక్త వయసులో తమ కెరీర్ కు సంబంధించి సరైన నిర్ణయాలు తీసుకునేందుకుఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం. మన పిల్లల పట్ల మానవీయ కోణంతోపాటు మన మానవ వనరులను సాన పట్టి వజ్రాలుగా మార్చేందుకు ఈ పథకాలు తీసుకొచ్చామన్నారు.విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇంగ్లీష్ మీడియాని ప్రోత్సహిస్తున్నాం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించడం, డైట్ చార్జీలు పెంచడం, ప్రతి నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్, అల్పాహారం భోజనం డ్రెస్ పుస్తకాలు అన్ని ఉచితంగా అందిస్తూ వారు చదువుకున్నంత కాలం ఉచితంగా చదివించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.వారం వారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం, ఈ సంవత్సరం కూడా నియోజకవర్గానికి 1000 చొప్పున మంజూరు చేస్తున్నాం. రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండొద్దనేదే మా ప్రభుత్వ లక్ష్యం. ఎంత త్వరగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే అంత త్వరగా బిల్లులు చెల్లిస్తాం అన్నారు.పని లేని వారికి పని కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని పెద్ద ఎత్తున ముందుకు తీసుకువెళ్తాం రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా ఇందులో 1.06 కోట్ల కుటుంబాలకు ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తూ ఈ ప్రభుత్వం మమ్ములను జాగ్రత్తగా చూసుకుంటున్న భరోసా కల్పించాంఉద్యోగస్తుల కుటుంబాలకు నగదు రహిత వైద్య చికిత్స కార్డులు. రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఈ తరహా పథకం తీసుకొచ్చాం అని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగికి ప్రమాదం జరిగితే 1.02 కోట్ల రూపాయల ప్రమాద బీమా . 60 సంవత్సరాల వరకు పది లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాం అన్నారు.రాష్ట్రంలో అనేక రంగాలకు రాయితీలు కల్పిస్తున్నాం వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే68,89,955 పట్టాదారులకు 3446.94 కోట్లు రైతు భరోసా కింద విడుదల చేసాం. 45 రోజుల్లో మూడు విడతల్లో రైతుల అందరి అకౌంట్లో రైతు భరోసా జమ చేస్తాం తెలిపారు.విదేశాల్లో మన బిడ్డలకు ఉపాధి కోసం సీఎం ఓవర్సీస్ ఎంప్లాయ్మెంట్. మన మానవ వనరులకు విదేశాల్లో అత్యధిక డిమాండ్ ఉంది. మన యువతకు ఆయా దేశాల భాష నేర్పడమే కాదు, అక్కడి రాయబార సంస్థలతో మాట్లాడి పాస్పోర్ట్ వీసా వంటివి టామ్ కామ్ ద్వారా సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు.హాస్టల్లో వైద్యానికి కొరత లేదు 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సహాయం అందుతుంది.ఈ సంవత్సరం కొత్తగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో 14 వేల బెడ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఇప్పటివరకు 30 వేల మల్టీ స్పెషాలిటీ వసతి కలిగిన బెడ్స్ ఉన్నాయి. మొత్తంగా 44,029 మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బెడ్స్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. 12,720 బెడ్స్ సెకండరీ స్థాయి హాస్పటల్లో అందుబాటులో ఉన్నాయి. టిమ్స్, నిమ్స్, తో పాటు ఉస్మానియా కొత్త బిల్డింగ్, సనత్ నగర్, ఎల్బీనగర్ వంటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ కొరితన అందుబాటులోకి తీసుకువచ్చి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వైద్య సదుపాయాలు ఉచితంగా రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం 14 వేల కోట్లు రైతుల పక్షాన ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుంది. రాష్ట్రంలో 29 లక్షల పంపుసెట్ల ద్వారా రైతులు ఉచితంగా విద్యుత్ సౌకర్యం పొందుతున్నారు అని అన్నారు.విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటి మాజీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయి కుమార్,సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, కాపా మురళి కృష్ణ బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్,వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,మూడుముంతల గంగరాజు యాదవ్,పగడాల మంజుల, బుక్క కృష్ణవేణి,కిలారి అనిల్ కుమార్, గాదెల ఝాన్సీ,శ్రీలత, కాపా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్వాంటం దిశగా అడుగులు

>> విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, 15శాతం వృద్ధిరేటు నిలకడగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాభివృద్ధికి విజన్ రూపకల్పన చేశామని పేర్కొన్నారు. అమరావతిలో త్వరలో క్వాంటమ్ కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుందని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతుందని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రీజియన్లుగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి తరువాత మరో పెద్ద ప్రాజెక్టు పోలవరం అని, 2019 వరకు 72శాతం పనులు పూర్తి చేసినా గత పాలకులు దాన్ని పట్టించుకోక ధ్వంసం చేశారని అన్నారు. త్వరలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీని అనుసంధానించి స్మార్ట్ సిటీగా, బ్లూ, గ్రీన్ రాజదాని నగర నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో ఎంతో కష్టపడ్డామని గుర్తు చేశారు. తాను ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజుల్లోనే ఢిల్లీ వెళ్లి బిల్‌గేట్స్‌ను కలిశానని, భారతీయులకు గణితం, ఇంగ్లీష్ మీద ఉన్న పట్టును ఆయనకు వివరించడం జరిగిందన్నారు. నగరంలో మైక్రోసాఫ్ట్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు బిల్‌గేట్స్‌ను ఒప్పించామని, నాడు అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బిల్ క్లింటన్ ఆహ్వానం లేకుండానే నగరానికి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన సూచనతోనే టోనీ బ్లెయిర్ సైతం హైదరాబాద్ నగరాన్ని సందర్శించాడని తెలిపారు. ఐటీని నగరంలో విస్తరించేందుకు మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి చేతుల మీదుగా హైటెక్‌సిటీ ప్రారంభోత్సవం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5వేల ఎకరాల భూసేకరణ చేశామని, నల్సార్, ట్రిపుల్‌ఐటీ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలను తామే ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాదా తాగునీటి ఇబ్బందులను గుర్తించి కేవలం 9 నెలల్లోనే క్రిష్ణా నది నీటిని నగరానికి తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బి అధికారులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదివారం నర్మెటలో ఆయిల్ పాం ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తుమ్మల, వివేక్, పొన్నం, పొంగులేటి, దామోదర తదితరులు

## రైతు ఖాతాల్లోకి 9 వేల కోట్లు

>> అందరం కృషి చేసి రైతులను బంగారు తెలంగాణలో భాగస్వాములను చేద్దామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిట అందించడం జరుగుతుందన్నారు. 69 లక్షల మంది మహిళ సభ్యులను కోటి మంది సభ్యులుగా చేసి కోటేశ్వరులను చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు.ఎటిలో శిక్షణ పొందే వారికి ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటానని తెలిపారు. సాంకేతిక విద్యవైపు మొగ్గు చూపాలన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్, దామోదర రాజనర్సింహ్మా,గడ్డం వివేక్‌వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. బహిరంగ సభలో ఎంపి వేం నరేందర్‌రెడ్డి,ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, నవీన్‌యాదవ్,బీర్ల అయిలయ్యయాదవ్, అయిల్‌ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘరెడ్డి, నిర్మల జగ్గారెడ్డి,పార్టీ నాయకులు పూజల హరికృష్ణ, జిల్లా ఆర్టీఏ సభ్యులు డాక్టర్ సూర్యచంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా మాపై దాడులుచేస్తే.. మేం భారత్‌పై దాడులుచేస్తాం!

### పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్

**కరాచి, మార్చి 22:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ భారత్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఒకప్పుడు భారత్‌లో పాక్ హైకమిషనర్‌గా పని చేసిన ఆయన ఏకంగా భారత మెట్రో నగరాలపై అణు దాడులు చేస్తామంటూ బహిరంగ హెచ్చరికలుచేసారు. అమెరికా తమ అణు కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తే భారత్‌లో ఢిల్లీ, ముంబైలపై బాంబులు వేస్తామని చెప్పారు. తాజాగా నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అబ్దుల్ బాసిత్ అమెరికా లేదా ఇజ్రాయెల్ నుంచి పాక్‌కు ఏదైనా ముప్పు వాటిల్లితే భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటామనిఅన్నారు. ఒకవేళ అమెరికా మా అణు కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులుచేస్తే ప్రతీకారంగా మేం ఢిల్లీ, ముంబై వంటి భారత నగరాలపై బాంబులు వేస్తామని నోరుపారేసుకున్నారు.అమెరికాపై కోపాన్ని భారత్‌పై చూపించాలనడానికి ఆయన ఒక వితండ వాదం చేసారు. అమెరికా మాపై దాడిచేస్తే గల్ఫ్ దేశాల్లో ఉన్న వారి స్థావరాలపై గానీ, ఇజ్రాయెల్‌పై గానీ దాడులు చేయడం మాకు భౌగోళికంగా కష్టతరం కావచ్చు. భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం మాకు చాలా సులువు. మరో ఆలోచన లేకుండాభారత్‌పై దాడులకుదిగుతాం.ఇందుకు పాక్ ఏ మాత్రం వెనకాడదని బాసిత్ వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ తన అణుకార్యాచరణపరంగా ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో బాసిత్ ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ ఆయన కాశ్మీర్ అంశంపై, భారత విదేశాంగ విధానంపై అనేకసార్లు విషం చిమ్మారు.



ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఆదివారం అగర్తలా శివార్లలోని ఒక పొలంలో బిందెలతో తాగు నీటిని మోసుకెళ్తున్న మహిళలు

## ఇక పాలిటెక్నిక్, ఐటిఐలు స్కిల్స్ వర్సిటీలోకి

>> 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.తెలంగాణ విద్యా కమిషన్ అందించిన ఖవిద్యా విధానం2026ఖ సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గతఏడాది ఆగస్టులో పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (శిశి) విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్స్‌లర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## ఇరాన్ దాడులు

>> తమ దేశంలోని 88 వేల ఆవాసాలపై దాడులుచేసాయని, అందుకు ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. బాగ్దాద్‌లోని ఇరాకి నిఘా కేంద్రంపై దాడి జరిగింది. ఒకఅధికారి కూడా చనిపోయినట్లు ఇరాక్ ప్రకటించింది. ఇదిలా ఉంటే హర్ముజ్ జలసంధిని పునరుద్ధరించకపోతే ఇరాన్‌లోని భారీ విద్యుత్‌కేంద్రాలన్నింటిపైనా దాడులుచేస్తామని, 48 గంటల్లో హర్ముజ్‌ను పునరుద్ధరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన అల్టిమేటమ్‌పై ఇరాన్‌కూడా అదే స్థాయిలోస్పందించింది. అమెరికా మిత్రదేశాల్లోని జలశుద్ధికేంద్రాలు, పర్యాటక స్థావరాలే లక్ష్యంగా దాడులుచేస్తామని హెచ్చరించింది. మరోవైపు అమెరికా యుద్ధం ముగింపువైపే ఆసక్తి చూపుతోంది. ఆయుధ సంపద కరిగిపోవడం, మరిన్ని కొత్త ఆయుధాలకు భారీ నిధులు అవసరమని సెంట్‌కామ్ ఇప్పటికే ప్రతిపాదనలు చేయడం, దీనికితోడు స్వదేశంలోనే ఇరాన్‌పై యుద్ధం పట్ల అమెరికాలో విముఖత పెరుగుతుండటం వంటివి ట్రంప్ యుద్ధవిరమణకు చర్చలవైపు మళ్లించింది. యుద్ధం మొదలైఆదివారానికి 23 రోజులు దాటినప్పటికీ ఎక్కడా తగ్గుతున్న దాఖలాలు కనిపించడంలేదు. ఇపుడు కొత్తగా ఇంధన కేంద్రాలు టార్గెట్ అవుతున్నాయి.

**క్షిపణి దాడి కేంద్రాన్ని సందర్శించిన నెతన్యాహు**

ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆదివారం అరద్‌లోని ఇరాన్‌క్షిపణి దాడిచేసని ప్రాంతాన్ని సందర్శించారు. గడచిన 48 గంటల్లో కూడా ఇరాన్ పౌర నివాసప్రాంతాలను టార్గెట్‌గాచేసిందని, సామూహిక హత్యలను అస్త్రంగా మలుచుకుంటోందని నెతన్యాహు ఆరోపించారు. జెరూసలెంలో మతపరమైన కేంద్రాలపైనా దాడులుచేస్తోందని ఆరోపించారు. ఇపుడు ఖండాంతర క్షిపణులను నాలుగువేల కిలోమీటర్లదూరంలోని డీగో గార్షియపై కూడా ప్రయోగిస్తోందని అన్నారు. ఇప్పటికే యూరోపియన్ దేశాలు, సైప్రస్‌పైనా దాడులుచేసాయని, అంతర్జాతీయ రవాణారూటును నిలిపివేసి ప్రపంచాన్ని మొత్తం తమ గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తోందని, ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆరోపించారు.

ఇందులోభాగంగానే ఇపుడు సమర్థుడైన కొత్త మధ్యవర్తికోసం అమెరికా అన్వేషిస్తోంది. నాతాంజ్‌లోని అణుశుద్ధికేంద్రంపై దాడి జరిగినప్పటికీ చుట్టుపక్కల్లో రేడియేషన్‌ప్రభావం ఏమీ లేదని అంతర్జాతీయ అణు ఏజెన్సీ ఛీఫ్ చెప్పడంతో ఇరాన్‌ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే డిగోగార్షియాలపై మేం దాడిచేయలేదని తమ క్షిపణులన్నీ రెండువేల కిలోమీటర్లపరిధిలోనివేనని ఇరాన్‌ప్రకటించింది.

**శత్రునౌకలు మినహా అన్నీ విడుదలచేస్తాం...ఇరాన్**

ఇదిలా ఉంటే ట్రంప్ ఇచ్చిన 48 గంటల గడువు ప్రకటనకు ముందే ఇరాన్ సంచలనప్రకటన విడుదలచేసింది. శత్రుదేశాలు మినహా మిగిలిన అన్ని దేశాల నౌకలు హర్ముజ్‌నుంచి వెళ్లేందుకు అనుమతిస్తున్నట్లుప్రకటించింది. ఆదిశగానే ఏర్పాట్లుచేసుకోవాలని వెల్లడించింది. అమెరికా, గల్ఫ్‌దేశాల నౌకలను మాత్రం అడ్డుకుంటామని, ఉల్లంఘించి వెళ్లాలనుకుంటే పేల్చివేస్తామని ఇరాన్ ఐఆర్‌జిసి ప్రకటించింది. ఇదిలా ఉంటే హర్ముజ్‌జలసంధిని తెరిపించేక్రమంలో అమెరికాకు మద్దతుగా బ్రిటన్ అణుజలాంతర్గామిని పంపిస్తోంది.

హర్ముజ్ జలసంధికి సమీపంలోనే ఈనౌకను లంగర్‌వేసారు. అదేవిధంగా భారత్‌కు వచ్చే నౌకలన్నింటికీ హర్ముజ్‌జలసంధిలో ఎలాంటి ఆందోళన ఎదురుకాలేదు. భారత్‌కు సజావుగా నౌకల రాకపోకలు కొనసాగాయి.

## అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా

### ఎక్స్ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి పోస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 22:** రాష్ట్రంలోని 70లక్షల మంది రైతుల కోసం రూ.9వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా దీనికి శ్రీకారం చుట్టిన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో రేవంత్‌రెడ్డి పోస్ట్ చేశారు. అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా. రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా. 70 లక్షల మంది రైతన్నల కోసం రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు నేడు శ్రీకారం చుడుతున్నాం. సిద్ధిపేట జిల్లా నర్మెట గ్రామ వేదికగా మరోసారి మా పాలనలో రైతే రాజు అని రుజువు చేస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆర్థిక సాయంతో చేతులు దులుపుకోవడం కాదు.. కేవలం 17 నెలల వ్యవధిలో పామ్ ఆయిల్ పరిశ్రమ మొదలు పెట్టి, పూర్తి చేసి రైతు లోకానికి అంకితం చేశాం, దానికి కొనసాగింపుగా రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేశాం' అని సిఎం పేర్కొన్నారు.

# పరీక్ష కేంద్రంలో 'జీరో మొబైల్ జోన్'

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇకపై జరిగే బోర్డు పరీక్షలు జీరో మొబైల్ జోన్‌గా కొనసాగనున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఎస్‌సి పరీక్షల నుంచే దీనిని అమలు చేయనున్నారు. మొన్న జరిగిన ఎస్ఎస్‌సి పరీక్షల్లో నిజామాబాద్ జిల్లాలో హిందీ ప్రశ్నాపత్రం వాట్సాప్ ద్వారా బయటికొచ్చిన నేపథ్యంలో అందుకు బాధ్యులైన వారికి పరీక్షల విధుల నుంచి తప్పించి సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇకపై ఎస్ఎస్‌సి పరీక్షలు జరిగే పరీక్షా కేంద్రాలను జీవో మొబైల్ జోన్‌గా పరిగణించనున్నారు. పరీక్షా కేంద్రంలోనికి చీఫ్ సూపరింటెండ్స్‌తోపాటు ఏ ఒక్కరూ కూడా మొబైల్ ఫోన్‌ను ఉపయోగించరాదని ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించినట్టయితే వారిపై కఠినమైన చర్యలు తప్పవని ఉత్తర్వుల్లో హెచ్చరించారు. జిల్లా విద్యాధికారులందరూ తప్పకుండా నిబంధనలను అమలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి, దాని ప్రాంగణంలోకి ఎవరూ మొబైల్ ఫోన్లు, ఇతర ఏవైనా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావడం, కలిగి ఉండటం, ఉపయోగించడం చేయరాదని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన ఏ సందర్భమైనా తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని, సీసీఏ నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలతో పాటు, తెలంగాణ పబ్లిక్ పరీక్షల చట్టం, 1997 (చట్టం 25 ఆఫ్ 1997) కింద శిక్షార్హమైన చర్యలకు దారితీస్తుందని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్ర ప్రాంగణంలో ఉన్న బోధన, బోధనేతర, ఇతర సిబ్బంది అందరూ, హాజరు రిజిస్టర్‌తో పాటుగా, రోజువారీ డ్యూటీ రిజిస్టర్‌లో కూడా సంతకం చేసేలా ప్రధాన సూపరింటెండెంట్లు(సీఎస్)లు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది కేంద్రంలో గానీ, దాని ప్రాంగణంలో గానీ ఎలాంటి మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాన్ని తీసుకురాలేదని, తమ వద్ద ఉంచుకోలేదని ధృవీకరించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన రిజిస్టర్‌ను అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ తప్పనిసరిగా నిర్వహించాలని, వాటిని తనిఖీ(ఇన్స్‌పెక్షన్) సందర్శన అధికారులందరూ(స్క్వాడ్స్) ధ్రువీకరణ కోసం దీనిని అందుబాటులో ఉంచేలా సీఎస్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలో 'జీరో మొబైల్ జోన్'ను నిర్వహించడానికి చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేకంగా బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోనఇ సిబ్బంది అటువంటి పరికరాలను కలిగి ఉండటం, ఉపయోగించడం అనేది తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించబడుతుందని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

### ఉల్లంఘిస్తే కఠినచర్యలు
### ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్

## నేటితో ముగియనున్న ఐసెట్ దరఖాస్తు గడువు

### ఇప్పటి వరకు 45వేల దరఖాస్తులు.. మే 13, 14న పరీక్ష

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబిఏ, ఎంసిఏ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఐ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తు గడువు నేటి(సోమవారం)తో ముగియనుంది. దరఖాస్తు గడువును ఈ నెల 16 నుంచి 23 వరకు పెంచిన నేపథ్యంలో నేటితో గడువు కాస్త ముగియనుంది. ఇప్పటి వరకు ఐ సెట్-2026కి సుమారు 45వేల దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. ఐ సెట్‌కి సంబంధించి.. ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ వెలువడగా.. ఫిబ్రవరి 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించారు. ఐ సెట్-2026 పరీక్షను మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించనుంది. నోటిఫికేషన్ వెలువడిన తరువాత ఫిబ్రవరి 12 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. నోటిఫికేషన్‌లో మార్చి 16 వరకు దరఖాస్తుల స్వీకరకు తుది గడువుగా ప్రకటించగా.. అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువును కాస్త నేటి(మార్చి23) వరకు పొడిగిస్తున్నట్టు ఐ సెట్ అధికారులు ప్రకటించారు. దీంతో గడువు కాస్త నేటితో ముగియనుంది. ఐ సెట్-2026 ఫీజుకు సంబంధించి.. ఎస్సీ, ఎస్టీ, పిహెచ్(దివ్యాంగ) అభ్యర్థులకు రూ. 550 ఫీజు కాగా ఇతరులకు రూ. 750గా నిర్ణయించారు. మే 13, 14న పరీక్షలను నిర్వహించనున్నారు. మే 13న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉదయం సెషన్‌ను, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు. మే 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒకటే సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు.

## బాసర ట్రిపుల్‌ఐటి కాలేజీ విద్యార్థులకు సెలవులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 22:** ఇటీవల చోటు చేసుకున్న వరుస పరిణామాల నేపథ్యంలో బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీ యాజమాన్యం ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి పీయూసీ 1,2.. ఇంజనీరింగ్ 1,2 సంవత్సరాల విద్యార్థులకు సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించింది. మళ్లీ క్లాసులు ఎప్పుడు నుంచి ప్రారంభించేది తర్వాత ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ మేరకు అకడమిక్ అండ్ ప్లానింగ్ అసోసియేషన్ డీన్ ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల విద్యా క్యాలెండర్‌కు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగినచర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విద్యార్థులు ఈ విరామ సమయాన్ని వృధా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీలో ఓ విద్యార్థిని మృతి చెందింది. దీంతో విద్యార్థులు ఆందో ళన బాట పట్టారు. దాంతో కాలేజీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిపాలన పరంగా కొంత ఇబ్బందులు సైతం తలెత్తాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యం సెలవులు ప్రకటించింది. ఈ ఆందోళనల్లో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పాల్గొన్నట్లు తెలుస్తోంది. మరో వైపు ఉద్యోగస్థులు తమ డిమాండ్ల కోసం ఆందోళనకు దిగారు. ఇన్‌చార్జి వీసీ రంగంలోకి దిగి ట్రిపుల్ ఐటీ కాలేజీ ఉద్యోగులతో చర్చలు జరిపారు. మీ డిమాండ్లను త్వరలో పరిష్కరిస్తామని వారికి వీసీ హామీ ఇచ్చారు. ఇక కాలేజీలో సైతం ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించేందుకు విద్యార్థులకు ఉన్నతాధికారులు సెలవులు ప్రకటించినట్లు సమాచారం.

## 24 తర్వాత వర్షాలకు అవకాశం

### రాష్ట్రంలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాబోయే రెండురోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉంది. ఈ కాలంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా 2 నుండి 3 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) జారీ చేసిన తాజా అంచనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 37.7 డిడ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

రాష్ట్రంలోని వనపర్తి జిల్లాలో 37.7 డిగ్రీలు నమోదు కాగా, గద్వాల్‌లో 37.6 డిగ్రీలు, నాయాణ్‌పేట్‌లో 36.6 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 36.4 డిగ్రీలు, నిజామాబాద్, నల్లగొండలో 35.2 డిగ్రీలు, జగిత్యాలలో 36.4 డిగ్రీలు, నిర్మల్‌లో 36.3 డిగ్రీలు, సూర్యాపేట్, నాగర్‌కర్నూల్‌లో 35.9 డిగ్రీలు, మంచిర్యాలలో 36.2 డిగ్రీలు, ఖమ్మంలో 35.9 డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 355.8 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలో 35.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అయితే, ఈ నెల 24వ తేదీ నుంచి వాతావరణం మారే అవకాశం ఉంది. తెలంగాణ వ్యాప్తంగా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. పలు జిల్లాల్లో అక్కడక్కడా మెరుపులు, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ఐఎండి ఉరుములతో కూడిన వర్ష హెచ్చరికను కూడా జారీ చేసింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫా బాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటాయి.

# కొనసాగుతున్న పెట్రోల్ సంక్షోభం

### హైదరాబాద్‌లో 30శాతం బంకులు తాత్కాలికంగా మూసివేత
### పలు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి.. తీవ్రఇబ్బందుల్లో వాహనదారులు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** పశ్చిమాసియా యుద్ధం కారణంగా పెట్రోల్‌కు ఇబ్బందులు మొదలయ్యాయి. హైదరాబాద్‌నగరంతోపాటు రాష్ట్రం లోని పలు జిల్లాల్లో పలు ంబంకులు తాత్కాలికంగా మూత పడుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా భారత్‌కు ముడి చమురు రాకపై అనేక అవంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో ముంద స్తుగా నిధులు చెల్లిస్తేనే ఇందనం సరఫరా చేస్తామని పెట్రోల్ బంకులకు ఆయిల్ కంపెనీలు తేల్చి చెప్పాయి. దీంతో ఇటు హైదరాబాద్‌తోపాటు అటు పలు జిలాల్లో పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూతబడు తున్నాయి. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో బంకుల్లో నో స్టాక్ బోర్డులు అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సాధారణంగా ఈ రోజుల్లో ప్రతీ ఒక్కరూ సొంత వాహనాలపైనే నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులతో తమ రోజువారి రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నోస్టాక్ బోర్డులు చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్, డిజిల్‌కు మరింత కొరత ఏర్పడే అవకాశముందన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ప్రస్తుతం పెట్రోల్ కొరత కారణంగా హైదరాబాద్ నగరంలో దాదాపు 20 నుంచి 30శాతం బంకులు తాత్కాలికంగా మూతపబడినట్లు తెలంగాణ పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ చెబుతోంది. మరో పది, పదిహేను రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వరికోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వరికోత మిషన్లకు డిజిల్ కష్టాలు తప్పవేమోనన్న ఆందోళన ఇటు రైతులు, అటు మిషన్ల యజమానుల్లో నెలకొంది.

# మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాజీనామా



**ముంబయి, మార్చి 22:** లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న జ్యోతిష్కుడు, మాజీ మర్చంట్ నేవీ అధికారికి గొడుగు పట్టుకుని నిలు చున్న ఫొటోలు వైరల్ కావడంతో మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలి చకన్‌కర్ రాజీనామా చేసారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నేరుగా జోక్యం చేసుకోవడంతో ఆమె రాజీనామా అనివార్యం అయింది. మాజీ మర్చంట్ నేవీ అధికారి కెప్టెన్ అని పిలిచే ఈ వ్యక్తికి చకన్‌కర్ గొడుగు పట్టుకుని పక్కనే నిలుచున్న ఫొటోలు, విడియోలు వైరల్ అయ్యాయి. అంతేకాకుండా ఆయన పాదాలు కడిగి శుభ్రంచేస్తున్న విడియోలు కూడా వైరల్ అయ్యాయి.

ఈ సంఘటన మహారాష్ట్ర మహాయుతి ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా మహారాష్ట్ర ఎన్సీపీ చీఫ్ సునీల్ తత్కారేకు ఇపుడు సమస్యలు వచ్చిపడ్డాయి. ఆయన్ను తక్షణమే రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సంఘటనలో తన తప్పేముందని పారదర్శకమైన దర్యాప్తు చేపట్టాలని, అందుకు తానెప్పుడూ సిద్ధమేనని చకన్కర్ డిమాండ్‌చేసారు. పూణెలోని ఎన్సీపీ బ్యానర్లపై తత్కారే,చకన్‌కర్‌ల ఫోటోలు హటాత్తుగా అదృశ్యం అవుతుండటం విపక్షాలు గుర్తుచేసాయి.

అలాగే ప్రముఖ జ్యోతిష్కుడుగా పేరున్న ఖారత్ సంస్థకు 3.9 మిలియ్ లీటర్ల మంచినీటిని మంజూరు చేయడంపైనా ఇపుడు ఐపిఎస్ తేజస్వి సత్పుతే ఆధ్వర్యంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ పరిణామాల క్రమంలో రూపాలి చకన్కర్ వ్యవహారం ఫొటోలు విడియోలు మహారాష్ట్ర ఎన్సీపీని కుదిపేసాయి.

## శ్రీరామనవమి వేడుకలకు పోలీసుల భారీ ఏర్పాట్లు

### సీతారాంబాగ్‌లోని రామాలయాన్ని సందర్శించనున్న కొత్వాల్

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న శ్రీరామ నవమి వేడుకలకు హైదరాబాద్‌లో పోలీసులు అప్పుడే భారీ ఏర్పా ట్లు చేబట్టారు. శ్రీరామనవమి రోజున సీతారాంబాగ్‌లోని రామాలయం నుంచి నగరంలోని పలు ప్రాంతాల గుండా కోఠి వరకు సాగే ర్యాలీ కోసం సోమవారం సిటీ కొత్వాల్ సజ్జనార్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించనున్నారు. ఇందుకోసం ఆయన బల్దియా సహా ఇతర విభాగాల అధికా రులతో కలిసి సోమవారం ఉదయం 11 గంటలకు సీతారాంబాగ్‌లోని రామాలయాన్ని సందర్శించి అక్కడి నుంచి ర్యాలీ సాగే మార్గంలో పర్యటించ నున్నారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధం ప్రభావం వల్ల హైదరాబాద్‌లో కొందరు నిరసనలు చేబట్టగా దాని ప్రభావం శ్రీరామ నవమిపై పడకుం డా పోలీసు శాఖ జాగ్రత్తలు తీసుకోసాగింది. ఇందుకోసం ఆయా ప్రాంతాల శాంతి సంఘాలతో సమావేశం నిర్వహించింది.

## సాధారణ రహదారిగా మారిన రీజినల్ రింగ్‌రోడ్

### వాహన వేగం 120 నుంచి 100కు కుదింపు

### 8 లేన్లు అవసరం లేదని 6 లేన్లకు కుదించిన కేంద్రం

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** తెలంగాణ అభివృద్ధిలో ఒక గేమ్ చేంజర్‌గా అభివర్ణించిన హైదరాబాద్ చుట్టూ నిర్మంచబోయే రీజినల్ రింగ్‌రోడ్‌ను సాధరణ రహదారిగా మార్పుచేసి కేంద్రం షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రీజినల్ రింగ్ రోడ్ డిజైన్‌లో భారీ మార్పులు చేశారు. భారీ వ్యయం వల్ల ప్రాంతీయ వలయ రహదారి ప్రత్యేకతలను తొలగించి రహదారి ప్రాధాన్యత స్థాయిని తగ్గించారు. ఇటీవలే ప్రాంతీయ రింగ్‌రోడ్‌కు సమాంతరంగా రింగ్‌రైల్‌ప్రతిపాదనకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారీకి కూడా కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా కూడా ఊపింది. రింగ్‌రోడ్‌నుంచి ఔటర్ రింగ్‌రోడ్ వరకు రేడియల్ రోడ్లుకూడా నిర్మించడానికి అనేక ప్రతిపాదనలుచేశారు. రింగ్ రోడ్‌ను 8 లైన్లతో దేశంలోనే పొడువాటి రోడ్డును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసింది. అయితే దేశంలో మరో 20 ఏళ్ల వరకు రోడ్డు ట్రాఫిక్‌కి 8 లైన్లు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ఆరు లైన్లకు కుదించింది. తొలుత అన్నకున్న దాని ప్రకారం రింగ్ రోడ్డు పొడవునా ఎలక్ట్రిక్ లైట్లు, ఎల్ఈడీ స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థను ప్రతిపాదించారు. ఇప్పుడు ఎల్ఈడీ స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు భారీ ఖర్చుతో కూడుకున్నది అని చెబుతూ కేవలం గ్రామాలు తగిలే ప్రాంతాల్లో మాత్రమే లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రీజినల్‌రింగ్‌రోడ్‌కు ఎన్‌హెచ్161 ఏఏగా నోటిఫై చేసినట్టు చెప్పారు. రోడ్డు నిర్మాణానికి రూ.8,535 కోట్లు ఖర్చవుతుందని, ప్రస్తుతం భూసేకరణ కొనసాగుతున్నదని తెలిపారు. మోర్త్ ఆధ్వర్యంలో టెండర్లు ఆహ్వానించినట్టు చెప్పారు. దక్షి ణ భాగం విషయంలో చౌటుప్పల్ నుంచి ఆమన్‌గల్, సంగారెడ్డి వరకు సుమారు 201 కి.మీ. మేర రోడ్డు నిర్మించేందుకు అలైన్‌మెంటు రూపొందించి కేంద్రానికి పంపినట్టు తెలిపారు. ఇంతకుమించి ఎటువంటి పురోగతి లేదు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రిపుల్ ఆర్ ప్రాజక్టులను గేమ్‌చేంజర్‌గా పదేపదే చెబుతున్నా.. వాటికీ అతీగతీ లేకుండా పోయింది. ఔటర్ రింగ్‌రోడ్ తరహాలో రీజినల్ రింగ్ రోడ్‌కు కూడా సర్వీస్ రోడ్డును ప్రతిపాదించారు. కానీ ఇప్పుడు కనీసం కచ్చా రోడ్డు యాక్సెస్ కూడా లేకుండా కేవలం ఖాళీ స్థలం మాత్రమే ఉండేట్లుగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది..ట్రిపుల్ ఆర్‌పై గరిష్ట వేగం గంటకు 120-130 కిలోమీటర్లు నుంచి ఇప్పుడు గరిష్ట వేగం తగ్గించి గంటకు 100 కిలోమీటర్లు కుదించారు. రీజినల్ రింగ్ రోడ్‌కు ఉత్తర భాగంలోనే మొత్తం 204 వంతెనలు ప్రతిపాదించినప్పటికి వాటిని సంఖ్యలోకూడా మార్పు చేశారు. మూసీ నది, మంజీరా నది హరిద్ర నది, పలు వాగులు వంకలపై నుంచి రీజినల్ రింగ్‌రోడ్ నిర్మాణం జరుగుతోంది. వాటిపై వంతెనలు, కల్వర్టులు నిర్మించాలని ప్రతిపాదించారు. వంతెనల వ్యయం భారీగా ఉండటంతో వాటి సంఖ్యను తగ్గించాలని నిర్ణయానికి వచ్చారు రోడ్డు నిలువువాలును 1300 మీటర్లు ఉండేలా డిజైన్‌ను ఆరువందల యాభై మీటర్లకు తగ్గించారు. గతంలో డిజైన్ చేసిన దాని ప్రకారం 600 మీటర్ల దూరంలో కుక్క కూనలు, కోతులు, కుందేళ్ళు వంటి జంతువు రోడ్డు దాటుతున్నా కనిపిస్తుంది. ముందే అప్రమత్తమై వేగాన్ని నియంత్రించే వీలు ఉండేది. కానీ ఇప్పుడు రోడ్డు నిలువు వాలు 650 మీటర్లకు తగ్గించడంతో కేవలం 360 మీటర్లు మాత్రమే స్పష్టంగా చూసే అవకాశం ఉంటుంది. వాహనాలు ఒకవేళ పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఇంజినీర్లు అంటున్నారు.

# నీటిని కాపాడుకుంటేనే భవిష్యత్తు

### జలం వృధాపై ప్రజలకు అవగాహన కల్పించాలి
### ఐఇఐ ప్రెసిడెంట్ మనీష్‌మహేంద్ర కొఠారి

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** సృష్టిలోని సకల జీవరాశులకు నీరు అవసరమని, నీరు లేకపోతే ప్రపంచమే లేదని, ఈ నీటిని కాపాడుకోవాలంటే ప్రజల్లో విస్తృతమైన అవగాహన అవసరమని ఐఇఐ ప్రెసిడెంట్ మనీష్ మహేంద్ర కొఠారి అన్నారు. ఆదివారం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో మనీష్ మహేంద్ర కొఠారి మాట్లాడుతూ ప్రస్తుతం వున్న ఎలక్ట్రికల్ వెహికల్ బ్యాటరీ ఇంజనీర్ కోర్సులో చదువుతున్న అభ్యర్థులకు మంచి భవిష్యత్ ఉందని, త్వరలోనే జియో స్పెషియల్‌కు సంబంధించిన జిఐఎస్‌జిపిఎస్ కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన ఉందన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రధానమైన ప్రతి పథకానికి ఎస్కీలో ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తామని, కేంద్ర జల్ జీవం మిషన్, అమృత్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ పథకాలపై వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నామని, 2030 నాటికి అందరికీ సురక్షి తమైన త్రాగునీరు, పారిశుద్ధం అందించడమే సుస్థిరాభివృద్ధి లక్ష్యం 6గా అన్ని దేశాలు కృషి చేస్తున్న నేపథ్యంలో ఎస్కీలో ప్రతి ఏటా ప్రపంచ నీటి దినోత్సవాలు జరుపుకుం టామన్నారు. ఈ సమావేశంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ కలకత్తా నుండి వచ్చిన మనీష్ మహేంద్ర కొఠారితో పాటుగా సీనియర్ ఇంజనీర్స్ ఐ ఈ ఐ పాస్ట్ ప్రెసిడెంట్ విబి సింగ్, దేవేంద్ర గిల్, సంతోష్ కుమార్ సూరజ్ మాల్, రఘుపతి భీమ్ రావ్, దేవేంద్ర భాయ్ పంచాల్, డాక్టర్ రమణ నాయక్ బానోత్, సూర్య ప్రకాష్, డాక్టర్ సీరం సత్యనారాయణ, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. పలువురు అధికారులు, సిబ్బం ది, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ అభ్యర్థులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# అరుణాచలంలో ఉచిత లడ్డూ పంపిణీ నిలిపివేత



**తిరువణ్ణామలై, మార్చి 22:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతా వరణంలో వాణిజ్య సిలిండర్ల కొరత దేవాలయాలకు కూడా పాకింది. ప్రముఖ దేవాయాల్లో అన్నప్రసాదాన్ని కూడా పరిమితంచేసారు. ఉచిత లడ్డూలను కూడా నిలిపివేసారు. అరుణాచలేశ్వర్ దేవాలయంలో ఈ గ్యాస్ కొరతవల్లనే ఉచిత లడ్డూ పథకాన్ని నిలిపివేసారు.

వాణిజ్య సిలిండర్ల సరఫరా కొరత తీవ్రస్థాయిలోంది. అంతరాజతీయ ఇంధన సరఫరా సవాళ్లు తమిళనాడుపై తీవ్రప్రభావం చూపించాయి. మదప్పళ్లి అంటే దేవాలయ కిచెన్‌లకు ఈ వాణిజ్య సిలిండర్లు అందకపోవడంతో లడ్డూ ప్రసాదం తయారీ, ఉచిత అన్నదాన పథకం కూడా పరిమితంచేయడం వంటివి కొనసాగుతున్నాయి. లడ్డూ, మురుక్కు, అతిరసం, ఎల్లు వడయై వంటివాటిని ప్రస్తుతం ఈ దేవాలయంలో నిలిపివేసారు.

సాంప్రదాయంగా కలపతో ఉన్న పొయ్యిలను వినియోగించి తయారీచేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వ అనుమతులు కూడా కోరింది. పులిహోర, సక్కరై పొంగల్ వంటి వాటిని మాత్రమే పంపిణీ చేస్తోంది. వాణిజ్య సిలిండర్ల సరఫరా పూర్తి స్థాయిలోకి వచ్చేంతవరకూ ఇదే విధంగా కొనసాగుతుందని దేవాలయ కమిటీ ప్రకటించింది.

### నేరుగా రంగంలోకి దిగనున్న ప్రధాని మోడీ
### ప్రత్యేకించి జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
### మోడీ రాక సందర్భంగా పెరేడ్‌గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ

# తెలంగాణపై బిజెపి అధిష్ఠానం ఫోకస్

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రత్యేకించి త్వరలో ఎన్నికలు జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు నేరుగా బిజెపి అధిష్ఠానమే రంగంలోకి దిగుతోంది. ఇందులో భాగంగా త్వరలో ప్రధాని మోది తెలంగాణలో పర్యటించనున్నారు. అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీ బలం పుంజుకునేలా పరేడ్‌గ్రౌండ్‌లో బహిరంగ సభలో ప్రసంగించ నున్నారు. ఏప్రిల్ రెండోవారంలో ప్రధాని మోది తెలం గాణ పర్యటన ఉండే అవకాశం ఉందని బిజెపి నేతలు చర్చించుకుంటున్నారు. కొద్ది రోజుల్లో దక్షిణాదిలో జరగనున్న తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోది పాల్గొననున్నారు. అ దే సమయంలో ఆ రాష్ట్రాల పర్యటనకు వెళ్లే సందర్భంలో తెలంగాణలోనూ ఆయన పర్యటనలు ఉండేలా బిజెపి అధిష్ఠానం షెడ్యూల్ ఖరారు చేయనుంది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసి పాలకమండలి గడువు పూర్తికావడంతో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

ఇంతకాలం జిహెచ్‌ఎంసిగా ఉనికిలో ఉండగా ఇప్పుడు దాన్ని మూడు భాగాలుగా విభజిస్తూ రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జిహెచ్‌ఎంసిలో రెండో అతిపెద్ద పార్టీగా ఉన్న బిజెపి ఈసారి మేయర్ పోస్టును కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది. అయితే మహానగరం మూడు కార్పొరేషన్లుగా విడిపోయినందున జిహెచ్‌ఎంసి కార్పొరేషన్లలో గెలుపు కోసం నేరుగా అధిష్ఠానం రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. నగరంలో పాతబస్తీ మినహా మిగిలినచోట్ల బిజెపి బలంగా ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ గ్రాఫ్ తగ్గిపోకుండా సంస్థాగతంగా మరింత బలపడేలా అధిష్ఠానం పెద్దలు తెలంగాణపై ఫోకస్ పెట్టారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను బిజెపి చేజిక్కించుకోగలిగినా నిజామాబాద్‌లో బెడిసికొట్టింది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల కూడా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులను బిజెపి చేజిక్కించుకోలేకపోయింది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎక్కువ మంది గెలవలేకపోయారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అదే సమయంలో జిహెచ్‌ఎంసిలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయకపోతే రానున్న అసెంబ్లి ఎన్నికల్లో తెలంగాణలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అంచనా వేసి బిజెపి నేరుగా రంగంలోకి దిగింది. పార్టీ బలోపేతం దిశగా తీసుకునే చర్యలను జీహెచ్‌ఎంసీ నుంచే మొదలుపెట్టాలని భావిస్తోంది. ప్రధాని మోది చరిష్మాను వాడుకుని గ్రేటర్ పరిధిలో మేయర్ స్థానాన్ని గెల్చుకోవడంతోపాటు పార్టీ బలంగా ఉందనే సందేశాన్ని ప్రజలు, పార్టీ కేడర్‌కు ఇవ్వాలన్న వ్యూహంతో బిజెపి ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగసభలో ప్రధాని మోది పాల్గొననున్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు సైతం...

తెలంగాణ పర్యటన సందర్భంగా బీబీనగర్ ఎయిమ్స్ ప్రధాన భవనంతోపాటు పలు జాతీయ రహదారులను ప్రారంభించే అవకాశమున్నది. ఎంఎంటీఎస్ ఫేజ్-2 విస్తరణ ప్రాజెక్టులో కొత్త మార్గాలు, ఇండోర్-హైదరాబాద్ ఎకనామిక్ కారిడార్ రైల్వే లైన్ పనులను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఆఫీసర్లు సైతం ప్రధానితో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రైల్వేకు సంబంధించిన వివిధ సర్వీసులను కూడా ప్రధాని ప్రారంభించే అవకాశం ఉంది.


AU SMALL FINANCE BANK

నమోదిత కార్యాలయం: 19-A ధులేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా, 302001.
www.au.bank.in

బంగారంపై రుణం-"ఏది ఎక్కడ ఎలా ఉన్నవీ అక్కడ అలా" ప్రాతిపదికపై వేలం ప్రకటన

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి బంగారంపై రుణ సౌకర్యాలు పొందిన క్రింద పేర్కొన్న బకిన రుణగ్రహీత/లు వారి రుణ బకాయి మొత్తాలను చెల్లించవలసినదిగా నోటీసులు జారీ చేయడమైనది. రుణ గ్రహీత/లు అతని/వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున అందులో పేర్కొనబడిన పద్ధతి ప్రకారం క్రింద పేర్కొనబడిన శాఖలలో 22 ఏప్రిల్ 2026న ఉ.11.00 మ.3.00 (సమయం) మధ్య తాకట్టు పెట్టిన బంగారు ఐటమ్‌లు/వస్తువులు యొక్క వేలం మేము ఐలవంతపు చర్యగా, నిర్వహించటానికి వస్తోంది. దివంగతులైన రుణగ్రహీతల విషయమై వారి చట్టబద్దమైన వారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి. పై వేలం నిర్వహించడం ఒకవేళ విఫలమైతే బ్యాంక్ ముందస్తుగా తెలియపరచవలసిన అవసరం లేకుండానే మరొక వేలం నిర్వహించటానికి దానికి హక్కు రిజర్వ్ అయియున్నదని దయచేసి గమనించవలసినదిగా ఇందుమూలముగా తెలియజేస్తున్నాము.

భౌతిక వేలం శాఖ వివరాలు

తొర్రూరు - 25660000923559 | భూపాలపల్లి - 25660000805632 25660000784909 | మంథని 25660000901181 | జగిత్యాల - 25660001440810 25660000825544 25660000784859 25660000489665 25660000804874 25660000916023 | వరంగల్ - హన్మకొండ - 25660000688780 | వేములవాడ 25660000930285 25660000935016 25660000994834 25660000746012 25660000807358 25660000831002 | చౌటుప్పల్ -25660001906515 | జనగాం - 25660000941645 25660000829236 25660001720914 | పరకాల - 25660000753018 25660000765795 25660001074018 25660000867274 | మహబూబాబాద్ - 25660000922821 25660000799961 25660000781045 25660000944339 | హన్మకొండ - వరంగల్ - 25660000752610 25660000772922 25660000847742 | కొండమల్లేపల్లి 25660000885619 | జోగిపేట్ -25660001193514 25660000840495 25660000769948 25660000744555 | సర్వంపేట -25660000911132 | పెద్దపల్లి - 25660001354042 25660001862965 25660000845135 25660000887755 25660000835665 | సూర్యాపేట - 25660000902209 25660000892005 25660000855276 25660001476052 25660000874120 నారాయణపేట - 25660000776885 25660000881866 25660001280110 25660001836995 హుజూరాబాద్ - 25660000770485 25660000805442 25660000746112 25660000893544 25660001766726 25660000756953 వనపర్తి - 25660000806610 | మెదక్ 25660000839317 | యాదాద్రి-భువనగిరి - 25660000843369 సిద్దిపేట - 25660000856585 25660000898065 25660000936615 | నల్గొండ - 25660000944279 25660001032888 | హుస్నాబాద్- 25660000857383 25660000813936 | నారాయణఖేడ్ -25660000807168 | కామారెడ్డి 25660000745154 25660000917231 25660001750376 25660001733719 | బాన్స్వాడ - 25660000775656 | కోరుట్ల - 25660000859139 | కొడంగల్ - 25660000899663 25660000718735 | మెహబూబ్‌నగర్ 25660001887708 | ఖమ్మం - 25660001730345 | బోధన్ 25660001955541 | నాగర్‌కర్నూల్ - 25660000854878 | సంగారెడ్డి - 25660000857803 | హైదరాబాద్-బంజారా హిల్స్ - 25660001770568

గమనిక: 1. ఒకవేళ భౌతికంగా వేలం విఫలమైతే వెబ్‌లింక్ - https://gold.samil.in ఉపయోగించటం ద్వారా ఇ-వేలం నిర్వహించవచ్చును.
2. ఒకవేళ ప్రతిపాదించబడిన వేలం విఫలమైతే తర్వాతి వేలం కొరకు ఈ నోటీసును ముందస్తు-ప్రకటనగా దయచేసి పరిగణించవలెను.
3. వేలం యొక్క ప్రారంభానికి ముందు అందుబాటులో ఏర్పాటు చేసిన బిడ్ ఫారమ్‌లోని రూఢీ అయిన నియమాలు మరియు నిబంధనలకు లోబడి వేలం ఉంటుంది.

సం/- మేనేజర్
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహా ఫలితాలనిస్తుంది.

న- డ్రాయిడెన్

# సాగతీత.. ఇంకానా?

సామ్రాజ్య వాదం పేట్రేగిపోయినప్పుడు రెండు దేశాలు లేదా ఇరు దేశాల కూటముల మధ్య జరిగే ఏ యుద్ధమైనా వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకే వెళుతుంది. ప్రాచీన కాలం నాటి యుద్ధాలంటే మానవ వనరులు, కాల్బలముల మధ్యనే యుద్ధ కార్యాచరణ ఉండేది. చావో రేవో తేలిపోయేది. కానీ తాజా యుద్ధాలు అణు వ్యూహాల అనుమానాలతో లడాయించడం వల్ల జరుగుతున్నాయి. ఎవరి వద్ద ఎంత అణు సంపద ఉన్నా అసలు సిసలు సామ్రాజ్యకాంక్షతో తలపడుతున్న అమెరికాకు ఎందుకనో సయోధ్య పట్ల ఆసక్తి ఉన్నట్లు లేదు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు అమెరికాను ఆలోచనల్లో ముంచెత్తుతున్నాయి. ఇక్కడ పరిస్థితి ఎలా ఉందంటే 'తమలపాకుతో నువ్వు ఒకటి అంటే తలుపు చెక్కతో నే రెండంటా' అనే రీతిలో యుద్ధ వ్యూహాలు తలపెట్టారు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. హార్మూజ్ జలసంధిని కట్టడి చేయడంలో ఇరాన్ యుద్ధ చాణుక్యత మెచ్చుకోదగినది. దీని విషయంలో అగ్రరాజ్యం పప్పులో కాలేసింది. అణు యుద్ధమైనా సరేనన్నది ఇజ్రాయిల్ మనోగతం. అమెరికాకు అణు యుద్ధం పట్ల పెద్దగా ఆసక్తి లేదు. అందుకే ఇతర దేశాల వారు బతికి పోయారు. కాగా అమెరికా భూతల యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం చెబుతోంది. భూతల యుద్ధమంటే ఇజ్రాయిల్ ససేమిరా అంటోంది. లక్ష్యం ఒకటే అయినా ఎవరి దూకుడు వారిది. యుద్ధం ముదిరి పాకాన పడిన ఈ తరుణంలో హార్మూజ్‌ను 48 గంటల్లోగా రిలీజ్ చేయాలని ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. అందుకు తగినట్లుగానే శత్రువులకు ఆ దారి రహదారి కాబోదని ఇరాన్ కాస్తంత కరకుగానే చెప్పింది. తాజాగా ఇరాన్‌కు చెందిన విద్యుత్ ప్లాంట్ లు పేల్చేస్తాం, కాస్కో! అని ట్రంప్ ఇరాన్ కి వార్నింగ్ ఇవ్వగానే, సౌదీ అరేబియాలోని డీసాలినేషన్ ప్లాంట్లను లేకుండా చేస్తామని ఇరాన్ కూడా ప్రతి సవాల్ విసిరింది. అంటే ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్‌ల యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. 23 రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. యుద్ధంపై ఊహాగానాలు, చర్చోపచర్చలు కేవలం యుద్ధభూమి మీద ఉన్న దేశాల్లోనే కాదు. ప్రపంచ చిత్రపటంలోని అన్ని దేశాల్లోనూ సాగుతున్నాయి. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హార్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే 'సేఫ్ ప్యాసేజ్' లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హార్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హార్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు ఏ మేరకు మిత్ర దేశాల వత్తాసు లభిస్తుందో తెలుస్తోంది. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గార్షియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివంతమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మ రక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడరు. తాజాగా ట్రంప్ దొర వారి నుండి వెలువడిన వాక్య రత్నాకరాల్లో ఖిఖియుద్ధం ముగించడంపై ఆలోచిస్తున్నట్లు ఖిఖి స్వయంగా వెల్లడించారు. మరో విషయం ఇక్కడ చెప్పుకోవాలి. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. ఒక విధంగా ఇజ్రాయిల్ ఆకాంక్షలు నెరవేరినట్లే!

> మిక్కిలి ధనంకానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.
>
> ప్లినీ



> అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.
>
> శ్రీ రమణ మహర్షి



# ప్రజావాక్కు

### నష్టం విశ్వవ్యాప్తం

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమైన మలుపు తీసుకుంది. పరిమిత లక్ష్యాల స్థానే వైరిపక్షం ఆర్థిక మూలాల్ని ధ్వంసం చేయడమే లక్ష్యమైంది. అది ప్రపంచ వ్యాప్తంగా ఇంధన భద్రతను, ఆర్థికాన్ని, ప్రగతిని దారుణంగా దెబ్బ తీసే స్థితికి చేరుకుంది. ఇంతవరకూ ఒకస్థాయిలో సహజ వాయువులు, పెట్రోఉత్పత్తులసరఫరా దెబ్బతీసేలా దాడులు జరిగాయి. నష్టంపెద్దగా కనబడలేదు. కానీ నిన్న ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌లో పెద్ద సహజ వాయు క్షేత్రం దక్షిణ పార్స్ పై బాంబులు కురిపించాయి. ఉత్పత్తినికూడా దెబ్బతీసేలా. ప్రతిగా ఇరాన్‌ఖతార్‌లో పెద్ద సహజవాయు క్షేత్రంల ఫాన్‌పై దాడిచేసింది. ఇప్పుడు సరఫరాలో అవాం తరాలు మాత్రమే కాకుండా అసలు ఇంధనమే ఉత్పత్తి కాకుండా బాగా తగ్గి పోతుంది. ఫలితంగా అన్నిదేశాలకీ కొందామన్నా ఇంధనం దొరకదు.

- డా.డి.వి.జి. శంకరరావు,పార్వతీపురం

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈ కోర్టు కేసులో ఫోరంలోకేసు వేసినచో90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీఇప్పుడు మూడు నాలుగుసంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటంలేదు కానీ కేసుబాధితులు మా త్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెల కొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పువెలబడును. కానీ నేటివరకు కూడా పరి ష్కారదిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అం తంత మాత్రమే ఉన్నారు.

- సింగు.లక్ష్మీనారాయణ, చింతకుంట కరీంనగర్

### కాలుష్య నియంత్రణ

ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకి ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసేపొగలు చాలా ప్రమాదం. ఇది శ్వాసకోశ ఇబ్బందితో ప్రమాదంవస్తుంది. కేవలంవ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ ద్వారా కూడా వాతావరణంవిపరీతంగా కలుషితమవుతుంది. ముఖ్యంగా వీధిచివర ఇటువంటి మంటలు ఎన్నో కని పిస్తుంటాయి. ఇంట్లో ఉన్నవ్యర్థాలను కూడా కాల్చుతుంటారు.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమే!

నిరంతరం కొనసాగుతున్న పశ్చిమాసియా ఘర్షణ కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితంకాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ ఘర్షణలు నేడు ప్రతి దేశపు వంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలంచేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో నెలకొన్నఅనిశ్చితి, ప్రపంచదేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో సింహభాగం సాగే హార్మూజ్ మార్గం నేడు యుద్ధ నీడలో చిక్కుకుంది. ఒక ప్పుడు రోజుకువందకు పైగా నౌకలతో కళకళలాడే ఈ జలసంధిలో, ప్రస్తుతం ఆ సంఖ్య ఒక అంకెకు పడిపోవడం సరఫరా గొలుసు ఎంతలా దెబ్బ తిన్నదో అద్దం పడుతోంది.

- సిద్ధగౌని సుదర్శన్, హైదరాబాద్

### కృత్రిమమేధ అనివార్యం

ప్రపంచ సాంకేతిక రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు వినియోగం అనివార్యంగా మారింది. భారత దేశం ప్రపంచస్థాయిలో పోటీ సామర్థ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను విస్తృత స్థాయిలో స్వీకరించడం అవసరం. అలాగే ఈ కొత్త సాంకేతికతకు అను గుణంగా మానవ వనరులను నైపుణ్యాలతో తీర్చిదిద్దడం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. కొంత మంది భావిస్తున్నట్లుగా కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ముప్పు కాదు. వాస్తవానికి అది ఉత్పాదకతను పెంచే శక్తివంతమైన సాధనంగా నిలుస్తోంది. క్లిష్టమైన సమస్యలను వేగంగాపరిష్కరించడం, కొత్త ఆవిష్కరణలకు దారితీయడం, పనితీరును మెరుగుపరచడం వంటిఅనేక ప్రయోజనాలను ఇదిఅందిస్తోంది. - సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాజకీయ పంచాంగాలు

ప్రతి ఏడాది పంచాంగ శ్రవణాలు రాజకీయ నాయకులకు, పాలకులకు అనుకూలంగా ఉంటాయా..లేదా అనుకూలంగా మలుచుకుంటారో అర్థంకానీపంచాంగం. ఎవరైనా జ్యోతిష్యుడు గ్రహాలఅనుకూలతను బట్టి చెప్పాలి గాని ఇక్కడ పార్టీలను బట్టి వారికిఅనుకూలంగా పంచాంగ శ్రవణాన్ని మార్చేస్తారు. ప్రజలు ఎవరి శ్రవణ పంచాంగాన్ని నమ్మాలి. ఏడాదికిఒకటే పంచాంగం ఒకేవిధంగా ఉంటుంది కదా. కాసులకోసం కక్కుర్తి పడే జ్యోతిష్యులు ఇటుఅటుగా అటు ఇటుగా మార్చేయడానికి వెనకాడరు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యుద్ధాల మధ్య 'పెద్ద మనిషి' పాత్రలో భారత్!

**ఎంతనష్టం జరిగినా ఇరాన్ ఇప్పటి వరకు సాహసోపేతంగా బలమైన అమెరికా, ఇజ్రాయెల్‌ను ఎదుర్కోగలిగింది. క్రమేపీ రష్యా, చైనా లాంటి దేశాలు ఇరాన్‌ను ఆదుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. నాటో దేశాలు అమెరికాతో జట్టుకట్టడానికి సిద్ధంగా లేని పరిస్థితి. భీకరంగా యుద్ధం జరుగుతున్నా ఇండియా, ఆయిల్ సమస్యను పరిమితమైన అభ్యంతరాలతో పరిష్కరించుకొనే స్థాయికి చేరుకుంది. ధరలు పెరగటం అనేది యుద్ధ సమయంలో అన్ని దేశాలూ ఎదుర్కోవాల్సిందే. అయితే యుద్ధ పరంగా ఎటువైపు మొగ్గాలా అన్న మీమాంస మనదేశానికి ఎదురుకావటం లేదు. బలమైన దేశంగా గుర్తింపబడుతూనే అవసరమొస్తే పెద్ద మనిషి తరహాలో పరిష్కరించే విధంగా విదేశాంగ నీతి క్రమేపీ బలపడుతున్నది. చాలా దేశాలు ఊపిరాడని పరిస్థితిలో ఉంటే అదృష్టవశాత్తు ఇండియా ప్రస్తుతానికి తేలిగ్గానే గాలి పీల్చుకోగల్గుతున్నది.**



రావులపాటి సీతారాంరావు

అఫ్ఘానిస్థాన్‌ను పాలిస్తున్న తాలిబన్లను వశపర్చుకోవాలని ప్రయత్నించిన పాకిస్థాన్ మిలటరీ నిర్దాక్షిణ్యంగా కాబూల్‌లోని డ్రగ్ రిహాబిలిటేషన్ హాస్పిటల్ మీద బాంబుల దాడి చేసి దాదాపు నాలుగు వందల మందిని పొట్టన పెట్టుకుందన్న వార్తలతో ప్రపంచమంతా కుదేలయింది. ఈ సంఘటన వల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత చెడిపోవడమే కాకుండా మరిన్ని సంఘర్షణలకు దారితీసింది. భారతదేశ విదేశాంగ శాఖ పాకిస్థాన్ దాడిని అనాగరిక చర్యగా అఫ్ఘాన్ దేశ సార్వభౌమాధికారం మీద దాడిగా అభివర్ణిస్తూ ఖండించింది. పాకిస్థాన్ కేవలం మిలటరీ ఇన్‌స్టాలేషన్స్ మీదనే దాడి చేసామని చెప్పటం ఎవరూ నమ్మటం లేదు. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ సంఘర్షణలు ఒక సంవత్సరం క్రిందనే మొదలయ్యాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ కాబూల్‌లోని తాలిబన్ స్థావరాలు, కాందహార్, పాక్టియాలను ఆపరేషన్ గజిబ్-లి-హాక్ (ధర్మంతో కూడిన ఆగ్రహం) అన్న పేరుతో దాడి చేశాయి. తర్వాత టెహరీక్ ఇటాలిబక్ (టి.టి.పి) బజార్‌లోదాడి చేసి, ఇస్లామాబాదు మాస్కులో సూసైడ్ బాంబింగ్‌తో 32 మందితోపాటు ఒక చిన్నపిల్ల ప్రాణాలను ప్రతీకార చర్యగా తీసుకున్నాయి. ఈ మధ్యకాలంలో పాకిస్థాన్‌కు ఆగ్రహం కలిగించే మరో అంశం చోటు చేసుకుంది. అది ఇండియా, అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వాలు దగ్గరయి సన్నిహితంగామెలగటం! ఢిల్లీలో తాలిబన్ మినిస్టర్లకు ఆతిథ్యం ఇవ్వటంతో పాకిస్థాన్ మరింత కుతకుతలాడింది. తాలిబన్లు, అఫ్ఘానిస్థాన్‌ను 'ఇండియన్ కాలనీ'గా మార్చేసారని ఉండబట్టలేక ఎక్కసెక్కాలు కూడా ఆడింది. కాబూల్‌లో నిజానికి అధికారంలోకి తాలిబన్లు రావటానికి చేయూతనిచ్చింది పాకిస్థానే! ప్రస్తుతం 2021 నుంచి అఫ్ఘాన్ మీద కారాలు మిరియాలు నూరటానికి కారణం ఇండియాకు ప్రస్తుత ప్రభుత్వం దగ్గర కావటం వల్లనే! అయితే ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో అమెరికా ట్రంప్‌తో పాకిస్థాన్ ఆర్మీచీఫ్‌ను దగ్గర చేసి, లాభం పొందాలనే ఆశతో పాకిస్థాన్ ప్రభుత్వం ఎదురు చూసింది. అమెరికా దేశం అప్పట్లో తాలిబన్ల దురాగతాలను ఎదుర్కోవడానికి పాకిస్థాన్‌కు సహాయపడతానని ప్రకటించిందికూడా! తాలిబన్లు దాడి చేస్తుంటే పాకిస్థాన్‌కు కాపాడుకొనే హక్కు ఉంది అని కూడా అమెరికా ప్రభుత్వ వైఖరిని ప్రపంచానికి తెలియచేసింది. పాకిస్థాన్ ఆర్మీ అఫ్ఘానిస్థాన్‌లోని టార్గెట్‌లను నిర్దాక్షిణ్యంగా దునుమాడొచ్చు అని ఈ సందర్భంగా చెప్పటం గమనార్హం. ఇండియా,పాకిస్థాన్ సంబంధాలు అంతంత మాత్రంగానే చాలా సంవత్సరాల నుంచి ఉంటున్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ఇమ్రాన్‌ఖాన్‌ను జైలులో ఉంచటంతో ఇండియాతో దూరం మరింతగా పెరిగింది. అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబన్లు అఫ్ఘాన్ ప్రభుత్వాన్ని చేపట్టిన తర్వాత పాకిస్థాన్ ఎత్తుగడలు క్రమక్రమంగా తెలుసుకోసాగారు. భారత్‌పై తమ భుజాల ఆసరాతో పాకిస్థాన్ ఇండియా మీద దాడులు చేసిందన్న సంగతీ అర్థమయింది. ఇప్పుడు భారత్‌కు అవకాశం వచ్చింది. అంటే దాడులు చేసి పాకిస్థాన్‌ను ఏదో చేయాలనే ఉద్దేశ్యం ప్రధాని మోడీకి కానీ, ప్రభుత్వానికి కానీ లేనేలేదు. కాశ్మీర్ ప్రాంతంలో ఈ మధ్య పాకిస్థాన్ టెర్రరిస్టులను ఉపయోగించి అనేక దాడులకు తలపడింది. పుల్వామా దాడిని ప్రత్యేకంగా గుర్తుకు తెచ్చుకోవాలి. పాకిస్థాన్ నుంచి టెర్రరిస్టులు టన్నెల్స్ ద్వారా చేరుకొని



రకరకాల దాడులు సాగించారని మన ఆర్మీ ఇంటలిజెన్స్ కనుగొన్నది. ఇజ్రాయెల్ దాడులో హామాస్ వాడిన విధంగా రహస్యంగా ఎక్కువగా జమ్మూ ప్రాంతంలో పాకిస్థాన్‌నుంచి సొరంగ దారిని ఏర్పరుచుకోవటం జరిగింది. ఆ ప్రాంతాలన్నీ శోధించి 22 టన్నెళ్ల ద్వారా సబార్డర్ టెర్రరిజం ఏర్పరిచిన రహస్య మార్గాలను కనుగొన్నారు. క్రాస్ టెర్రరిజం ఆ విధంగా ఎక్కువగా దాడులకు, సరిహద్దులలో కాశ్మీర్‌లో పాక్‌కు ఉపయోగపడింది. పహల్గాం సంఘటనకు దోహదంచేసిన విధానం ఇదేనని చాలా మంది నమ్ముతున్నారు. పహల్గాం తర్వాత ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా ఏమిటో పాకిస్థాన్‌కే కాదు ప్రపంచం మొత్తం తెలిసి వచ్చింది. ఈ ఆపరేషన్ తర్వాత పాకిస్థాన్ దూకుడు తగ్గింది. సరిహద్దులలోని అఫ్ఘాన్‌లో తాలిబన్ ప్రభుత్వం అంతర్గతంగా బెలుచిస్థాన్‌లో తిరుగుబాటు, చైనా ఇదివరకటి మాదిరి పూర్తిస్నేహాన్ని బహిర్గత పర్చకుండా 'లిప్ సింపతీ'కి మాత్రమే పరిమితమవటం ఇవ్వన్నీ పాక్‌కు ముకుతాడు వేసినట్లు అయ్యాయి. అయితే ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో సందు చూసుకొని దూరాలని పాక్ ప్రయత్నిస్తున్నది. అమెరికా నమ్మకం అకస్మాత్తుగా నిజంగానే సడలటమో ఎత్తుగడలో ఒక భాగంగా అలాంటి పాచిక పాకిస్థాన్‌పై ప్రయోగిస్తున్నదో ఇంకా తేలాల్సి ఉంది. అమెరికా అధికార పూర్వకంగా పాకిస్థాన్ అణుబలం అమెరికాకు ముప్పు తెచ్చిపెట్టే అవకాశం ఉందని ప్రకటించడం, పాకిస్థాన్ విదేశాంగ విధానంలో లోపాలతోపాటు, ఇస్లామిక్ దేశాల కూడా నమ్మే పరిస్థితి లేనట్లు బహిర్గతమవటం వల్ల సడెన్‌గా పాకిస్థాన్ గాలి తీసిన బెలున్‌లా బలహీనపడింది. ఒక విధంగా ఇండియాకు ఇది కలిసి వచ్చే అంశం. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో పాకిస్థాన్‌ను ఏవిధంగా నియంత్రించాలో భారత్‌కు స్పష్టపడుతున్నది. పాకిస్థాన్ మిలటరీ బలాలకు రెండువైపులా సెగ తగలక తప్పదు. యుద్ధం రెండు ఫ్రంట్స్‌లో చేయాలంటే అంత తేలికకాదు. ఒకవైపు అఫ్ఘానిస్థాన్ మరోవైపు ఇండియా సరిహద్దులలో శక్తివంతమైన దేశాలుగా పాకిస్థాన్ ఆలోచనలలో శత్రువులుగా ఉన్నప్పుడు పాకిస్థాన్ యుద్ధపటిమకు నియంత్రణ అనుకోకుండానే ఏర్పడినట్లయింది. దేశం రాజకీయ నాయకులలో ఉన్నట్లు కనపడుతున్నది కానీ మిలటరీ మునీర్ చేతిలోకి మారిందని అన్ని దేశాలు నమ్ముతున్నాయి. ట్రంప్ ఒకవిధంగా ఈ పరిణామానికి కారణం అయి ఉండొచ్చు. ఫీల్డ్ మార్షల్ అసిఫ్ మునీర్ 2026 మొదట్లో అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ చేతి విందుకు ఆహ్వానించబడి, పాకిస్థాన్‌లోని సిలియన్ ప్రభుత్వాన్ని పక్కన పెట్టిన ఆలోచనను కలిగించారు. అయితే ఫీల్డ్ మార్షల్ మునీర్ తాలిబన్ ప్రభుత్వం సైనిక ఎత్తుగడలను తేలిగ్గా తీసుకొని సరైన రీతిలో వారితో ఆర్మీపరంగా తలపడకపోవడం వల్ల పాకిస్థాన్ ఒక్కసారిగా మరింత బలహీనపడింది. పులిమీద పుట్రలా ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో అమెరికా నిర్ణయాలు తలకిందులయ్యాయి. ఇరాన్ బలమైన నాయకులను కోల్పోయినా అప్రతిహాతంగా యుద్ధం సాగిస్తూనే ఉంది. 2035 వరకు యుద్ధం చేస్తామని ఇరాన్ ప్రకటించడం నమ్మేట్లుగా లేదు. కానీ ఆయుధ సంపత్తిని నాయకత్వాన్ని ఇరాన్‌ను పాలించిన అధినేత ఖొమేనీ ఇజ్రాయెల్ ఎత్తుగడలను పసిగట్టినట్లుగా పెద్ద నాయకులు పోయినా కింది నుంచి వికేంద్రీకరణ చేసినట్లు యుద్ధ నిపుణులు చెబుతున్నారు. దానితో ఎంతనష్టం జరిగినా ఇరాన్ ఇప్పటి వరకు సాహసోపేతంగా బలమైన అమెరికా, ఇజ్రాయెల్‌ను ఎదుర్కోకలిగింది. క్రమేపీ రష్యా, చైనాలాంటి దేశాలు ఇరాన్‌ను ఆదుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. నాటో దేశాలు అమెరికాతో జట్టుకట్టడానికి సిద్ధంగా లేని పరిస్థితి. భీకరంగా యుద్ధం జరుగుతున్నా ఇండియా, ఆయిల్ సమస్యను పరిమితమైన అభ్యంతరాలతో పరిష్కరించుకొనే స్థాయికి చేరుకుంది. ధరలు పెరగటం అనేది యుద్ధ సమయంలో అన్ని దేశాలూ ఎదుర్కోవాల్సిందే. అయితే యుద్ధ పరంగా ఎటువైపు మొగ్గాలా అన్న మీమాంస మనదేశానికి ఎదురుకావటం లేదు. బలమైన దేశంగా గుర్తింపబడుతూనే అవసరమొస్తే పెద్ద మనిషి తరహాలో పరిష్కరించే విధంగా విదేశాంగ నీతి క్రమేపీ బలపడుతున్నది. చాలా దేశాలు ఊపిరాడని పరిస్థితిలో ఉంటే అదృష్టవశాత్తు ఇండియా ప్రస్తుతానికి తేలిగ్గానే గాలిపీల్చుకోగల్గుతున్నది. ●

# యువత భవితను మింగేస్తున్న డ్రగ్స్

తిప్పర్తి శ్రీనివాస్

తెలుగు రాష్ట్రాల్లో మాదకద్రవ్యాల సమస్య మరోసారి తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఇటీవల వెలుగులోకి వస్తున్న డ్రగ్స్ కేసులు, డ్రగ్స్ పార్టీల్లో పట్టుబడుతున్న ప్రముఖులు, యువతలో పెరుగుతున్న మత్తు అలవాట్లు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైందని భావించిన డ్రగ్స్ సమస్య ఇ ప్పుడు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వరకూ విస్త రించడం మరింత ప్రమాదకర పరిణామంగా మారింది. పోలీసులు తరచూ డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటూ, కోట్ల రూపాయల విలువైన మా దకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ ఈ వ్యాపా రం పూర్తిగా ఆగడం లేదు. పెద్దఎత్తున దాడులు జరుగుతున్నాయి, నిందితులు అరెస్టవుతున్నారు. అయినప్పటికీ కొద్ది రోజులు గడవక ముందే మరో చోట అదే తరహా ఘటన వెలుగులోకి రావడం సమస్య ఎంత లోతుగా విస్తరించిందో తెలియజేస్తోంది. అంటే డ్రగ్స్ సమ స్యను మూలాలతో సహా నిర్మూలించడంలో ఇంకా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన మొయినాబాద్ డ్రగ్స్ కేసు ఈ సమస్య తీవ్రతను మరింత స్పష్టంగా బయటపెట్టింది. డ్రగ్స్ పార్టీ నిర్వహిస్తూ పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు పట్టుబడటం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులే ఇలాంటి ఘటనల్లో కనిపించడం మరింత ఆందోళనకర విషయం. ఇలాంటి సంఘటనలు యువతకు తప్పుసంకేతాలు పంపే ప్రమాదం కూడా ఉంది. యువత డ్రగ్స్ బారిన పడటానికి అనేక కారణాలున్నాయి. ఫ్యాషన్‌గా భావించడం, స్నేహితుల ప్రభావం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలనే ప్రయత్నం, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలు యువతను ఈ ప్రమాదకర అల వాట్ల వైపు నడిపిస్తున్నాయి. కొందరికి ఇది ఒక ట్రెండ్‌లా అనిపించవచ్చు. కానీ క్షణికమైన మత్తు వెనుక ఆరోగ్య నాశనం, కుటుంబాల బాధలు, భవిష్యత్తు పతనం దాగి ఉన్నా యన్న విషయాన్ని చాలామంది గుర్తించడంలేదు. డ్రగ్స్ వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, అతని జీవి తాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది. చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు అన్నింటిపైనా దీని ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఎంతో ప్రతిభ కలిగిన యువకులు, యువతులు మత్తుకు బానిసై తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు కూడా పెద్ద ముప్పుగా మారుతోంది. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే, మాదకద్రవ్యాల వ్యాపారం గ్రామీణ ప్రాంతాల వరకూ విస్తరించడం. చిన్న పట్టణాలు, గ్రామాల్లో కూడా డ్రగ్స్ అందుబాటులోకి రావడం సమాజానికి ప్రమాదకర పరిణామం. ప్రభుత్వాలు డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక టాస్క్ ఫోర్సులను ఏర్పాటు చేయడం, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఛేదించడం, పెద్దఎత్తున దాడులు నిర్వహించడం వంటి చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ మాదక ద్రవ్యాల వ్యాపారం పూర్తిగా నియంత్రణలోకి రావడంలేదు. దీనికి ప్రధాన కారణం డ్రగ్స్ వ్యాపారం అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిన భారీ నెట్‌వర్క్ కావడం. కేవలం పోలీసు చర్య లతోనే దీనిని పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదు. ముఖ్యంగా తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకం. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు, వారి ప్రవర్తనలో మార్పులు ఉన్నా యా, అనవసర ఖర్చులు పెరిగాయా వంటి అంశాలను తల్లిదండ్రులు గమనించాలి. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడటం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. విద్యార్థులకు డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలి. యువతకు క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలు, సామాజిక సేవ వంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను అందించడం ద్వారా మత్తు అలవాట్ల నుంచి దూరంగా ఉంచవచ్చు. మొత్తానికి డ్రగ్స్ సమస్యను కేవలం చట్టపర మైన అంశంగా మాత్రమే చూడకూడదు. ఇది సామాజిక, మానసిక, ఆర్థిక అంశాలతో ముడిపడిన సంక్లిష్ట సమస్య. ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు - అందరూ కలిసి పనిచేసినప్పుడే ఈ డ్రగ్స్ దెయ్యాన్ని సమాజం నుంచి తరిమికొట్టడం సాధ్యం. ●

# వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆసరా ఎవరు?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిచ్చి ఎంతో బాధ్యతాయుతంగా పెంచడానికి ప్రయత్నిస్తారు. తప్పటడుగులు వేస్తూ ఉన్నా సవరించే ప్రయత్నం చేస్తూ పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే చాలా వరకు తల్లిదండ్రులు పిల్లలను సంరక్షిస్తూ కాలం గడిపేస్తుంటారు. అంతేకాకుండా తమ పిల్లలు వడివడిగా ఎదగాలని గొప్పవారు కావాలని పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని తన కుటుంబ గౌరవ ప్రతిష్టను పెంపొందించాలని బాల్య దశ నుండి ఆశల పల్లకిలో ఆర్భాటం లేని జీవితాలతో తల్లిదండ్రులు పిల్లల అభ్యున్నతికి చదువులకు భవిష్యత్తుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూంటారు. అయితే పిల్లలు ప్రయోజకులై సమాజంలో ఉన్నతమైన స్థితిని పొందిన తర్వాత కొందరు బాల్యంలో తన తల్లిదండ్రులు తమకు చేసిన సేవలను మరిచిపోయి కాలంతోపాటు వయసు మళ్లిన తల్లిదండ్రుల పట్ల ఎంతోకొంత అసహనం ప్రదర్శిస్తున్నతీరు చూస్తే ఇందుకేనాపిల్లల భవిష్యత్తు కొరకు తమ సమయం వృధాగా పోయిందా అనే రీతిలో నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రుల వేదనలు అరణ్య రోదనగానే మిగిలిపోతున్నాయా అని అనిపిస్తుంది. అధునాతన జీవన నాగరికత విధానాల్లో మానవ సంబంధాల మధ్య అనుకోని రీతిలో మానవతా విలువలు ఆత్మీయత అనురాగాలు తగినంతగా లేకపోవడం పిల్లలు తమ తల్లితండ్రులపై చూపిస్తున్న విభిన్న ధోరణులు చివరకు పిల్లలఆత్మీయత అనురాగాలకు నోచుకోని కొందరు తల్లిదండ్రులు ఒంటరి పరిస్థితుల్లో కాలంతోపాటు జీవిస్తున్న తీరు శోచనీయం. వయస్సు పెరుగుతున్న తల్లిదండ్రులకు దగ్గరుండి సేవలు అందించవలసిన పిల్లలు ప్రయోజకులైన తర్వాత కూడా కొందరు తల్లితండ్రులు భారం అయినట్టు వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలలో కూడా తరచుగా ఇలాంటి పరిస్థితి గోచరిస్తుండడం గమనార్హం. అయితే వయసు పైబడిన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత ప్రయోజకులైన యుక్త వయసు కలిగిన పిల్లలకే తప్పనిసరి చేయాలని దీనికి చట్టబద్ధత అవసరం అనే భిన్నమైన వాదనలు చాలా కాలం నుండి వినిపిస్తున్నాయి. వయసు పైబడిన తల్లిదండ్రుల బాధ్యతను ప్రయోజకులు అయిన పిల్లలే నిర్వర్తిస్తూ ఉండాలనేది తరచుగా ప్రభుత్వాలు సూచిస్తూ ఉండడం అభినందనీయం. అయితే సమాజంలోక్షేత్రస్థాయిలో చట్టపరంగా ఈఅంశంపైమరింతగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా సమాజంలో చూస్తున్న అనేక రకాలైన కుటుంబ సమస్యలు పరస్పర విభేదాలు వ్యతిరేక భావనలు ఒకే కడుపులో పుట్టినపిల్లల మధ్య పొడ చూపుతున్న తారతమ్యాలు జీవితం అంటే ఏమిటో తెలియని మానసిక సంఘర్షణల మధ్య వయసులో ఉన్న పిల్లలకు తమకంటే పెద్దవారిపట్ల వినయ విధేయత సంస్కారం



సభ్యత లాంటి భిన్నమైన ఆధారిత భావనలను సమాజ సన్నివేశాలను స్ఫూర్తిగా నిలిచే విధంగా బాధ్యతాయుతంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుండి మరింతగా సన్నద్ధం చేయాల్సి ఉంటుందేమో. అనాదిగా వస్తున్న ప్రజల జీవన విధానాల సంస్కృతి సాంప్రదాయాలు కట్టుబాట్లు విలువలు వైవిధ్యమైన మానవ సంబంధాలు లాంటి వాటి ప్రయోజనాల గురించి ప్రజలకు చెప్పే బోధకులు ప్రజల హృదయాల్లో కరువై పోయారా లేక వినే వాడికి చెప్పేవాడు లోకువ అవుతున్నాడా అనే సందేహం కొన్ని సందర్భాల్లో కలగక మానదు. ఒకప్పుడు సమాజంలో పెద్ద కుటుంబ వ్యవస్థ ఉండేది. కుటుంబంలో తల్లిదండ్రులకు సంతానం కూడా ఎక్కువ ఉండడమే కాకుండా ఆపద సంపద కష్ట సుఖాలలో కుటుంబ వ్యవస్థ బాగోగులను ఉన్న సంతానంలో ఒకరు కాకపోయినా మరొకరికైనా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల మంచి చెడులను అర్థం చేసుకునే మనస్తత్వం కలిగి ఉండే అవకాశం ఉండేదని చెబుతుంటారు. కానీ గడిచిన మూడు శతాబ్దాల నుండి తల్లిదండ్రుల కుటుంబ వ్యవస్థలో ఎక్కువగా ఇద్దరు పిల్లలతో మాత్రమే ఆయా కుటుంబ పరిసరాలజీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలో కుటుంబ వ్యవస్థ చాలా చిన్నదిగా ఉంటూ ఇతరుల మీద ఆధారపడాల్సిరావడం ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు తమకు తాముగా పరిష్కరించుకోలేకపోవడం ఒక ఎత్తు అయితే సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేవారు లేకపోవడం మరోఎత్తు అవుతుంది. కొన్ని సందర్భాల్లో పరిసరాల ప్రభావమో లేకుంటే ఆధునిక సంస్కృతిలో వస్తున్న భిన్న మార్పుకావచ్చేమో కానీ తల్లిదండ్రులు వారిపిల్లల పెంపకంలో విజ్ఞత సంస్కారం పట్ల ఆసక్తిని కనపరిచే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా చాలా సందర్భాల్లో వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులు చూసుకుని వారికి ఆసరాగా నిలిచే ప్రయోజకులైన కుటుంబ సభ్యులు లేకపోవడం, అంతర్గతంగా మానసిక ఒత్తిడిని భరిస్తున్న అనేకమంది తల్లిదండ్రులు గాథలు వర్ణణాతీతం. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే సమాజంలోశాంతియుత జీవనానికి మార్గం సుగమం అవుతుంది. లేకుంటే నిరంతరం ఏదోఒక సంక్షోభంతో జీవితం పరిసమాప్తం అవుతున్న సందర్భాలు లేకపోలేదు. దీనికి ప్రధానంగా మానవుల మధ్య అంతర్గతంగా అత్యున్నతమైన విలువలుకలిగినటువంటి సత్సంబంధాలు లేకపోవడం, కాలానుగుణంగా తప్పనిసరిగా కొన్నిసార్లు పోషించినపిల్లల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది. ఏదిఏమైనప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచేవిధానంలో ఆత్మీయత అనురాగాలు మానవత్వం పరస్పర సహకారం, సభ్యతా సంస్కారం సానుభూతి, మానవీయ కోణాలతో కూడినఉత్తమమైన, బాధ్యతాయుతమైన విలువల లాంటి లక్షణాలు చిన్ననాటి నుండే మరింతగా పెంపొందించే ప్రయత్నం చేస్తే ఆధునిక జీవన నాగరికత ప్రపంచంలో మానవ సంబంధాల మధ్య అగాధం ఏర్పడకుండా ఉండడమే కాకుండా వివేకం విచక్షణ కలిగి మంచి ఆలోచన దృక్పథంతో ఉండే కుటుంబ వ్యవస్థ సమాజానికి మార్గదర్శకంగా ఉండే అవకాశం లేకపోలేదు. ●

## మంత్రి పదవి ఊడగొట్టిన సీనియర్ ఐఏఎస్ ఆత్మహత్య

**అమృత్‌సర్,మార్చి 22:** పంజాబ్‌లో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అధికారి గగన్‌దీప్ సింగ్ రణ్‌ధావా ఆత్మహత్య కేసు ఆ రాష్ట్ర మంత్రి లల్జీత్ సింగ్ భుల్లర్ మంత్రి పదవిని ఊడగొట్టింది. మంత్రి లల్జీత్ సింగ్ వేధింపుల కారణంగానే ఒత్తిడి తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సదరు అధికారి తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. దాంతో ఆయన భార్య ఉపిందర్ కౌర్ రంజిత్ అవెన్యూ పోలీస్‌స్టేషన్‌లో మంత్రిపై ఫిర్యాదు చేసింది. మంత్రి లల్జీత్ సింగ్ భుల్లర్, ఆయన తండ్రి సుఖ్‌దేవ్ సింగ్ భుల్లర్, మంత్రి పీఏ తన భర్తను శారీరకంగా, మానసికంగా వేధించారని కౌర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ముగ్గురు కలిసి వేధింపులతో తన భర్తను ఆత్మహత్య చేసుకునే స్థితికి తీసుకెళ్లారని ఆరోపించారు. ఉపిందర్ కౌర్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పంజాబ్ సిఎం నిష్పాక్షిక విచారణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేయాలని మంత్రి లల్జీత్‌సింగ్‌ను ఆదేశించారు. దాంతో ఆయన తన పదవికి రాజీనామా చేశా రు. రంధావా ఆత్మహత్య పంజాబ్ రాజకీయా ల్లో ఒక్కసారిగా కలకలం రేపింది. ఈ ఘటనపై ప్రతిపక్షాలైన కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ తీవ్రంగా స్పందించాయి.

# మోడీ @ 8931

## పాలనలో నరేంద్ర మోడీ సరికొత్త రికార్డు

### ముఖ్యమంత్రి, ప్రధాని పదవిలో నిర్విరామంగా కొనసాగింపు



**న్యూఢిల్లీ, మార్చి 22:** ప్రధాని నరేంద్ర మోడీ భారత రాజకీయాల్లో ఓ చారిత్రక మైలురాయిని అందుకున్నా రు. ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం అధినేతగా పనిచేసిన వ్యక్తిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించా రు. ఈ క్రమంలో సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోడీఅధి గమించా రు. ప్రజా జీవితంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఆయన 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. పవన్ కుమార్ చామ్లింగ్ సిక్కిం సీఎంగా 8,930 రోజులు పదవిలో కొనసాగగా, మోదీ ఆ రికార్డును దాటి 8,931రోజులు పూర్తి చేసుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగాను, భారత ప్రధానిగా ఆయన పనిచేసిన కాలాన్ని కలిపి ఈ ఘనత సాధించా రు. ఈ అరుదైన మైలురాయి ఆయన సుదీర్ఘ రాజకీ య ప్రస్థానానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. నరేంద్ర మోడీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ సిఎంగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 2014 మే 21 వరకు, దాదాపు 13 ఏళ్లకు పైగా ఆ పదవిలో కొనసాగి, గుజరాత్‌కు అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా నిలిచారు. ఆతర్వాత 2014 మే 26న 14వ భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్రం తర్వాత జన్మించి ప్రధాని అయిన తొలి వ్యక్తిగా, వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నేతగా ఆయనకు పలు రికార్డులు ఉన్నాయి. పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తిచేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా ఆయన ఘనత సాధించా రు. రాజకీయ రికార్డులతో పాటు, డిజిటల్ ప్రపంచం లోనూ మోడీ తనదైన ముద్ర వేస్తున్నారు. ఈ ఏడాది ఆయన సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లను దాటారు. ఇటీవలే తన యూట్యూబ్ ఛానెల్‌లో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించు కుని, ప్రపంచ నేతల్లో అగ్రస్థానంలో నిలిచారు. గత ఫిబ్రవరిలో ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి ప్రపంచ నేతగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆయనకు ఇన్‌స్టాలో 10.1 కోట్ల మంది, ఎక్స్‌లో 10.64 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రం లక్ష్యంగా ఇరాన్ తీవ్రదాడులు

**జెరూసలేం, మార్చి 22:** ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుప డింది. డిమోనా నగరంలోని ఇజ్రాయెల్ కు అత్యంత కీలకమైన అణు పరిశోధనా కేంద్రం లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. అణు పరిశోధన కేంద్రం సమీపంలోని భవనాలపై ఈ క్షిపణులు పడ్డాయి. అయి తే ఈ పరిశోధన కేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, పౌరుల నివాసాలపై దాడులు జరగడంతో 100 మందికిపైగా గాయపడ్డారు. శనివారం ఇరాన్‌లోని కీలకమైన అణుశుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగానే తాజాగా టెహ్రాన్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ నుంచి రెండు బాలిస్టిక్ క్షిపణులు రాగా.. వాటిని అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు విఫలమయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అరాద్, డిమోనా నగరాల్లోని నివాస ప్రాంతాలపై క్షిపణులు పడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున మంగలు చెలరేగగా భవనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అరాద్‌లో జరిగిన దాడిలో దాదాపు 88 మంది గాయపడగా వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉందని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. దెబ్బతిన్న భవనాల నుంచి దాదాపు 150 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్‌కు కీలకమైన అణుపరిశోధనా కేంద్రం ఉన్న డిమోనా నరగరంలోని ఒక భవనంపై క్షిపణి దాడి జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ ఘటనలో 40 మందికిపైగా గాయపడగా వారిలో పదేళ్ల బాలుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## ఓ వైపు హెచ్చరికలు.. మరోవైపు యుద్ధ విరమణ చర్చలు!

### కొత్త మధ్యవర్తికోసం అమెరికా అధ్యక్షుడి అన్వేషణ

**వాషింగ్టన్, మార్చి 22:** ఇరాన్‌పై కఠిన హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరవెనుక శాంతి యత్నాలు ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకుని, చర్చలు జరిపేందుకు అమెరికా సిద్ధమవుతోందని సమాచారం. ఇందుకోసం ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన కొత్త మధ్యవర్తి కోసం అన్వేషణ సాగుతున్నట్లు తెలుస్తోంది. యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతుండటమే ట్రంప్ వైఖరిలో మార్పునకు ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. పెరుగుతున్న చమురు ధరలతో అమెరికా స్టాక్ మార్కెట్లు అస్థిరంగా మారాయి. ఒకవైపు ఇరాన్‌కు 48 గంటల అల్టిమేటం జారీ చేయడం, మరోవైపు శాంతి మంత్రం జపించడం ట్రంప్ అనుసరిస్తున్న ఒత్తిడి చర్చల వ్యూహంలో భాగమని నిపుణులు చెబుతున్నారు. కఠినమైన హెచ్చరికల ద్వారా ఇరాన్‌పై ఒత్తిడి పెంచి, చర్చల టేబుల్‌పైకి తీసుకురావడమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇరాన్ చమురు రవాణాపై కొన్ని ఆంక్షలను సడలించేందుకు కూడా అమెరికా సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. "మేము మా లక్ష్యాలకు చాలా దగ్గరగా ఉన్నాము అని ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ముగింపు పలకాలనే ఆయన ఆలోచనకు బలం చేకూరుస్తున్నాయి.

## ఆదేశం కోరితే అమెరికానుంచి మేమే రక్షిస్తాం

### గ్రీన్‌ల్యాండ్‌పట్ల అమెరికా నైజంపై ఇరాన్ వెల్లడి

**టెహ్రాన్, మార్చి 22:** అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ టెహ్రాన్ నుంచి ఓ వినూత్న ప్రతిపాదన వెలువడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి గ్రీన్ లాండ్‌ను తాము కాపాడతామని, ఆ దేశం ఒక్కసారి అభ్యర్థిస్తే చాలు వెంటనే రంగంలోకి దిగుతామని ఇరాన్ ప్రకటించింది. అమెరికాను నేరుగా రెచ్చగొట్టేలా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. గ్రీన్ లాండ్ ను ఎలాగైనా దక్కించుకోవాలని, అమెరికా జాతీయ భద్రతకు అది అత్యంత కీలకమని డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెపుతున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఆ దీవిని కొనుగోలు చేయడానికి సిద్ధమని అన్నారు. డెన్మార్క్ ప్రభుత్వం ఈ కొనుగోలు ప్రతిపాదనను తోసిపుచ్చినప్పటికీ, అవసరమైతే సైనిక చర్యల ద్వారా గ్రీన్ లాండ్ పై పట్టు సాధించాలని ట్రంప్ యోచిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై ఐరోపా సమాఖ్య, నాటో దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ వ్యూహాత్మకంగా ఈ ఆఫర్‌ను తెరపైకి తెచ్చింది. అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న దేశాలకు మద్దతు ఇవ్వడం ద్వారా అగ్రరాజ్యాన్ని ఇరుకున పెట్టాలని ఇరాన్ భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. గ్రీన్ లాండ్ కోరితే చాలు, వారికి మేము రక్షణగా నిలుస్తామని ఇరాన్ అధికారులు పేర్కొనడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అయితే, ఇరాన్ చేసిన ఈ ప్రతిపాదనను పాశ్చాత్య దేశాలు ఓ అపహాస్యంగా కొట్టిపారేస్తున్నాయి.

## హార్ముజ్‌పై దాడిచేస్తే జలశుద్ధి ప్లాంట్లను ధ్వంసం చేస్తాం

### ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ ఘాటైన స్పందన

**టెహ్రాన్, మార్చి 22:** హార్మ్యూజ్ జలసంధిని తెరవాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన 48 గంటల హెచ్చరికలకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలోని విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తే, పశ్చిమాసియాలోని శత్రుదేశాల మంచినీటి ప్లాంట్లనే లక్ష్యంగా చేసుకుంటామని ఘాటుగా హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సైనిక ఉన్నతాధికారులు చేసిన ప్రకటన గల్ఫ్ ప్రాంతంలో కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. పశ్చిమాసియాలోని సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ వంటి దేశాలు తమ తాగునీటి అవసరాల్లో దాదాపు 90 శాతం సముద్రపు నీటిని శుద్ధి చేసే డీశాలినేషన్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ హెచ్చరికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్లాంట్లపై చిన్న క్షిపణి దాడి జరిగినా కోట్లాది మంది ప్రజలు తీవ్ర నీటి సంక్షోభంలో చిక్కుకుంటారు. విద్యుత్ ప్లాంట్లతో పోలిస్తే నీటి శుద్ధి కేంద్రాల పునరుద్ధరణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది, ఎక్కువ సమయం తీసుకుంటుంది. అందుకే తమపై దాడి జరిగితే శత్రుదేశాల మనుగడనే దెబ్బతీసేలా ఈ ప్రణాళికను ఇరాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకటనతో అమెరికాకే కాకుండా, ఆ దేశ మిత్రపక్షాలైన అరబ్ దేశాలకు కూడా ఇరాన్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చింది. హార్మ్యాజ్ జలసంధి వివాదం ఇప్పుడు నీటి యుద్ధం వైపు మళ్లుతోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న వేళ, ఇరు దేశాల నుంచి వస్తున్న ఇటువంటి కవ్వింపు చర్యలు, ప్రతిస్పందనలు గల్ఫ్‌లో యుద్ధ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

## డిగోగార్సియాపై మేం దాడిచేయ లేదు: ఇరాన్

**టెహ్రాన్, మార్చి 22:** అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, హిందూ మహాసముద్రంలోని అమెరికా-బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం డీగో గార్సియాపై క్షిపణి దాడికి ప్రయత్నించామన్న ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ సీనియర్ అధికారి స్పష్టం చేశారు. తమ క్షిపణుల పరిధి 2 వేల కిలోమీటర్లేనని ఉద్ఘాటించారు. ఇరాన్ సుమారు 4 వేల కిలోమీటర్ల దూరంలోని డీగో గార్సియా లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వాటిలో ఒకటి సాంకేతిక లోపంతో గాల్లోనే విఫలమవ్వగా, మరొకదాన్ని అమెరికా యుద్ధనౌక అడ్డుకున్నట్లు సమాచారం. ఈ దాడి వార్తలు నిజమైతే, ఇరాన్ క్షిపణి సామర్థ్యం అంచనాలను మించి పెరిగినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌లోకి భూతల దళాలను పంపేందుకు పెంటగాన్ సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వార్తలు వస్తున్నాయి.

## 'లిటిల్ ఇండియా'ను తాకిన ఇరాన్ క్షిపణులు


**టెల్అవీవ్, మార్చి 22:** ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడు తోంది. తాజాగా ఇరాన్ క్షిపణులు అక్కడి డిమోనా నగరాన్ని తాకాయి. ఈ దాడుల్లో 30 మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని 'లిటిల్ ఇండియా'గా పిలుస్తారు. ఇక్కడి జనాభాలో దాదాపు 30 శాతం భారత సంతతికి చెందినవారు ఉండడమే కారణం. కొన్ని దశాబ్దాల క్రితమే వారు స్థిరపడ్డారు.

**లిటిల్ ఇండియా:**

టెల్‌అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం. 1950-60లలో భారత్-యూదు కమ్యూనిటీకి చెందిన అనేకమంది ఇజ్రాయెల్‌కు వలస వెళ్లారు. మహారాష్ట్ర, కేరళ, కోల్‌కతాకు చెందిన వారు ఉన్నారు. వారంతా డిమోనా ప్రాంతంలో స్థిరపడ్డారు. దీంతో అది లిటిల్ ఇండియాగా పేరు పొందింది. ఇటీవల మిజోరం, మణిపూర్‌కు చెందిన మరికొంతమంది భారత యూదులు కూడా డిమోనాకు వలస వెళ్లారు. ప్రస్తుతం ఈ నగరంలో దాదాపు 7,500 మంది భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు.

# పుదుచ్చేరి రంగంపై మళ్లీ 'స్వామి?'

- కొలిక్కి వచ్చిన సీట్ల సర్దుబాటు.. ఎన్‌డియే అభ్యర్థుల ప్రకటన
- నేడు డిఎంకె-కాంగ్రెస్ జాబితా
- ఒంటరిగానే బరిలోకి విజయ్ పార్టీ టివికె అభ్యర్థుల జాబితా విడుదల




**చెన్నై, మార్చి 22:** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి నేతృత్వంలోని ఎఐఎన్ఆర్‌సి-బిజెపి-ఎఐఎడిఎంకె కూటమి మరోమారు అధికారం చేజిక్కిం చుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. అటు డిఎంకె-కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని పట్టుదలతో ఎన్నికల బరిలోకి దిగింది. రంగస్వామి చుట్టూనే రాజకీయాలు కొనసాగడం విశేషం. రంగస్వామి దాదాపు మూడు దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో కొనసాగారు. అటు ఎఐఎడి ఎంకె, ఇటు డిఎంకెలతో కలిసి పుదుచ్చేరిలో ప్రభుత్వా ల ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారు. ఓ సారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి ఎఐఎన్ఆర్‌సి పేరుతో పార్టీ చేసి 41 రోజుల్లోనే ఎన్‌డియే అండతో పార్టీని అధికారంలో తెచ్చారు. రెండోసారి సిఎం పగ్గాలు చేపట్టారు. మరోమారు అధికారం తమదేనన్న ధీమాతో సీట్ల సర్దుబాటును పూర్తి చేసుకుని, ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అటు ఇండియా కూటమి సీట్ల సర్దుబాటు అయిపోయింది. ఎన్‌డిఏ కూటమిలో సిఎం రంగస్వామి పార్టీ ఎఐఎన్ఆర్‌సి 16 స్థానాల్లో పోటీ చేస్తుండగా, బిజెపి 10, ఎఐఎడిఎంకె 2, ఎల్‌జెకె 2 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. అటు కాంగ్రెస్- డిఎంకె చెరో 15 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించు తున్నాయి. ఇక నామినేషన్లకు సోమవారం ఆఖరి రోజు కావడంతో అన్ని పార్టీల అభ్యర్థులు ఆ బిజీలో ఉన్నా రు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీలో ఐదు ఎస్‌సి రిజర్వు స్థానాలు. సిఎం రంగస్వామి తత్తాంచ వడి, మంగళం స్థానాల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే మంత్రులు ఎ.నమశ్శివాయం, జాన్ కుమార్, స్పీకర్ ఆర్.సెల్వం, కాంగ్రెస్-డిఎంకె సిట్టింగ్ ఎమ్మెల్యే లు ఆయా స్థానాల్లో మరోమారు తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. ఎఐఎన్ఆర్‌సి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వంలో ఏ శాఖ లేని మంత్రిగా కొనసాగి న ఎ. జాన్ కుమార్ (బిజెపి) కామరాజ్ నగర్ నుంచి ముదలియర్‌పేట్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్-డిఎంకె మధ్య సీట్ల సర్దుబా టుపై ఎడతెగని చర్చలు ఆయా పార్టీల్లో గందరగోళం సృష్టిం చింది. ఆదివారం రాత్రి వరకు సీట్ల సర్దుబాటుపై సమా లోచనలు జరిగాయి. ఎఐసిసి తరఫున కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం నేరుగా ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చలు జరపడంతో సమస్య కొలిక్కి వచ్చిం దని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇరు పార్టీలు 15:15 స్థానాల్లో పోటీ చేయాలని ఓ అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోం ది. ఇదే విషయాన్ని ఎఐసిసి పెద్దలకు చిదంబ రం వివరించడంతో, అభ్యర్థుల జాబితాపై దృష్టి సారిం చినట్లు సమాచారం. సోమవారం ఉదయం నేరుగా అభ్యర్థులకు సమాచారం అందజేస్తామని ఎఐ సిసి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అటు సినీనటుడు, టివి కె పార్టీ అధినేత విజయ్ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటిం చారు. ఆది వారం సాయంత్రం అభ్యర్థుల పేర్లను ప్రక టించారు. సోమవారం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో కలిసి నామినేషన్ల ప్రక్రియలో స్వయంగా పాల్గొంటారని, అయితే ఏ నియోజక వర్గంలో నామినే షన్ల ప్రక్రియకు హాజరవుతారని మాత్రం తెలియదని టివికె పార్టీ తెలిపాయి. నేటితో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండగా ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందో వేచిచూడాలి.

## గోల్డ్ స్మగ్లింగ్‌కేసులో రూ.2 కోట్లు పోగొట్టుకున్న రన్యారావు

**బెంగళూరు, మార్చి 22:** గోల్డ్ స్మగ్లింగ్ కేసు లో నిందితురాలిగా ఉన్న నటి రన్యా రావుకు సంబంధించి ఓ నమ్మలేని నిజం వెలుగులోకి వచ్చింది. అక్రమ మార్గంలో కోట్లు సంపాదించాలని స్మగ్లింగ్ మొదలుపెట్టిన రన్యారావు అదే ప్రయత్నంలో ఏజెంట్ చేతిలో మోసపోయి రూ.2 కోట్లు పోగొట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణలో వెల్లడైంది. ఈ విషయాన్ని ఈడీ తన చార్జిషీట్‌లో వివరించింది. తక్కువ ధరకు నేరుగా ఆఫ్రికా గనుల నుంచి బంగారం కొనుగోలు చేయాలని రన్యా ముందుగా ప్లాన్ చేసింది. ఇందుకోసం బెన్ అనే ఉగాండా ఏజెంట్‌ను నమ్మింది. ఆ ఏజెంట్ ఆమె నుంచి రూ.2 కోట్లు తీసుకుని బంగారం ఇవ్వకుండా మోసం చేశాడు. ఆఫ్రికాలో మోసపోయిన తర్వాత, రన్యా తన పంథా మార్చింది. దుబాయ్ మార్కెట్లో బంగారం కొని భారత్‌కు అక్రమంగా తరలించడం ప్రారంభించింది. తన సవతి తండ్రి సీనియర్ పోలీస్ అధికారి కావడంతో ఎయిర్‌పోర్టులో లభించే ప్రొటోకాల్ సౌకర్యాన్ని దుర్వినియోగం చేసింది. ఈసౌలభ్యంతో కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి సులభంగా తప్పించుకునేది. 2024 మార్చి నుంచి 2025 మార్చి మధ్య కేవలం ఏడాది కాలంలోనే ఆమె 15 సార్లు దుబాయ్ వెళ్లివచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ పర్యటనల్లో సుమారు 127 కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్లు ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నది. ప్రస్తుతం ఈ కేసులో రన్యారావు బెంగళూరు సెంట్రల్ జైలులో ఉంది.

## ఇంధన భద్రత, స్టోరేజిపైనే భారత్ ఫోకస్

### మంగుళూరు పోర్టుకు చేరిన అమెరికా, రష్యా చమురునౌకలు!

**న్యూఢిల్లీ, మార్చి 22:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో ఆటంకాలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ తన ఇంధన భద్రత ను పటిష్ఠం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగం గా అమెరికా నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్‌ని, రష్యా నుంచి ముడి చము రును రాబట్టింది. ఆ రెండు దేశాలకు చెందిన భారీ నౌకలు మంగళూరు పోర్టుకు చేరుకున్నాయి. అమెరికాలోని టెక్సాస్ నుంచి ఎల్పీజీతో బయలుదేరిన పైక్సిస్ పయనీర్ అనే కార్గో నౌక విజయవంతంగా మంగళూరు పోర్టులో లంగరేసింది. ఇదే సమయంలో రష్యా నుంచి ముడి చమురును తీసుకొచ్చిన మరో నౌకను కూడా పోర్టుకు 18 నాటికల్ మైళ్ల దూరంలో నిలిపి ఉంచారు. సింగిల్ పాయిం ట్ మూరింగ్ వ్యవస్థ ద్వారా ఈ చమురును పైప్‌లైన్‌లోకి, అక్కడి నుంచి మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్‌కు తరలించనున్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన ధరలను స్థిరీకరించే లక్ష్యంతో సముద్రంలో అప్పటికే ప్రయాణంలో ఉన్న రష్యా ముడి చమురు అమ్మకాలకు అమెరికా తాత్కాలికంగా అనుమతి ఇచ్చింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఇరాన్ ప్రమేయంతో నెలకొన్న వివాదాలవల్ల సరఫరాలో ఆటంకాలు ఏర్పడటంతో భారత్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో ఈ వారం గుజరాత్‌లోని వాడినార్, ముంద్రా పోర్టులకు నందా దేవి, శివాలిక్ అనే రెండు భారత ఎల్పీజీ ట్యాంకర్లు కూడా సురక్షితంగా చేరుకున్నాయి.

## ఖతార్ సముద్ర జలాల్లో కూలిపోయిన సైనిక హెలికాప్టర్

**దోహా, మార్చి 22:** ఖతార్‌లో దేశానికి చెందిన ఒక సైనిక హెలికాప్టర్ ఆదివారం సముద్ర జలాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడమే ప్రమాదానికి కారణమని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఖతార్‌కు చెందిన హెలికాప్టర్ రొటీన్ డ్యూటీలో ఉండగా సాంకేతిక సమస్య కారణంగా దేశ జలాల్లో కూలిపోయిందని తెలిపింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారని ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీరిలో ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఏడో వ్యక్తి కోసం కోస్ట్ గార్డ్, బోర్డర్ సెక్యూరిటీ, అంతర్గత భద్రతా దళాలకు (లెఖ్వియా) చెందిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ ఘటన జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యా యి. ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిన ప్రమాదమేనని, దీని వెనుక ఎలాంటి శత్రుచర్య లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ రకం, అది కూలిపోయిన కచ్చితమైన ప్రదేశం వంటి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## డొనాల్డ్‌ట్రంప్ ఆరోగ్యంపై మళ్లీ వెల్లువెత్తిన సందేహాలు



**ఫ్లోరిడా, మార్చి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం మరోసారి చర్చల్లోకి వచ్చింది. ఫ్లోరిడాలోని మార్‌ఎలాగోకు చేరుకున్న ఆయన, ఎయిర్ ఫోర్స్ వన్ విమానం నుంచి దిగుతున్నప్పుడు తీసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడమే ఇందుకు కారణం. ఈ వీడియోలో ఆయన మెట్లు దిగుతున్నప్పుడు కాస్త నెమ్మదిగా, జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు కనిపించారు. 79 ఏళ్ల ట్రంప్, విమానం మెట్లకు ఉన్న రెయిలింగ్‌ను పట్టుకుని నిదానంగా కిందకు దిగడం ఈ క్లిప్‌లో రికార్డయింది. ఈ వీడియోను ఎక్స్(ట్విట్టర్) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో చాలా మంది షేర్ చేశారు. ట్రంప్ నిజంగా వయసు పైబడినట్లు, అలసిపోయినట్లు కనిపిస్తున్నారు. ఎయిర్ ఫోర్స్ వన్ మెట్లు కూడా సరిగా దిగలేకపోతున్నారనే క్యాప్షన్‌తో ఒక పోస్ట్ విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఈ వీడియోపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు ట్రంప్ అలసిపోయినట్లు, అస్థిరంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేయగా, మరికొందరు ఈ వాదనలను కొట్టిపారేశారు. ఆయన ఆరోగ్యం గురించి నిజం చెప్పాల్సిన సమయం వచ్చిందని ఒకరు వ్యాఖ్యానించగా, మరికొందరు ఆయన వయసు, ఆహారపు అలవాట్లను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. గత కొద్ది నెలలుగా ట్రంప్ ఆరోగ్యంపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఆయన చేతులు రంగుమారాయని, కాళ్లు వాచినట్లు కనిపిస్తున్నాయని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. వైట్ హౌస్ వైద్యుడు రోనీ జాక్సన్ ఇచ్చిన నివేదికను ఉటంకిస్తూ, తాను అత్యంత ఆరోగ్యవంతుడైన అధ్యక్షుడినని ట్రంప్ గతంలో స్పష్టం చేశారు. తాజా వీడియోతో ఆయన శరీర దారుఢ్యంపై మరోసారి చర్చ మొదలైంది.

## మధ్యప్రాచ్య దేశాల్లో ఇరాన్ దాడులు తక్షణమే నిలిపివేయాలి

- హార్ముజ్ జలసంధిలో రవాణాను పునరుద్ధరించాలి
- ఇరాన్‌కు జీ7 దేశాల డిమాండ్




**ప్యారిస్, మార్చి 22:** మధ్యప్రాచ్యంలోని అనేక దేశాలపై ఇరాన్ మౌలికవనరులపై దాడులు చేయడం, పౌరుల నివాసాలపైనా దాడులు చేయడాన్ని జి-7 దేశాలకూటమి తీవ్రంగా ఖండించింది. కెనడా, ఫ్రాన్స్,జర్మనీ, ఇటలీ, జపాన్; యుకె, యుఎస్ఎ దేశాలు, యూరోపియన్ యూనియన్‌ప్రతినిధులు ఇరాన్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే దాడులు ఆపివేయాలని కోరారు. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్; సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇరాక్‌లపై దాడులుచేయడం గర్హణీయమని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి 2817 తీర్మానం ప్రకారం ఒప్పందాల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. ఇరాన్ దాడులు కేవలం ప్రాంతీయ భద్రతకే కాకుండా ప్రపంచ భద్రతకు కూడా ముప్పుతెస్తాయని ఆందోళన వ్యక్తంచేసారు. ఇరాన్ తక్షణమే ఈ సైనిక చర్యలు దాడులు నిలిపివేయాలనికోరారు. మౌలికవనరులపైనా, పౌర నివాసాలపైనా దాడులు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్‌చేసారు. అలాగే హార్మ్యజ్ జలసంధినుంచి రవాణాను పూర్తిస్థాయిలో సడలించాలని వారు కోరారు. హార్మ్యజ్ జలసంధి మూసివేత కారణంగా ప్రపంచ సరఫరా చెయిన్ దెబ్బతింటుందని, ఇంధన మార్కెట్లలో అస్థిరత చోటుచేసుకుంటుందని తెలిపారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను సాధించలేదని, ఇప్పటికే తన బాలిస్టిక్ క్షిపణి పథకం కూడా నిలిపివేయాలని, ఈ ప్రాంతీయంగా అస్థిరత కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని జీ7 దేశాలు కోరాయి. ఈ దాడులనుంచి రక్షణపొందే హక్కు ఆ దేశాలకు ఉంటుందనేది గుర్తుంచుకోవాలని ఈ దేశాలు కోరాయి. గల్ఫ్‌దేశాలకు తమ సంపూర్ణ మద్దతిస్తామని, ఆదేశాల భద్రత, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు తాము మద్దతిస్తామన్నారు. దౌత్య కార్యాలయాలు, ఇంధన మౌలికవనరులపై దాడులు అత్యంత అమానవీయమని జిసెవెన్‌దేశాలు పేర్కొన్నారు. ఇరాఖీ కుర్దిస్తాన్ రీజియన్‌లో ఇరాన్‌చేస్తున్నదాడులు అత్యంత హేయకరమని ఈ దేశాల అధినేతలు పేర్కొన్నారు.

## హార్ముజ్ జలసంధి సమీపంలోకి బ్రిటన్ జలాంతర్గామి



**లండన్, మార్చి 22:** హార్మ్యాజ్ జలసంధి వద్ద ఇరాన్‌ను కట్టడి చేసేందుకు ఇతర దేశాలు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పిలుపునిచ్చారు. అమెరికా ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హార్మ్యాజ్ జలసంధి గుండా శత్రుదేశాల వాణిజ్య నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకుంటున్న నేపథ్యంలో ట్రంప్ ఈవిధంగా అప్పీల్ చేశారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్‌కు చెందిన అణు జలాంతర్గామి హెచ్ఎంఎస్ ఆన్సన్ హార్మ్యాజ్ జలసంధి వద్దకు చేరుకున్నట్లు సమాచారం. దీనిని ఉత్తర అరేబియన్ సముద్రంలో మోహరిం చినట్లు బ్రిటిష్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇందులో తోమ్‌హాక్ క్షిపణులు, భారీ టోర్పడోలు, శక్తిమంతమైన ఆయుధ సంపత్తి ఉన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఘర్షణలు మరింత తీవ్రరూపం దాలిస్తే ఇరాన్‌పై బ్రిటన్ దళాలు దాడులు చేయవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఈ జలాంతర్గామిలో 1000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. శత్రువుల కంట పడకుం డా నీటి అడుగు నుంచి దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం. ఈ చర్య ద్వారా తన మిత్రదే శమైన అమెరికాకు మద్దతు తెలప డంతో పాటు, ఇరాన్ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని యూకే భావి స్తోంది. హార్మ్యాజ్ జలసంధి, ఎర్ర సము ద్రం వంటి కీలక వాణిజ్య మార్గాల్లో నౌకాయా నానికి ఎలాం టి ఆటంకాలు కలగకుండా చూడటమే తమ ఉద్దేశమని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. బ్రిటన్ చర్యపై ఇరాన్, రష్యాలు తీవ్రంగా స్పందించాయి. తమ జలాల్లోకి విదేశీ శక్తులు ప్రవేశిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. ఇది యుద్ధాన్ని మరింత రెచ్చగొట్టే చర్య అని, ఉద్రిక్తతలను మరింత పెంచుతుందని రష్యా విమర్శించింది

# పార్టీ బలోపేతానికి జిల్లాల్లో ఫోకస్



## పర్యటనలకు శ్రీకారం చుట్టిన పిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** డిసిసి కమిటీల ప్రకటన అనంతరం జిల్లా పర్యటనలకు పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా టిపిసిసి అధ్యక్షుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలుగు సంవత్సరాది పండుగ ఉగాది రోజున 14 జిల్లాల డిసిసి కమిటీలను ప్రకటించారు. ఆదివారం యాదాద్రి జిల్లాతో పర్యటనలకు శ్రీకారం చుట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన డిసిసి కార్యవర్గ సమావేశంలో మహేష్ కుమార్ పాల్గొని వారికి బలోపేతానికి క్షేత్రస్థాయిలో అను సరించాల్సిన వివిధ విధానాలను వివరించారు. యాదాద్రి జిల్లాలో 66 మందితో డిసిసి కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఇందులో ఏడుగురు ఉపాధ్యక్షులు, 12 మంది ప్రధాన కార్యదర్శులు, ఒకరు వాచక ప్రతినిధి, 29 మంది కార్యదర్శులు, 17 మంది కార్యవర్గసభ్యులను నియమించారు. జిల్లా పర్యటనల ద్వారా పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థంగా చేరేలా చర్యలు చేపట్టనున్నారు.ప్రతి జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక సమస్యలు, పార్టీ పరిస్థితులపై సమీక్ష చేపట్టనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసి, భవిష్యత్ ఎన్నికల దిశగా పటిష్ట కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటనలు కొనసాగనున్నాయి.అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడం ద్వారా పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.జిల్లాల పర్యటనల ద్వారా పార్టీలో కొత్త ఉత్సాహం వస్తుందని, కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశను చూపిస్తాయని పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

## కొత్త చరిత్రాత్మక మైలురాయిని అధిగమించిన పిఎం మోడీ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** భారతదేశంలో ఎక్కువకాలం పాటు ప్రభుత్వాధినేతగా సేవలందించిన నాయకుడిగా చారిత్రాత్మక మైలురాయిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధిగమించారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఈమేరకు మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మొదట గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం భారత ప్రధానమంత్రిగా మొత్తం 8,931 రోజుల పాటు ప్రజాసేవలో కొనసాగుతున్న మోదీ ప్రయాణం అంకితభావం, క్రమశిక్షణ, దేశం పట్ల నిస్వార్థ సేవకు ఒక గొప్ప ఉదాహరణ అన్నారు. మోదీ జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం అయిందన్నారు. ఆయన పని తీరు, కష్టపడే స్వభావం, దేశం పట్ల ఉన్న బాధ్యతాభావం వల్లే ఈ స్థాయికి చేరుకున్నారని, ప్రజల కోసం పని చేయాలనే తపనతో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని ముందుకు నడిపించాయన్నారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే విధానంతో నరేంద్ర మోదీ దేశానికి దిశానిర్దేశం చేశారన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ రంగంలో పురోగతి, సంక్షేమ పథకాల అమలు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంతో దేశం గణనీయంగా అభివృద్ధి చెందిందని అన్నారు. జనధన్ యోజన ద్వారా పేదలకు బ్యాంకింగ్ సదుపాయం, ఉజ్వల యోజన ద్వారా మహిళలకు గౌరవప్రద జీవనం, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భద్రత, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్షలాది మందికి ఇళ్ల నిర్మాణం.. ఇలా మోదీ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రతి వర్గానికి చేర్చింది. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా వచ్చిన విజయాలు, ప్రజా మద్దతు, మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయన్నారు. ఇది ప్రజలతో ఆయనకు ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం అన్నారు. 24 సంవత్సరాలకు పైగా ఒక్క సెలవు కూడా తీసుకోకుండా దేశ సేవలో నిరంతరం పనిచేయడం ఆయన అంకితభావానికి నిదర్శనం అన్నారు. ముఖ్యంగా యువతకు ఆయన జీవితం ఒక ప్రేరణ.సాధారణ కుటుంబం నుంచి దేశ అత్యున్నత స్థానానికి చేరుకున్న మోదీ ప్రయాణం భారత ప్రజాస్వామ్య శక్తికి ఒక గొప్ప ఉదాహరణ అన్నారు.

## కామారెడ్డిలో వీధికుక్క స్వైరవిహారం

### ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు, నీలోఫర్‌కు తరలింపు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వీధి కుక్కల స్వైర విహారం ఆగడం లేదు. వీధుల్లో ఒంటరిగా ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేస్తూ కరుస్తున్న ఘటనలు పెరుగుతూనే వున్నాయి. తాజాగా ఆదివారం నాడు కామారెడ్డి జిల్లాలో ఏడాదిన్నర, ఐదేళ్ల వయస్సు న ఇద్దరు చిన్నారుల పై ఒక శునకం ఒక్కసారిగా దాడిచేసి ముఖం, తలపై తీవ్రంగా కరిచింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. జిల్లాలోని దోమకొండ మండ లం చింతమాన్‌పల్లిలో ఉదయం 11.30 గంటల సమయంలో ఐదేళ్ల వయస్సు న హర్షిణితో పాటు ఆ పాప చెల్లెలు ఏడాదిన్నర వయస్సు న జాహ్నా వి తమ ఇంటి వద్ద వీధిలో ఒంటరిగా ఆడుకుంటున్న సమయంలో ఒక కుక్క రెప్పపాటులో దాడిచేసి ఇద్దరిని తీవ్రంగా కరిచింది. చిన్నారుల అరు పులు విన్న తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగువారు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను తరిమివేసి గాయపడ్డ ఇద్దరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి ముఖం, కంటి భాగంలో తీవ్రంగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం మొదట కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి ఆ తరువాత హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. చిన్నారుల ఆరోగ్యం కొంత ఆందోళనకరంగా వుందని వైద్యులు చెబుతున్నారు.

## అబద్ధాలు, మోసాల పునాదులపై రేవంత్ రాజకీయాలు

### ప్రభుత్వం కట్టిన అప్పు రూ.లక్షా 67వేల కోట్లు మాత్రమే: బిఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 22:** సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అబద్దాలు, మోసాల పునాదుల మీద రేవంత్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ సర్కార్ మళ్లీ మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ రూ.8లక్షల కోట్ల అప్పు చేశారని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. సీఎం కాకముందు నుంచే దుష్ప్రచారం చేస్తూ తన నైజాన్ని రేవంత్ రెడ్డి బయట పెట్టారని అన్నారు. రూ.3.47 లక్షల కోట్ల అప్పు తెచ్చానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని ప్రస్తావించారు. రూ.3.30 లక్షల కోట్లు అప్పు కట్టానని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పారని అన్నారు. ప్రభుత్వం కట్టిన అప్పు లక్షా 67 వేల కోట్ల అప్పు మాత్రమే నని స్పష్టం చేశారు.

కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి అబద్ధాలు ఆడుతున్నారని దాసోజు శ్రవణ్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అబద్ధం అని నేను మండలిలో మాట్లాడితే అభ్యంతరం తెలిపారని అన్నారు. అసెంబ్లీలో సీఎం అబద్దాలు మాట్లాడితే ఏం చేయాలో ప్రజలే నిర్ణయించాలని అన్నారు. బడ్జెట్‌తో చీట్ చేసే సీఎం ఎక్కడైనా ఉంటారా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై కేటీఆర్ ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశ పెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లుకు సభ్యులు మద్దతు ఇవ్వాలని కోరారు. బడ్జెట్‌లో 202627లో విద్యా శాఖకు నిధుల కేటాయింపులు తగ్గాయని దాసోజు శ్రవణ్ తెలిపారు. కేవలం 8 శాతం మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు. దీనిపై విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో పాటు సభ్యులు స్పందించాలని కోరారు. విద్యా శాఖను సీఎం భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు.

## సూర్యఘర్ యోజనకు రూ.172.95 కోట్ల సబ్సిడీ చెల్లించిన కేంద్రం

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** పీఎం సూర్యఘర్ నిమిత్తం తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 24,031 కుటుంబాలు 95.26 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. ఇందుకు కేంద్రం సంబంధిత కుటుంబాలకు మొత్తం 172.95 కోట్ల రూపాయల చొప్పున సబ్సిడీని చెల్లించింది. ఇక దేశంలోని ప్రధాన నగరాలకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన సబ్సిడీలో హైదరాబాద్ నాల్గవ స్థానంలో నిలిచింది. సూర్యఘర్ పథకం కింద ఒక్కో ఇంటికి గరిష్టంగా 78 వేల రూపాయల మేర కేంద్రం రాయితీని ఇస్తోంది. సూర్యఘర్ కింద హైదరాబాద్‌లోని 2,071 భవనాలపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను 4,135 కుటుంబాలకు గాను 32 కోట్ల రూపాయలకు పైగా రాయితీ లభించింది.

## ఆర్థిక కష్టాల్లో విద్యుత్ పంపిణీ సంఘం

### రావాల్సిన బకాయిలు రూ.871 కోట్లు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే సహకార రంగంలో ఏర్పాటు అయిన ఒకే ఒక విద్యుత్ పంపిణీ సంస్థ సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈ సెస్ సంస్థకు ప్రధానంగా బకాయిలు గుదిబండగా మారాయి. ప్రభుత్వం నుంచి రావాల్సి న బకాయిలు పేరుకుపోవడంతో సంఘం దిక్కుతోచని స్థితిలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, ఇతర విభాగాల నుంచి సిరిసిల్ల సెస్‌కు రావాల్సి న బకాయిలు రూ.871.05 కోట్లుగా ఉన్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఆయా శాఖలకు నిధులు రాక, విద్యుత్ బిల్లుల చెల్లింపులు భారంగా తయారయ్యాయి. 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 3 లక్షల 46వేల 167 మంది సభ్యులు ఉన్నారు. దీనికి గృహ కనెక్షన్లు 1,71,510, వాణిజ్య కనెక్షన్లు 21,486 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 1,528, పవర్‌లూం కనెక్షన్లు 5,635, వ్యవసాయ కనెక్షన్లు 78,611, గ్రామపంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3,118, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షన్లు ఉన్నాయి. అయితే వీటిలో కొన్ని బిల్లులు చెల్లించకపోవడంతో అవి మొండి బకాయిలుగా తయారయ్యాయి. ఈ విధంగా ప్రస్తుతం సెస్‌కు రూ.871.05 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల నుంచి దాదాపు రూ.700 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయిఇ. ఇందులో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.57.46 కోట్లు, దీనికి సర్‌ఛార్జ్‌గా రూ.1.33 కోట్లతో కలిపి రూ.58.79 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన నీటిసరఫరా, వీధి దీపాల నిమిత్తం రూ.319.52 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి రూ.220.11 కోట్లు, పల్లె, పట్టణ ప్రగతి బిల్లులు రూ.20.27 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇక జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.199.15 కోట్ల బకాయిలు రావల్సి ఉన్నట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

## వేగంగా ఎస్ఎల్‌బిసి సొరంగ పనులు

### మన్నెవారిపల్లె వద్ద ప్రారంభం

### ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగం హర్షం

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా రైతాంగం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఎస్ఎల్‌బిసి సొరంగం పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత సంవత్సరం ఫిబ్రవరిలో ఎస్ఎల్‌బిసి (శ్రీశైలం ఎడమ గట్టు కాలువ) టన్నెల్ (సొరంగం)లో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి టన్నెల్ పనులు ఎక్కడి కక్కడ నిలిచిపోయాయి. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల్లో కొంతమంది మృతదేహాల ఆచూకి ఇప్పటికీ లభ్యం కాలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ప్రస్తుతం టన్నెల్ నిర్మాణ పనులు పున: ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మన్నె వారిపల్లి వద్ద ఎస్ఎల్‌బిసి టన్నెల్ పునః ప్రారంభించారు.

సొరంగం రెండువైపులా తవ్వకాలు ప్రారంభం కావడంతో ఇకపై నిరంతరాయంగా పనులు కొనసాగనున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగా ఎస్ఎల్‌బిసి టన్నెల్ నిలవనుంది. గతేడాది ఫిబ్రవరి 22న టన్నెల్‌లో జరిగిన ప్రమాదం కారణంగా నిలిచిపోయిన పనులు, సుమారు ఏడాది కాలం తర్వాత తిరిగి ప్రారంభమయ్యాయి.

తవ్వకాల సమయంలో సొరంగ మార్గం చివరికంటూ గాలి వెలుతురు ప్రసారమయ్యేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రాజెక్టు పనులు గతంలో నిలిచిపోవడంతో నల్గొండ జిల్లాలో సాగునీటి సరఫరా పై తీవ్ర ప్రభావం పడింది. అయితే ఇప్పుడు పనులు మొదలవ్వడంతో రైతాంగంలో కొత్త ఆశలు చిగురించాయి.

సొరంగం పనులను వేగవంతం చేసేందుకు అధికారులు ప్రస్తుతం డిబిఎం (డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్) పద్ధతిని అనుసరిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో ఈ డ్రిల్లింగ్ పనులను పూర్తి చేసి, నిర్ణీత కాల వ్యవధిలో ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని మళ్లించే ఈ సొరంగం పూర్తయితే నల్లగొండ జిల్లాలోని లక్షలాది ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షి స్తూ, ఎలాంటి అంత రాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## నేటి మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎస్‌డబ్ల్యుయు విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ)లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యుయు) ప్రభుత్వాన్ని కోరింది. నేడు (సోమవారం) జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్‌టీసీ కార్మి కులు, సిబ్బంది సమస్యలపై చర్చించి పరిష్కరించేలా చూడాలని ఎస్‌డబ్ల్యుయు నాయకులు రాజిరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. నేడు జరుగుతున్న క్యాబినెట్ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమ స్యలు పరిష్కరించాలని లేఖలో కోరారు. గత బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీలో భారత రాజ్యాంగం కల్పించిన కార్మిక సంఘాలను 2 సంవత్సరాల పాటు అనుమతించ కూడదని 2019 నవంబర్ 1న మౌ ఖిక ఆదేశాలు ఇచ్చారని... గత 6 సంవత్సరాల నుండి ఆర్టీసీలో యూనియన్లకు అనుమతించక పోవడం వలన కార్మికుల పైన విపరీతమైన పనిభారాలు, వేధింపులు పెరిగాయని లేఖలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గత ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించడం ఆ తర్వాత గవర్నర్ ఆమోదించడం జరిగిందని, గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు కాని అమలుకు అపాయింటెడ్ డే ప్రకటించలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ .. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆర్టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని, ఆర్టీసీ కార్మికులను ఆర్టీసీలో కలిపే విలీన ప్రక్రియ పూర్తి చేస్తామని, కార్మికులకు ఇవ్వవలసిన పెండింగ్ డబ్బులు చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికి తమరి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ఒక్క రుపాయి ఖర్చు లేని యూనియన్లను ఆర్టీసీలో పునరుద్ధరణ చేయక పోవడం వలన, విలీనం పక్రియ పూర్తి చేయక పోవడం వలన, పెండింగ్ బకాయిలను చెల్లించక పోవడం వలన ఆర్టీసీ కార్మికులు తీవ్ర అభద్రతా భావంతో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాలను చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

## యాసంగి సీజన్ రైతు భరోసా నిధులు విడుదల

### నేడు అన్నదాతల ఖాతాల్లో జమ

### తొలి విడతలో 70 లక్షల మంది రైతులకు ఎకరం వరకు జమ

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాసంగి రైతు భరోసా నిధులు విడుదల య్యాయి. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరి ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేశారు. అయితే ఆదివారం సెలవు కావడంతో సోమవారం రైతన్నల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి.

సోమవారం బ్యాంకులు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. మొత్తం మూడు విడతల్లో యాసంగి రైతు భరోసా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. తొలి విడతగా 70లక్షల మంది రైతులకు ఎకరం వరకు రూ.3590 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.

ఆ తర్వాత 20 రోజులగకు రూ.2650కోట్లను జమ చేస్తారు.

ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు వారి ఖాతాల్లోకి పంట పెట్టుబడి సాయాన్ని బదిలీ చేయనున్నారు. మొత్తంగా కోటిన్నర ఎకరాలకు రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.

కాగా పంట పెట్టుబడి సాయం కింద తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏటా రెండు విడతల్లో (ఖరీఫ్, రబి)ఎకరాకు రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.12వేలు ఆర్థికసాయం అందిజేస్తోన్న విషయం తెలిసిందే.

## రికార్డు స్థాయికి చేరుకున్న చికెన్ ధరలు

### కిలో ధర రూ.400!

## నాన్‌వెజ్ ప్రియులకు భారీ షాక్..

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** పశ్చిమ ఆసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం నేపథ్యానికి తోడు వరుస పండుగలు, పెళ్లిళ్ల సీజన్, రంజాన్ మాసం కావడంతో చికెన్ ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదనుగా భావించిన కొంతమంది చికెన్ సెంటర్ల నిర్వాహకులు పేపర్ రేటుకు మించి చికెన్ విక్రయిస్తున్నారు. గత వారం కిలో చికెన్ రూ.300గా ఉండగా ఇప్పుడు 400కు చేరింది. ఒక్కసారిగా రూ.100 పెరగడంతో మాంసాహారులు ఇబ్బంది పడుతున్నారు. చికెన్ ధర ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా కేజీ చికెన్ ధర రూ.170 నుంచి రూ.220 మధ్య ఉంటుంది. శ్రావణ మాసం, కార్తీక మాసంలో అయితే ఇంకా తక్కువగా ఉంటుంది. కానీ 2 నెలల నుంచి చికెన్ ధరలు వేగంగా పెరుగుతూ వస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య నుంచి ధర భారీగా పెరుగుతోంది. ఎండల తీవ్రత కారణంగా కోళ్లు చనిపోవడం, మొన్నటి వరకు రంజాన్ డిమాండ్ కారణంగా చికెన్ ధరలకు రెకలొచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో కిలో చికెన్ ధర రూ.400కు చేరడంతో సామాన్య కొనుగోలుదారులు బెంబేళెత్తిపోతున్నారు. ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగి సామాన్య ప్రజలపై పెను భారం పడింది. ఈ సమయంలో చికెన్ ధరలు కూడా పెరగడంతో పరిస్థితి మరింత కష్టంగా మారింది. రోజువారీ ఖర్చులు పెరుగుతుండటంతో మాంసాహారం కొనడం కూడా చాలా మందికి భారంగా మారుతోంది. ధరలు పెరగడంతో చికెన్ మార్కెట్‌లో కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. దాంతో వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కస్టమర్లు రాకపోవడంతో చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. విక్రయాలు తగ్గిపోవడంతో వ్యాపారులకు తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయి. వేసవి ఎండల తీవ్రత కారణంగా పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లు మరణిస్తున్నాయని, సపె తగ్గిపోయేందుకు ఇదే ప్రధాన కారణమేనని వ్యాపారులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు కోళ్ల పెంపకంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. గతంలో పెద్ద ఎత్తున కోళ్ల పెంపకం జరిగినా వేసవిలో గణనీయంగా తగ్గిస్తున్నారు. చికెన్ బాటలోనే మటన్ ధరలు కూడా ఏమాత్రం తగ్గడం లేదు. నెల క్రితం వరకు కిల మటన్ రూ.800 ఉండగా.. ప్రస్తుతం రూ.1000 వరకు చేరుకుంది. పెరిగిన ధరలతో మాంసాహార ప్రియులు చేపలు, రొయ్యలు వంటి ప్రత్యా మ్నా యాల వైపు మళ్లుతున్నారు. వేసవి తీవ్రత తగ్గే వరకు చికెన్ ధరల పెరుగుదల కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## టిడిఆర్ నిబంధనల సడలింపుపై క్రెడాయి హర్షం

### సిఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయి-హైదరాబాద్ అధ్యక్షుడు జైదీప్‌రెడ్డి కృతజ్ఞతలు



**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత బలోపేతం చేయడడమే లక్ష్యంగా గతంలో టిడిఆర్ వినియోగంపై ఉన్న నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జివోను క్రెడాయి (ది కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) స్వాగతించింది. టిడిఆర్ నిబంధనలకు చేసిన సవరణలను హర్షి స్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రెడాయి - హైదరా బాద్ అధ్యక్షుడు ఎన్. జైదీప్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విష యమై ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాజా సవరణలు తెలంగాణ బిల్డింగ్ రూల్స్ - 2012 లో కీలక మార్పులు తీసుకువచ్చి, ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ వ్యవస్థను సులభతరం చేసి, రియల్ ఎస్టేట్‌రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. తాజా సవరణలు పట్టణాభివృద్ధి, నియంత్రణల మధ్య సమతుల్యతను తీసుకురావడమే కాకుండా, ఎత్తైన భారీ భవనాల నిర్మాణానికి అవకాశం కల్పిస్తాయన్నారు. టిడిఆర్ నిబంధనలకు సవరణలు చేస్తూ తీసుకొచ్చిన ఉత్తర్వుల్లో 21 మీటర్లకు పైబడిన భవనాలను హై రైజ్‌గా నిర్వచించారు. లిఫ్ట్ మెషిన్ రూమ్, వాటర్ ట్యాంక్ వంటి భాగాలను లెక్కలోకి తీసుకోరు.750 నుంచి 2000 చదరపు మీటర్ల మధ్య ఉన్న ప్లాట్లలో 18-21 మీటర్ల ఎత్తు భవనాలకు టిడిఆర్ యుటిలైజేషన్ ద్వారా అనుమతిస్తారని పేర్కొన్నారు. అనుమతుల సమయంలో 50శాతం టిడిఆర్‌చెల్లించి, మిగిలిన 50శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ముందు చెల్లించే అవకాశం కల్పించారని చెప్పారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణను గ్లోబల్ రియల్ ఎస్టేట్ హబ్‌గా నిలపడంలో కీలకంకానున్నాయని తెలిపారు.

## సంక్షేమానికి ఫేస్ రికగ్నిషన్

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో బోగస్‌కు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెడుతోంది. పెన్షనర్లు, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నైజేషన్) ను తప్పనిసరి చేస్తోంది. ప్రధానంగా సంక్షేమ పథకాల అమల్లో బినామీలు, అనర్హులైన గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు విధిగా అమలు చేయడం కోసమే ఈ ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని తీసుకురానున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో అనేక మంది అనర్హులైన లబ్దిదారులు ఇతర సంక్షేమ పథకాల కింద పెన్షన్లు మరియు ఇతర ప్రయోజనాలను పొందుతున్నారని ఫిర్యాదులు రావడం జరిగింది. ముఖ గుర్తింపు వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా నిజమైన లబ్ధిదారులను మాత్రమే గుర్తించనున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తదనుగుణంగా పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను మరింత మంది లబ్దిదారులకు విస్తరించే వీలుంటుందని పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాల లబ్దిదారులు, పెన్షనర్ల మాదిరిగానే, ప్రభుత్వం ఉద్యోగులకు, ముఖ్యంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ముఖ గుర్తింపును కూడా అమలు చేయనుంది. జీతం సస్పెన్షన్‌ను నివారించడానికి రెగ్యులర్ సిబ్బందితో సహా అన్ని ఉద్యోగులు సంబంధిత విభాగాలలో వారి ఆధార్ వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఆధార్ లింక్ చేసే సందర్భంలో లక్షల మంది నకిలీ ఉద్యోగులు ఉన్నట్లు వెలుగు చూసింది. ఇందుకు కొన్ని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు తమ సిబ్బంది వివరాలను నమోదు చేసుకుని చాలా మందికి జీతాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఫోరెన్సిక్ ఆడిట్‌తో, అన్ని జీతాల ఖాతాలను తనిఖీ చేసి, అటువంటి అవకతవకలు బయటపడతాయనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలియవచ్చింది.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కొనసాగుతున్న విచారణ

### వరుసగా మూడోరోజూ కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డి, శ్రవణ్‌ను ప్రశ్నించిన పోలీసులు

### బడా డ్రగ్స్‌స్మగ్లర్ అభిషేక్‌సింగ్ రహస్య ప్రాంతంలో విచారణ

### డాక్టర్ ప్రియాంక సెల్‌ఫోన్ డాటా, బ్యాంక్ ఖాతాలపై ఆరా

### రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్‌శర్మల కస్టడీపై నేడు వెలువడనున్న తీర్పు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో నిందితుల విచారణ కొ నసాగుతోంది. పార్టీ జరిగిన సమయంలో 11 మంది వుండగా అందులో ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, తాండూరు మాజీ ఎంఎల్ఎ, బి ఆర్ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డి సహా ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం తెలిసిందే. వీరిలో పోలీసులపై కాల్పులు జరిపిన కేసులో రో హిత్ రెడ్డి అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మలను అరెస్టు చేసి జైలుకు తరలించడం విదితమే. ఈ ముగ్గురిని మిన హాయించి మిగతా అందరిరిని పోలీసులు వరుసగా విచారిస్తూ వారి నుంచి అనేక అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో శనివారం నాడు ప ట్టుబడ్డ బడా డ్రగ్స్ స్మగ్లర్ అభిషేక్ సింగ్‌తో పాటు డ్రగ్ పెడ్లర్‌గా వున్న కౌశిక్ రవి, అతని అనుచరుడు అర్జున్ రెడ్డి, రోహిత్ రెడ్డి పిఎ శ్రవణ్‌ను పోలీసులు వరుసగా మూడవ రోజు విచారించారు. ఇందులో అభిషేక్ సింగ్‌ను రహస్య ప్రాంతంలో విచారిస్తుండగా మిగతా ముగ్గురిని శంషాబాద్ ఎస్ఒటి కార్యాలయంలో ఆరు గంటలకు పైగా విచారించి రోహిత రెడ్డి డ్రగ్స్ దందాలపై విచారించారు. మరోవైపు ఈ కేసులో కీలక నిందితులుగా వున్న రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మల కస్టడీపై రాజేంద్రనగర్ కోర్టు తీర్పు వెలువరించనుంది.

నగర శివార్లలోని మొయినాబాద్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో వెలుగు చూసిన డ్రగ్స్ పార్టీపై అసలు విషయాలు వెలుగులోకి తెచ్చేందుకు పోలీసుల విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో డ్రగ్స్ సేవించి బెయిల్‌పై విడుదలైన వారు పార్టీలో పాల్గొని స్టేషన్ బెయిల్ పొందిన వారి వి చారణ వారం రోజులుగా కొనసాగుతోంది. పార్లమెంట్ సమావేశాల్లో వున్న ఎంపి పుట్టా మహేష్ యాదవ్ తన న్యాయవాది ద్వారా వివరణ ఇవ్వగా మిగతా వారు స్వయంగా హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ఇందులో కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి, శ్రవణ్‌లను పోలీసులు మొదట రెండు రోజులు విచారిం చి ఆ తరువాత వరుసగా మూడవరోజూ విచారించారు. రోహిత్ రెడ్డి ఫాం హౌస్ గురించి ఇక్కడ జరిగే పార్టీల గురించి వీరికి ఎక్కువ సమాచారం తెలుసనే కోణంలో పోలీసులు వీరిని గంటల పాటు విచారించి అనేక అంశాలపై సమాచారం సేకరించారు. ఈ కేసులో బడా డ్రగ్స్ స్మగ్లర్‌గా భావిస్తున్న అభిషేక్ సింగ్‌ను ఒవైపు విచారిస్తూనే అతడిచ్చిన సమాచారం ఆధారంగా కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డి, శ్రవణ్‌లను ఆదివారం నాడు పోలీసులు ఆరు గంటల పాటు ప్రశ్నించారు. వీరిని సోమవారం కూడా విచారించనున్నారు. అభిషేక్ సింగ్‌ను సోమవారం అరెస్టు చూపించనున్నారని తెలిసింది.

వీరితో పాటు పార్టీలో పాల్గొన్న డాక్టర్ ప్రియాంక బ్యాగులో లక్ష రూపాయలు పట్టుబడగా ఈ నగదు ఎక్కడిదనే విషయమై పోలీసులు ఆరా తీస్తు న్నారు. దీంతో పాటు ఆమె సెల్‌ఫోన్ డేటా. బ్యాంకు ఖాతాల లావాదేవీలపైనా ఆరా తీస్తున్నారు. కాగా ఈ కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో వున్న రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మల కస్టడీపై సోమవారం నాడు రాజేంద్రనగర్ కోర్టు తీర్పు వెలువరించనుంది. వీరిని వారం రోజుల పా టు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరడం తెలిసిందే. దీనిపై కోర్టు తీర్పు తరువాత పోలీసులు వెంటనే జైలుకు వెళ్లి ముగ్గురిని కస్టడీలోకి తీసుకుని నేరుగా శంషాబాద్ ఎస్ఒటి కార్యాలయానికి తరలించే వీలుంది.

**ఏలూరు ఎంపికి మరోసారి రక్త పరీక్షలు చేయనున్న పోలీసులు**

ఇదిలా ఉండగా మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తనను బలిపశువు చేశారని ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌యాదవ్ రాసిన లేఖ సంచలనం రేపడం తెలిసిందే. తెలంగాణ రాజకీయాలకు తనను బలి చేశారని, పార్టీ జరిగిన రోజున నెగెటివ్ రిపోర్టు వచ్చిందని, మరుసటి రోజున ఉన్నట్లుండి పాజిటివ్ రిపోర్టు ఎలా వచ్చిందని ఎంపి తన లేఖలో అటు ఎపి టిడిపి నాయకత్వానికి ఇటు తెలంగాణ పోలీసులకు లేఖ రాయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపి మహేష్‌యాదవ్ అనుమానాలను నివృత్తి చేసేందుకు నిపుణుల సమక్షంలో మరోసారి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని పోలీసులు నిర్ణయించారు. ఇదే విషయాన్ని సిట్ అధికారులు మహేష్‌యాదవ్‌కు చెప్పినట్లు తెలిసింది. ఆయన హైదరాబాద్‌కురాగానే ఈ పరీక్షలు జరిపేందుకు సిట్ పోలీసులు సిద్ధమవుతున్నారు.




ఆదివారం హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్కులో న్యూఏజ్ పల్మోనాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవ నడక' దృశ్యం

## తిరుమలగిరిలో విషాదం

### క్వారీ గుంతలోపడి బాలుడు మృతి

**హైదరాబాద్ (అడ్డగుట్ట), మార్చి 22, ప్రభాతవార్త :** తిరుమలగిరి పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. క్వారి గుంతలో పడి ఓ మైనర్ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ముగ్గురు మిత్రులు తమ స్నేహితురాలితో కలిసి సరదాగా బయటకు వెళ్లారు. మొదట ఓ రెస్టారెంట్‌లో స్నాక్స్ తీసుకున్న అనంతరం, కోహిమం దర్గాకు వెళ్లారు. అక్కడ కాలుకడుక్కుంటున్న సమయంలో రిత్విక్ రెడ్డి అనే మైనర్ బాలుడు అకస్మాత్తుగా కాలు జారి గుట్టపై నుంచి జారిపడి సమీపంలోని క్వారి గుంతలో పడిపోయాడు. అతడిని వెంటనే కాపాడేందుకు స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. స్థానికులు అక్కడికి చేరుకునే సరికి రిత్విక్ రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న తిరుమలగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.



బంజారాహిల్స్‌లోని స్థలం వద్ద తన మనుషులతో సిఎం రమేష్

## బంజారాహిల్స్‌లో బిజెపి ఎంపి సిఎం రమేష్ హల్‌చల్


### కోర్టు ఉత్తర్వులను లెక్కచేయడం లేదంటూ ఆరోపణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 22, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో ఒక ఖరీదైన స్థలం వద్ద బీజేపీ ఎంపీ సీఎం రమేష్ హల్‌చల్ చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని అన్నపూర్ణ స్టూడియో ముందు ఆనంద్ ప్రభాత్ సొసైటీకి చెందిన సర్వే నంబరు 129/11లో దాదాపు రెండు ఎకరాలకు పైగా స్థలం ఉంది. ఈ స్థలంలో శివనారాయణ అనే వ్యక్తికి చెందిన 2055 గజాల్లో రెండు ఫ్లాట్లు ఉన్నాయి. ఆయన దాదాపు పదిహేనేళ్ల క్రితం ఈ ప్లాట్లను కొనుగోలు చేయడమే కాకుండా ఆయన పేరుతో ఉన్న విద్యుత్ బిల్లులు సైతం చెల్లిస్తున్నారు. స్థల వ్యవహారంలో 2006 నుంచి సీఎం రమేష్‌తోపాటు అతని అనుచరులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివనారాయణ ఆరోపించారు. దీంతో తాము కోర్టును ఆశ్రయించగా కోర్టు ఇంజిక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం తమ స్థలంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సీఎం రమేష్‌తోపాటు అతని అనుచరులు, మాజీ ఎంపీ లగడపాటి అనుచ రులు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మనుషులు, బీజేపీ నేత లంకల దీపక్‌రెడ్డి మనుషులు అక్కడికి వచ్చి తమను అడ్డుకున్నారన్నారు.

## దేశవ్యాప్తంగా మొదలైన విషువత్తు కాలం

### పెరుగుతున్న పగటివేళలు

### మరింత పెరిగిన సూర్యుడి కాలగమనం



తిరువనంతపురంలోని అనంత పద్మనాభ దేవాలయంలో విషవత్తు కాలం కారణంగా ఆలయ గోపురం కిటికీ గుండా సూర్యాస్తమయ సమయంలో రెండు రోజులుగా అద్భుతంగా కనిపిస్తున్న సూర్యకిరణాలు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా వేసవి సీజన్ మొదలవడంతో వేదాలు, పురాణాల ప్రకారం విషువత్తూ కాలం మొదలయ్యింది . విషువత్తు కాలం అనుసారం పగలు రాత్రి వేళలు కాస్త అటుఇటుగా సమంగా వుండడం. పోను పోనూ పగటి వేళలు మరింత పెరగడం. ఇదే స మయంలో రాత్రి వేళలు మరింత తగ్గనున్నాయి. దీని అనుసారం సూర్యోదయం ఇదివరకంటే ముందుగానే మొదలుకానుండగా సూర్యాస్తమయం ఆ లస్యంగా అవనుంది. చలికాలంలో సూర్యోదయం ఆలస్యంగా కావడం, సూర్యాస్తమయం ముందుగానే ముగియం తెలిసిందే. అయితే విషువత్తు కా లం అనుసారం దీనికి భిన్నంగా వుండనుంది. పక్షం రోజులుగా సూర్యోదయం ఉదయం ఆరు గంటల 19 నుంచి 23 నిమిషాలకే అవుతుండగా సూర్యాస్తమయం సాయంత్రం ఆరు గంటల 25 నిమిషాల నుంచి ఆరు గంటల 27 నిమిషాల మధ్య ముగుస్తోంది. ఆదివారం నాడు హైదరాబాద్ లో సూర్యోదయం ఆరు గంటల 19 నిమిషాలకు వుండగా సూర్యాస్తమయ సమయం సాయంత్రం ఆరు గంటల 27 నిమిషాలు. రాబోయే రెండు నెలల కాలంలో సూర్యోదయం ఉదయం ఐదు గంటల 45 నిమిషాలకే వుండనుండగా సూర్యాస్తమ సమయం సాయంత్రం ఆరు గంటల 35 నిమి షాల వరకు వుండనుంది,
పంజాబ్ వంటి రాష్ట్రాల్లో సూర్యాస్తమయం రాత్రి ఏడున్నర గంటల వరకు వుండనుంది. ఇక విషువత్తు కాలంలో సూర్యో దయానికి సుమారు 45 నిమిషాల నుంచి గంట ముందే వెలుతురు కానవస్తుంది. సూర్యాస్తమయ సమయంలో సూర్యుడు అస్తమించిన తరువాత అరగంట నుంచి 45 నిమిషాల వరకు వెలుతురు వుంటుంది. ఇదే చలి కాలంలో సూర్యోదయం సమయంలో పావు గంట నుంచి 20 నిమిషాల ముందుగా మాత్రమే వెలుతురు కనిపించేది. సూర్యాస్తమయ సమయంలో పావు గంటకే చీకట్లు కమ్మేస్తాయి. కాగా విషువత్తు కాలంలో అనేక దేవాలయాల్లో వున్న గోపురాలలో సూర్యాస్తమయ సమయంలో సూర్యుడి కాంతి ఆలయ గోపురాలలోని కిటికీల గుండా పయనించి ఆధ్యాత్మికంగా అధ్భు తంగా కనిపించడం గమనార్హం. తిరువ నంతపురంలో గల ప్రముఖ వైష్ణవ క్షేత్రం అనంత పద్మనాభ స్వామి దేవా లయంలో రెండు రోజులుగా ఇటువంటి దృశ్యమే గోచరించడం విశేషం.

# మూసీ నది కేవలం జలవనరు కాదు.. తెలంగాణ ప్రజల జీవనాడి

### ప్రణాళికలు ఒకలా.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు మరోలా

### ప్రాజెక్టులో పారదర్శకత ఎక్కడ? ఖర్చులపై స్పష్టత లేమి

### మూసీ పరీవాహక ప్రాంత ప్రజల అభిప్రాయాలను పట్టించుకోని పాలకులు

### పునరుజ్జీవనం పేరుతో పేదల ఇళ్లు కూల్చడం దారుణం

### పవర్ పాయింట్ ప్రెజంటేషన్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు




**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** మూసీ నది కేవలం జలవనరు కాదు.. తెలంగాణ ప్రజల జీవనాడి అని, ఈ ప్రాజెక్టు విషయంలో ప్రణాళికలు ఒకలా.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు మరోలా ఉన్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఆదివారం మూసినది పునరుజ్జీవనం-వాస్తవాలు అంశంపై బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావుతో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, కేంద్ర జలవనరుల శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. నదుల అనుసంధానం గురించి అటల్ బిహారీ వాజపేయి ముందుగానే ఆలోచించారని, ఆ స్ఫూర్తితో గుజరాత్‌లో నర్మదా-సబర్మతి అనుసంధానం చేసి, సబర్మతి నదిని పునరుద్ధరించారని నర్మదా నది పునరుజ్జీవనం జరిగినప్పుడు వారికి సరైన పునరావాసం కల్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి నమామి గంగే ప్రాజెక్ట్ ద్వారా వేల కిలోమీటర్ల గంగానదిని శుద్ధి చేయడానికి సుమారు రూ.20,000 కోట్ల వ్యయం చేశారు. కానీ ఇక్కడ మూసి ప్రాజెక్ట్ పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెబుతున్నారు. రాష్ట్రానికి పెన్షన్లు ఇవ్వడానికి, రైతు భరోసా అమలు చేయడానికి డబ్బులు లేవు అంటున్న ప్రభుత్వం ఇంత భారీ మొత్తాన్ని ఎక్కడి నుంచి తెస్తుంది? అని ప్రశ్నించారు. ఈ అప్పుల భారం చివరికి తెలంగాణ ప్రజలపైనే పడుతుంది. మొదట రూ.5,000 కోట్లుగా చెప్పిన ప్రాజెక్ట్, కొన్ని రోజుల్లోనే రూ.7,000 కోట్లకు పెరిగిందన్నారు. ఖర్చులపై స్పష్టత లేదన్నారు. ఎక్కడైనా కూల్చి వేతలు జరిగితే ముందుగా పునరావాసం చేపట్టాలన్నారు. కానీ ఇక్కడ ముందు కూల్చి, తర్వాత ఇస్తాం అనే విధానం కనిపిస్తుందన్నారు. ఇది పూర్తిగా అన్యాయం అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం మూసి ప్రక్షాళన పేరుతో 10 వేల ఇండ్లు కూల్చుతామని అంటుందని, మరోవైపు కాంగ్రెస్ మంత్రి అసెంబ్లీలో 1,400 ఇండ్లు మాత్రమే అంటున్నారు. అసలు నిజం ఏది? ప్రజలు ఎవరిని నమ్మాలి?మూసి పరివాహక ప్రాంతంలో 5 కిలోమీటర్ల వరకు బఫర్ జోన్ పేరుతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. మూసి పరివాహక ప్రాంతంలో ఒకచోట పెద్ద బిల్డర్లకు బఫర్ జోన్ నియమాలు వర్తించకపోతే, మరోచోట మధ్యతరగతి, ఎక్స్ సర్వీస్ మెన్ల ఇళ్లను కూల్చడం ఎందుకు? ఈ విధానం వివక్షపూరితంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా ఇంప్రాక్టికల్‌గా కనిపిస్తోంది. వేల ఎకరాలను స్వాధీనం చేసుకోవడం ద్వారా రైతుల జీవనోపాధి నష్టపోతుందని, హైదరాబాద్ నగరానికి వచ్చే కూరగాయలలో పెద్ద భాగం మూసి పరివాహక ప్రాంతం నుంచే వస్తుందని, మూసీ ప్రక్షాళనకు బిజెపి ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు.

# రాష్ట్రంలో 102 డయాలసిస్ కేంద్రాల నిర్వహణ

### రూ.347.65 కోట్లతో ఉచిత డయాలసిస్

### 4,70,634 మంది ఉద్యోగ, పెన్షనర్స్, జర్నలిస్టులకు ఇహెచ్‌ఎస్ అమలు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 102 డయాలసిస్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అన్ని కేంద్రాల్లోనూ ఉచితంగా డయాలసిస్‌ను అందిస్తున్నారు. తెలంగాణ డయాలసిస్ కార్యక్రమాలు పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) నమూనా పద్ధతిలో 102 డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రచురించిన సోషియో ఎకనమిక్ సర్వేలో ప్రకటించింది. ఈ హబ్ ఆసుపత్రులు నిమ్స్ ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో కొనసాగుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బిపిఎల్) కుటుంబాల లబ్ధిదారులకు ఉచితంగా డయాలసిస్ సేవలను అందిస్తున్నారు.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉచిత డయాలసిస్ చికిత్సకు రూ.347.65 కోట్లు ఖర్చు చేశారు. 2023-24 సంవత్సరంలో రూ.160.64 కోట్లతో 13,006 మంది లబ్ధిదారులకు, 2024-25లో రూ.187.01 కోట్లతో 14,156 మంది లబ్ధిదారులకు ఉచిత చికిత్స అందించారు. రాష్ట్రవ్యాప్తంగా డయాలసిస్ సేవలను మరింత బలోపేతం చేయడానికి, 18 ఆసుపత్రులలో 90 కొత్త డయాలసిస్ యంత్రాలను అందించేందుకు కొత్త డయాలసిస్ యూనిట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాటితోపాటు ఇప్పటికే ఉన్న 12 ఆసుపత్రులకు అదనంగా 46 డయాలసిస్ యంత్రాలు సరఫరా చేయాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది.

**4,70,634 మంది ఉద్యోగులు, పాత్రికేయులకు ఆరోగ్య పథకం**

రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లు, పాత్రికేయులకి నగదు రహిత చికిత్సను అందించడానికి ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ చికిత్సలో 1,885 విధానాలను కవర్ చేస్తున్నట్టు ప్రభుత్వం సోషియో ఎకనమిక్ సర్వేలో ప్రకటించింది.
ఈ పథకంలో ఉద్యోగ, పెన్షనర్లు, జర్నలిస్టులు కలిపి 4,70,634 మంది ప్రాథమిక లబ్ధిదారులుగా ప్రకటించింది. 8,00,778 మంది వారిపై ఆధారపడిన వారిని ఈ పథకంలో కవర్ చేస్తుంది, దీంతో మొత్తం 12,71,412 మంది ఈ పథకంలో కవరేజ్ పొందనున్నారు. ఇందులో 2,27,825 మంది ఉద్యోగులు ఉండగా.. వారిపై ఆధారపడిన 5,72,460 మంది (మొత్తం 8,00,285 మంది) ఉన్నారు. 2,24,238 మంది పెన్షనర్లు ఉంటే వారిపై ఆధారపడిన 1,73,372 మంది (మొత్తం 3,97,610 మంది) ఉన్నారు. వీరు కాకుండా 18,571 మంది జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన 54,946 మంది ఉన్నారని.. మొత్తంగా 73,517 మంది జర్నలిస్టులు లబ్ధిదారులుగా ఉన్నారని పేర్కొంది.
2024-25 సంవత్సరంలో లబ్ధిదారులకు మద్దతు ఇవ్వాలని క్లెయిమ్ చెల్లింపుల కింద రూ.136 కోట్లు, 2025-26 సంవత్సరంలో మార్చి 3 వరకు రూ.194.99 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేయడం జరిగిందని సర్వే బుక్‌లో ప్రకటించారు.

# వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఆధికారికంగా నిర్వహించేందుకు కృషి

### సిఎం రేవంత్‌రెడ్డి హామీ



'శ్రీవాసవీ మాత మహాశక్తి మహోత్సవం'లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి. చిత్రంలో కల్వ సుజాత

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 22, ప్రభాతవార్త:** నిత్యం కోట్లాది మంది ఆర్యవైశ్యులు పూజించే శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి, ఆత్మార్పాణం చేసుకున్న రోజును ప్రభుత్వం అధి కార పూర్వకంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శితో చర్చించి, అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా నిర్ణయం తీసు కుంటామని ఆయన తెలిపారు. ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సౌజన్యంతో రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయం త్రం బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగిన 'శ్రీవాసవీమాత మహాశక్తి మహోత్సవం'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్య వైశ్యులకు అండగా ఉంటామని, వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఆర్యవైశ్యులు ఊరికి ఒక్కరూ ఉన్న ఊరందరూ వారితో కలిసిమెలిసి ఉంటారని, గ్రామీణ ప్రాంతాల్లో వారి సహకారం తోనే రైతులు వ్యవసాయం చేసుకుంటారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వారు వెన్నెముకగా నిలుస్తారని సిఎం చెప్పారు. రాష్ట్ర నిర్మాణంలో వైశ్యుల పాత్ర ముఖ్యమని, రాజకీయంగా గుర్తింపు దక్కినా దక్క కున్నా ఎంతో క్రమశిక్షణతో తమ పాత్రను పోషి స్తారన్నారు. అహింస అనే గొప్ప దారిని ప్రపం చానికి జాతిపిత మహాత్మాగాంధీ అందించారన్నారు. వైశ్యజాతిలో, భారతదేశంలో బాపూజీ జన్మించడం గర్వకారణమన్నారు. గాంధీ ఒక్క వైశ్యులకే కాదు యావత్ ప్రపంచానికే ఆదర్శమని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అంటే తనకు ఎంతో అభిమానమని, తాము అధికారంలోకి రాగానే ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, లక్డీకాపూల్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశామని సిఎం గుర్తు చేశారు.
వాసవీ పారాయణం గిన్నీస్ ప్రపంచ రికార్డు సాధించినందుకు ఆయన అభినందనలు చెప్పారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్‌చైర్‌పర్సన్ కల్వ సుజాత మాట్లాడుతూ వాసవీ మాత జయంతి, ఆత్మారణ దినోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తొలుత సిఎంకు విజ్ఞప్తి చేశారు. వైశ్యుల సంక్షేమానికి తమ కార్పొరేషన్ కృషి చేస్తుందన్నారు. ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించి, స్వరకర్త శ్రీ జోశ్యభట్ల స్వరపరిచిన వాసవీ మాత పారాయణాన్ని గాయని కల్పన పాడగా వేలాది మంది ఆర్య వైశ్యులు సామూహికంగా పారాయణం చేశారు. ఇది ప్రపంచ రికార్డు సాధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి టి.జి. భరత్ మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్రం లో ఆర్యవైశ్యులకు ఒక మంత్రి పదవి దక్కలేదని విచారం వ్యక్తంచేశారు. రాష్ట్ర జనాభాలో 5 శాతం ఉన్న ఆర్యవైశ్యులకు తగిన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సూర్యనారాయణ, ఎంఎల్‌సి దయానంద్, స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, కర్ణాటక ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాంప్రసాద్, కోలేటి దామోదర్‌గుప్తా, చీకోటి ప్రవీణ్, రావికంటి శ్రీని వాస్‌తోపాటు అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

# యాసంగి పంటలకు సాగునీటి గండం

### పలు ప్రాజెక్టుల్లో అడుగంటుతున్న నీటిమట్టం

### ఉమ్మడి పాలమూరు జిల్లా మక్తల్ నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** సాగునీరు అందక పలు జిల్లాల రైతులు తల్లడిల్లిపోతున్నారు. పొట్ట దశకు చేరుకున్న వరి పంటకు ప్రాజెక్టుల కింద సాగునీరందకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో వాటి కిందసాగు చేసిన వరిపొలాలు ఎండిపోతుండడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వేసవి ప్రారంభంలోనే రిజర్వాయర్లలో నీటి నిల్వలు పడిపోతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటిమట్టం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యాసంగిలో వరి పంటలు ఎండిపోతున్నాయి. కళ్లముందే సాగు చేసిన వరి పంట ఎండిపోతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది. సాగునీటి విడుదల విషయంలో నీటిపారుదలశాఖ అధికారులకు ముందుచూపు కొరవడడంతోనే సూర్యాపేట, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో ప్రాజెక్టుల కింద యాసంగి వరి పొలాలు ఎండిపోయే ప్రమాదం నెలకొంది. ప్రధానంగా ఎస్‌ఆర్‌ఎస్‌పి ఆయకట్టు పరిధిలోని వరి పొలాలకు సాగు నీరందక అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. కొన్ని చోట్ల వరి పైరు ఎండిపోవడంతో పశువులకు మేతగా వేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో యాసంగి వరి పంటలకు సాగునీటి కటకట నెలకొంది. ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలువల పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీందకపోవడంతో వేలాదిఎకరాల్లో వరి ఎండిపోతోంది. కళ్లముందే వరి పైరు ఎండిపోతుండడంతో జిల్లాలోని అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తుంగతుర్తి, తిరుమలగిరి, అర్వపల్లి, నూతనల్‌కల్, మద్దిరాల, పెన్‌పహాడ్, ఆత్మకూరు ఎస్ తదితర 13 మండలాల్లఓని 2లక్షలా 49వేల ఎకరాలకు నీరందించేందుకు ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలువలను ప్రభుత్వం నిర్మించింది. అయితే ఆ కాలువలద్వారా సాగునీరందకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయి. సూర్యాపేట జిల్లాతోపాటు ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలం, పెనుబల్లి బండలం, తాళ్లపెంటలో పులిగుండాల ప్రాజెక్టు కింద సైతం వరి పంటలు ఎండిపోతున్నాయి.

# పన్నుల చుట్టూ కొత్త బడ్జెట్

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** వచ్చే కొత్త బడ్జెట్ 2026-27కు సంబంధించి పన్నుల ఆదాయంపైనే సర్కార్ ఆధారపడింది. మొత్తం బడ్జెట్‌లో పన్నుల ద్వారా ఆదాయం 56 శాతం మేర వస్తుందని అంచనా వేసింది. ఈ లెక్కన చూస్తే రాష్ట్ర ప్రభుత్వం పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రధాన ఆధారంగా చేసుకుని బడ్జెట్‌ను రూపొం దించిందనేది వెల్లడవుతోంది. ఏప్రిల్ నుండి ప్రారంభమయ్యే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ఖజానాకు మొత్తం రాబడి రూ.3,24,134 కోట్లుగా బడ్జెట్ అంచనాల్లో వెల్లడించింది. ఈ మొత్తంలో రాష్ట్ర స్వంత పన్ను ఆదాయాల వాటా రూ.1,48,165.75 కోట్లు కాగా, కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటాగా రూ.33,181.64 కోట్లుగా అంచనా వేసింది. ఈ రెండూ కలిసి మొత్తం పన్ను ఆదాయం రూ.1,81,347.39 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. రంగాల వారీగా పన్నుల రాబడులను పరిశీలిస్తే ప్రస్తుత సంవత్సరానికి వస్తు పన్ను ద్వారా రూ.52,310 కోట్లు, సేల్స్ టాక్స్ ద్వారా రూ.38,105 కోట్లు సమకూరుతాయని పేర్కొంది. ఈ మొత్తంలో పన్ను ఆదాయం రూ.1.34 లక్షల కోట్లుగా ఉంది. కాగా కేంద్ర పన్నుల వాటా రూ. 29,471 కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే, పన్ను వసూళ్లలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. కేంద్ర పన్నుల వాటాను మినహాయిస్తే, 2024-25లో ఆదాయం రూ. 1.09 లక్షల కోట్లుగా ఉండగా, 2025-26 నాటికి అది రూ. 1.40 లక్షల కోట్లకు పెరిగింది దీనితో పన్ను వసూళ్లలో రూ.30,000 కోట్ల పెరుగుదల నమోదైంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక శాఖ బడ్జెట్‌లో ప్రభుత్వం పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు రూ.1,63,490 కోట్ల మేర వసూళ్లు వచ్చినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. గతేడాది 2024-25 ఆర్థిక సంవత్సరం కన్నా ప్రస్తుత 2025-26లో 10 శాతం ఎక్కువ. పన్నుల వసూళ్ల సాధించమని ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టే ప్రధాన శాఖలను ఆదేశించిన దరిమిలా ఈ పన్నుల ఆదాయంలో గణనీయంగా పెరుగుదల చోటు చేసుకుంది. 2025-26లో పన్నుల ద్వారా లక్ష్యంగా పెట్టిన రూ.1.64 లక్షల కోట్లకు చివరికి రూ.1.40 లక్షల కోట్లు మాత్రమే సాధించగలిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త 2026-27 వార్షిక అంచనా బడ్జెట్‌లో రూ.1,48,165.75 కోట్ల లక్ష్యాన్ని నిర్ధారించి ఆ మేరకు దాన్ని అధిగమించేందుకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. పన్ను ఆదాయ వృద్ధికి సంబంధించిన ఈ ధోరణి రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా కొనసాగుతుందని అంచనా వేస్తూ, కేంద్ర పన్నుల వాటాతో కలిపి మొత్తం పన్ను ఆదాయం రూ.1.81,347.39 కోట్లుగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది.

> **56 శాతం మేర రూ.1,81,347 కోట్ల అంచనా**
>
> **ప్రస్తుత 2025-26లో రూ.1.40 లక్షల కోట్లు వసూళ్లు**
>
> **యేటా గణనీయంగా పెరుగుతున్న పన్నుల ఆదాయం**
>
> **2026-27 వార్షిక బడ్జెట్లో రూ.1.48 కోట్లకు పెంపు**



## ఆర్‌ఎల్‌డిలో చేరిన జెడియు మాజీ నేత కెసి త్యాగి

**న్యూఢిల్లీ, మార్చి 22:** జెడియుకు రాజీనామా చేసిన సీనియర్ నేత కెసి త్యాగి ఆదివారం రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీలో చేరారు. నితీశ్‌కుమార్‌తో విభేదాలు పొడసూపడంతో ఆ పార్టీకి రాజీనామా చేసిన త్యాగి మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్‌సింగ్ వైభవాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే తాను ఆర్‌ఎల్‌డిలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆర్‌ఎల్‌డి ఛైర్మన్ జయంత్ చౌదరి సమక్షంలో ఆయన పార్టీతీర్థం పుచ్చుకున్నారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్ నుంచి రాజకీయాల్లోకి వచ్చిన త్యాగి బీహార్‌లో కీలక నేతగా ఎదిగారు. ఎన్డీయే మిత్రపక్షం రాష్ట్రీయ లోక్‌దళ్‌తో కలిసి ముందుకు వెళతామని ప్రకటించారు. చరణ్‌సింగ్‌మనుమడు జయంత్‌చౌదరి ప్రస్తుతం ఆర్‌ఎల్‌డీకి ఛైర్మన్‌గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. లోక్‌దళ్‌నుంచే తన రాజకీయ కెరీర్ ప్రారంభించానని, ఇకపై తాము చౌదరి చరణ్‌సింగ్ కన్న కలలను సాకారంచేసేందుకు ఆయన వదిలివెళ్లిన సిద్ధాంతాలను అమలుచేసేందుకు కలిసి పనిచేస్తామన్నారు. జెడియుకు ఆర్‌ఎల్‌డికి పెద్ద తేడా ఏమీలేదని, ఒకప్పుడు నితీశ్‌కుమార్, చౌదరి అజిత్‌సింగ్‌లు కలిసి ఉమ్మడిగా పార్టీ ఏర్పాటు చేసిన అంశాన్ని గుర్తు చేసారు.

# ఇక ప్లాస్టిక్ రోడ్లు!

## ఎపిలో కొత్త సాంకేతికతతో 24 రోడ్ల నిర్మాణానికి సిద్ధం

## ప్లాస్టిక్, డానిష్ ఫైబర్ టెక్నాలజీతో నిర్మాణం



**విజయవాడ,మార్చి 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఇక ప్లాస్టిక్ టెక్నా లాజీతో రోడ్లు నిర్మించనున్నారు.ఇందుకు అనుగుణం ప్రభుత్వం కార్యకరణ చేపట్టనున్నది.సీఎం ఆదేశాల మేరకు అధికారులు రోడ్ల నిర్మాణ కార్యకలాపాల్లో సరికొత్త సాంకేతికతను వినియోగించ నున్నారు.రాష్ట్రంలో ఆర్అండ్బీశాఖ చేపట్టే రోడ్ల పనుల్లో కొన్నిం టిని ప్లాస్టిక్, డానిష్ ఫైబర్ టెక్నాలజీలతో చేపట్టేందుకు సిద్ధమైంది. ప్రతి సంవత్సరం అధ్వానంగా తయారైన రోడ్లను రెన్యువల్ చెయ్య డం, గుంతలుపడ్డ రోడ్లకు మరమ్మతులు చెయ్యడమే పనిగా పెట్టుకో కుండా అటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కొత్త టెక్నా లజీలపై అవగాహన పెంచుకొని వాటిని వినియోగించుకోవాలని సిఎం చంద్రబాబు సంబంధిత అధికారులకు సూచించారు. ఈ టెక్నాలజీ ఆధారంగా 24 రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. దీని ద్వారా అవి ఎక్కువ కాలం పాటు మరమ్మతులకు గురికాకపోవడం, వర్షాలకు దెబ్బతినకపోవడం వంటి ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. 8 రోడ్లలో 42.51కి.మీ. మేర ప్లాస్టిక్ టెక్నాలజీ, 16 రోడ్లలో 122.34 కి.మీ.మేర డానిష్ ఫైబర్ టెక్నాలజీ వినియోగించనున్నారు. మొత్తం రూ.85.6కోట్లు వెచ్చించి 164.85 కిలోమీటర్ల మేర పనులకు సిద్ధ మవుతున్నారు. సూరత్లో ఉన్న ఎకోఫిక్స్ రెడీమిక్స్ తయారీ ప్లాం ట్ను,మన రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసేందుకు రుముక గ్లోబల్ కంపెనీ సిద్ధమైంది. దక్షి ణాది రాష్ట్రాలు అన్నింటికీ ఇక్కడి నుంచే రెడీమిక్స్ బ్యాగ్లను సరఫరా చేయాలని భావి స్తోంది. విజయనగరం జిల్లాలో గజపతినగరం మెంటాడ పిట్టాడ రోడ్లో 9.2 కి.మీ., శ్రీకాకుళం జిల్లాలోని ఉప్పినివలస నుంచి హనుమపేట, ఓవీ పేట, చీడివలస మీదుగా గుట్టవల్లి వెళ్లే రోడ్డులో 7.30 కి.మీ., అనకాపల్లి జిల్లాలోని తుమ్మపాల నుంచి దిబ్బపాలెం, వూడేరు మీదుగా వెళ్లే ఏపీ రోడ్డులో 7.60 కి.మీ., డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో శివకోడు మానేపల్లి రోడ్లో 1 కి.మీ., పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంఎల్వీఎన్ పురం రోడ్లో 2.60 కి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ పొక్కునూరు రోడ్లో 5 కి.మీ., ప్రకాశం జిల్లాలోని పొదిలి మార్కాపురం రోడ్లో 5.7 కి.మీ., తిరుపతి జిల్లాలో బైరాజు కండ్రిగ రామాపురం రోడ్లో 4.10 కి.మీ. మేర ప్లాస్టిక్ రోడ్లు నిర్మించనున్నారు. ఇటీవలే వీటికోసం జిల్లాలవారీగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, కాంట్రాక్ట్ సంస్థలను ఎంపిక చేశారు. సాధారణంగా రోడ్డు నిర్మించాక రెన్యువల్ పనులు ఐదేళ్ల చేస్తారు. ఈ క్రమంలో పాత రోడ్డు మీద తారు, బిటుమిన్తో కొత్త లేయర్ వేస్తారు. డానిష్ ఫైబర్ టెక్నాలజీలో బిటుమిన్ మిక్స్లో అరమిడ్, పాలియోలెఫిన్ అనే ఫైబర్ను కలుపుతారు. దీనిని డానిష్ అస్ఫాల్ట్ రీఇన్ఫోర్సింగ్ టెక్నాలజీగా పేర్కొంటారు. ఈ విధంగా వేసిన రోడ్డు బలంగా ఉండటమే కాకుండా, వర్షపునీరు దానిలోకి ఇంకకుండా డానిష్ ఫైబర్ అడ్డుకుంటుంది. దీనివల్ల రోడ్డు ఎక్కువ కాలం ఉపయోగంలో ఉం టుంది. ఈ విధానాన్ని డెన్మార్క్లో అభివృద్ధి చేశారు. ఆర్అండ్బీ మంత్రి బీసీ జనార్దన్రెడ్డి నియోజకవర్గం బనగానపల్లె పరిధిలో గత సంవత్సరం జులైలో ముదిగేడుసంజామల రాకపోకలకు కి.మీ.లో ప్రయోగాత్మకంగా ఈ విధమైన రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 16 రోడ్లలో ఈ టెక్నాలజీ వినియోగించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపు తున్నారు. రోడ్డు చాలా కాలంపాటు మన్నికగా ఉండేందుకు, వర్షాలకు రోడ్డుపై నీరునిలిచినప్పటికీ ఆ నీరు రోడ్డులోపలికి ఇంకిపోకుండా ఉండేం దుకుప్లాస్టిక్ తోడ్పడుతుంది. దీనికోసం ప్లాస్టిక్ టెక్నాలజీలో వృథాగా పడేసిన ప్లాస్టిక్ను బిటుమిన్మిక్స్లో కలిపి వినియోగిస్తారు. 2 టెక్నా లజీలతో వేసినరోడ్లకు 7 నుంచి 8 ఏళ్ల వరకు రెన్యువల్ చేయాల్సిన అవ సరం ఉండదు.వర్షాల ధాటికి రోడ్లమీద ఏర్పడే గుంతలను పూడ్చేందుకు ఈ సంవత్సరం ఎకోఫిక్స్ రెడీమిక్స్ను ఉపయోగించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దీనికోసం స్టీల్ స్లాగ్ అనే వ్యర్థాన్ని ఉక్కు ఫ్యాక్టరీల నుంచి సేకరించి, దానికి కొన్ని కెమికల్స్ జోడించి ప్రాసెస్ చేసి, తారు, కంకరతో కలిపి మోడిఫైడ్ బిటుమిన్గా మలుస్తారు. ఆ తర్వాత ఇలా తయారు చేసిన మిశ్రమాన్ని ఒక్కో సంచిలో 30 కిలోల వరకు నింపి పెడ్తారు. దీంతో గుంతలను పూడుస్తారు. ఈ ఎకోఫిక్స్ రెడీమిక్స్ వర్షాకా లంలో కూడా గుంతలను పూడ్చడానికి ఉపయోగపడుతుంది. ఈ టెక్నాల జీని రుముక గ్లోబల్ ఎకోఫిక్స్ అనే కంపెనీ సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ)తో కలిసి అభివృద్ధిచేసింది. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్లో ప్లాంట్ ఏర్పాటుచేసి, అక్కడి నుంచి సరఫరా చేస్తుంది. తయారైన 6 నెలల్లో ఈ ఎకోఫిక్స్ రెడీ మిక్స్ మిశ్రమాన్ని వినియోగించాలి. ఆర్అండ్బీ అధికారులు ఈ ఏడాది 50 వేల బ్యాగుల రెడీమిక్స్ బ్యాగ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. వీటిని మే నెలలో రాష్ట్రానికి రప్పించనున్నారు. జూన్ నుంచి వర్షాలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడిన చోట్ల దీనిని వినియోగించనున్నారు. ఒక్కో కేజీ ఎకోఫిక్స్ మిశ్ర మానికి రూ.13చొప్పున వెచ్చిస్తున్నారు.

---

## నెలాఖరుకు పోలవరం
# డయాఫ్రం వాల్ పూర్తి

### ఎపి జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు



**విజయవాడ మార్చి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** 2027 నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా శరవేగంగా పనులు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోలవ రం పూర్తయ్యే లోపుగానే నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించే విధంగా ప్రణాళికతో పని చేస్తున్నామన్నారు. 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రి ఉండగానే 700 కోట్ల రూపాయలు నిర్వాసితులకు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గడిచిన 21 నెలలో 1940 కోట్లు నిర్వాసితులకు అందజేసి, వారికి అండగా నిలిచిన ఘనత చంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. 2025 సంక్రాంతికి 800 కోట్లు దీపావళి 914 కోట్లు, 2026 ఉగాది సందర్భంగా నేడు 226 కోట్లు వెరసి 1940 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకి 2014-19 తెలుగుదేశం హయాంలో కేంద్ర నిధులు సకాలంలో రాలేకపోయినా అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ నుంచి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి, పనులు సాగించిందన్నారు. నిర్వాసితులకు పరిహారము చెల్లించకుండా ఎక్కడికి మళ్ళించారో ఏం చేశారో కూడా తెలియకుండా చేశారని రామానాయుడు విమర్శించారు. మాట్లాడితే ఎస్సీలు, నా ఎస్టీలు అని మొసలి కన్నీరు కార్చే జగన్ నిర్వాసితులు అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సోదరులకు చేసిన అన్యాయం అంతా అంతా కాదన్నారు. పోలవరం నిర్వాసితులకు సంబంధించి ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి 2,85,000 మాత్రమే చెల్లించేవారన్నారు. ఈ మొత్తాన్ని 3,57,000కు పెంచారని ఆయన చెప్పారు. అలాగే ఓటిఎస్ కింద అంటే కాలనీలో ఐదు సెంట్లు ఇళ్ల స్థలం అక్కర్లేకుండా వేరే చోటకి వెళదాం అనుకున్న వారికి అదనంగా ఇచ్చే లక్ష రూపాయాలను రెండు లక్షలకు పెంచినట్లు కూడా మంత్రి చెప్పారు. దీంతో ఓటీ ఎస్ మొత్తం 5.57 లక్షలకు పెంచిన ఘనత చంద్రబాబుదే అన్నారు.

## ఎపి కల్తీ పాలు ఘటనలో 16కి చేరిన మృతులు

**రాజమహేంద్రవరం, మార్చి22 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పట్టణంలో జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న పి నాగేశ్వరరావు (77) మృతి చెందారు. దీంతో ఈ సంఘటనలో మృతుల సంఖ్య 16కి చేరింది. మొత్తం 20మంది కల్తీ బాధితులుగా గుర్తించగా ఆరోగ్యం కుదుటపడి ఒకరు ఆసుపత్రి నుంచి డిస్ చార్చి కాగా మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం మిగిలిన రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన అన్ని వైద్య చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని దగ్గరగా ఉండి పర్యవేక్షణ చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలియచేశారు.

## యర్నగూడెం జాతీయ రవాదారిపై ఘోర ప్రమాదం

### ముగ్గురు మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు

**దేవరపల్లి, మార్చి 22 (ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం 16 నెంబర్ జాతీయ రహదారిలోని గండి చెరువు సమీపంలో ఫ్లైఓవర్ పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే మరణించగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.రాజమండ్రి వైపు నుండి ఏలూరు వైపు వెళుతున్న ఎట్టికా కారు అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరొక కారు ను ఢీ కొట్టడంతో ఎట్టికా కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మరొక కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న దేవరపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

---

## 'గేట్'లో ఎపి ట్రిపుల్ ఐటి
# విద్యార్థుల ప్రతిభ

**విజయవాడ మార్చి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ ఫలితాల్లో ఏపీ రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్లకు చెందిన మొత్తం 110 మంది విద్యార్థులు 1500 లోపు ర్యాంకులు సాధించారు. నూజివీడు 42, ఇడుపులపాయ 34, ఒంగోలు 20, శ్రీకాకుళం క్యాంపస్లో 14 మందికి ర్యాంకులు లభించాయి. వీరిలో కొందరికి గేట్ స్కోర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ల్లో ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. 610 మంది విద్యార్థులు గేట్లో ఉత్తీర్ణులయ్యారు. సుమారు 300 మంది విద్యార్థులకు ఐఐటీల్లో పీజీ ప్రవేశాలకు సీట్లు లభించే అవకాశం ఉన్నట్లు ఆర్జీయూకేటీ ఛాన్సలర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కొత్త మధుమూర్తి తెలిపారు. గేట్ స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సు నిర్వహిస్తున్నారు.

---

# యేటేటా తగ్గుతున్న పప్పుధాన్యాల సాగు

- రాష్ట్ర వినియోగంలో కేవలం 26.2శాతం మాత్రమే ఉత్పత్తి
- యేటా 10లక్షల ఎకరాలలోపే సాగవుతున్న వైనం
- వరి, పత్తి, మొక్కజొన్న సాగుకే రైతాంగం మొగ్గు



**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పప్పుధాన్యాల సాగు ఏటేటా గణనీయంగా తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో పప్పుధాన్యాల సాగు తెలంగాణలో ఏటేటా ఆందోళనకరరీతిలో తగ్గిపోతోంది. ప్రతి ఏటా రాష్ట్రంలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.20 కోట్ల ఎకరాలు ఉంటోంది. ఏటేటా వరి, పత్తి , మొక్కజొన్న సాగు రాష్ట్రంలో పెరుగుతుండగా పప్పు ధాన్యాల సాగు మాత్రం గణనీయంగా తగ్గుతోందని వ్యవసాయశాఖవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సాధారణంగా వానాకాలంలో పప్పు ధాన్యాల సాగు అధికంగా ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 10లక్షల ఎకరాల విస్తీర్ణాన్ని కూడా పప్పు ధాన్యాల సాగు చేరుకోకపోవడం గమనార్హం. కంది మినహా పెసర, శనగ, మినుము, అలసంద తదితర పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. పప్పు దినసుల పంటల్లో ప్రధానమైన కంది మాత్రమే రాష్ట్రంలో 5లక్షల ఎకరాలకు కాస్త అటు ఇటుగా సాగవుతోంది. దశాబ్ద కాలానికి ముందు పప్పు ధాన్యాలు పండించడంలో దేశంలో తెలంగాణ అగ్ర స్థానంలో ఉండేది. పెసర, కంది, మినుము, బొబ్బర, అలసంద, రాగులు, శనగ, నువ్వులు, జొన్నలు, సజ్జలు మొదలైన పంటలు పదేళ్లుగా తక్కువగా ఉత్పత్తి అవుతున్నాయి. దిగుబడులు ఆశించినంతగా లేకపోవడంతో వీటిని పండించేందుకు రైతులు మొగ్గు చూపడం లేదు. అదే సమయంలో కోతుల వల్ల పంటను కాపాడుకోవడం రైతులకు సవాల్గా మారింది. పప్పు ధాన్యాల పంటలు సంవత్సరానికి 2 నుంచి 3 పంటలు పండించే హైబ్రిడ్ రకాలు ఇప్పుడు రైతులకు అందుబాటులో ఉన్నాయి. పెసర, మినుము, అలసందలు తెలంగాణలో ఏ ప్రాంతంలోనైనా సాగుచేసుకునే వీలుంది. అదేవిధంగా కంది, పెసర, మినుము మద్దతు ధరలను కూడా కేంద్ర ప్రభుత్వం పెంచింది. అయినప్పటికీ రాష్ట్రంలో పప్పు ధాన్యాల సాగు ఏటేటా తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా తెలంగాణలోని మొత్తం జనాభాకు కావలసిన పప్పుధాన్యాలు సుమారు 13.0 లక్షల టన్నులు, అయితే తెలంగాణ పప్పు ధాన్యాల ఉత్పత్తి వాటా రాష్ట్ర ప్రజల వినియోగంలో కేవలం 26.2 శాతమే ఉండడం గమనార్హం. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పప్పులను తెలంగాణ దిగుమతి చేసుకుంటుంది. ప్రజలకు కావలసిన ముఖ్యమైన పోషకాలు ప్రోటీన్లు, పీచు పదార్థం, ఖనిజ లవణాలు, విటమిన్లు అందించడంలో పప్పు ధాన్యాలు ఎంతో దోహదపడతాయి. తెలంగాణ ప్రజల తలసరి పప్పు దినుసుల అవసరం సంవత్సరానికి సుమారు 18.3 కిలోలు. మరోవైపు భారత వైద్య పరిశోధనా మండలి సూచించిన తలసరి పప్పు వినియోగం సంవత్సరానికి సుమారు 29.2 కిలోలు. కానీ రాష్ట్రంలో వివిధ అపరాల తలసరి వినియోగం సంవత్సరానికి సుమారు 7.06 కిలోలు మాత్రమే. రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్నగర్, మెదక్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో పపు ధాన్యాలు కొద్దిమేర విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఈ నేపథ్యంలో పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని వ్యవసాయ వర్సిటీ విసి ప్రొ. జానయ్య స్పష్టం చేస్తున్నారు.

---

## హైదరాబాద్లో కొనసాగుతున్న
# డ్రంకన్ డ్రైవ్ దాడులు

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 343 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 287 మంది ద్విచక్ర వాహనదారులు, 24 మంది ఆటో డ్రైవర్లు, 32 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 71 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 143 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 77 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 30 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 14 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, నలుగురు 251 నుంచి 300 పాయింట్ల వరకు, నలుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

---


# సంక్షోభంలో సింగరేణి

- యుద్ధం ప్రభావం వల్ల పేలుడు పదార్థాలకు కొరత
- పూర్తిగా డీజిల్ సరఫరాకు బ్రేక్
- గనుల్లో తగ్గుతున్న బొగ్గు ఉత్పత్తి

**హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పశ్చిమ ఆసియా దేశాలలో జరుగుతున్న యుద్ధాల వల్ల సింగరేణికి కష్టాలు పెరుగుతున్నాయి. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఉమ్మడి జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి మీద యుద్ధ ప్రభావం తీవ్రంగా చూపుతోంది. బొగ్గు గన్నుల్లో ఆటంకాలు ఏర్పడి ఉత్పత్తి లక్ష్యాలను అధికమించ లేకపోతోంది. గనుల్లో నుండి బొగ్గును తీసేందుకు వినియోగించే పేలుడు పదార్థాలు ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటన్న నేపథ్యంలో అక్కడ యుద్ధంతో ఇప్పుడు సింగరేణిలో వాటికి కొరత ఏర్పడింది. సింగరేణి పారిశ్రామికీకరణతో పాటు, వివిధ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును సరఫరా చేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న 12 ఏరియాల్లో 18 ఓపెన్ కాస్ట్ గనులు 19 భూగర్భ గనులు సింగరేణికి ఉన్నాయి. ఇందులో ఓపెన్ కాస్ట్ గనుల్లోనే లక్ష్యాలకు అనుగుణంగా 80 శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తి సాగుతుంది. అయితే సింగరేణికి ఇప్పుడు యుద్ధం సమస్య వచ్చిపడింది. యుద్ధంతో పేలుడు పదార్థాల కొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. ప్రధానంగా బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్ కాస్ట్ గనులు కీలకంగా ఉంటున్నాయి. అయితే ఇందులో బొగ్గు ఉత్పత్తి చేయడానికి ముందుగా మట్టిని తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత బొగ్గు వెలికి తీస్తారు. మట్టి బొగ్గు వెలికి తీయడానికి పేలుడు పదార్థాలు అవసరం ఉంటాయి. అవి ఎక్కువ శాతం ఓడల ద్వారానే వస్తాయి. సింగరేణి వ్యాప్తంగా ప్రతి ఏట 3 లక్షల టన్నుల పేలుడు పదార్థాలు అవసరమవుతాయని సంస్థ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందుకు ఓపెన్ కాస్ట్ గనుల్లో రోజుకు 800 టన్నుల సైట్ మిక్స్ ఎమల్షన్ అవసరం ఉంటుంది. అయితే ఈ పేలుడు పదార్థాల ఉత్పత్తికి అమ్మోనియం నైట్రేట్ అవసరం అవుతుంది. అది విదేశాల నుంచి దిగుమతి కావలసి ఉంటుంది. ఈ దిగుమతిని యుద్ధం ప్రారంభమైన తర్వాత సగానికి సగం వరకు తగ్గించారు. దీనితో తెలంగాణలో అతి పెద్ద పరిశ్రమైన సింగరేణలో కూడా దాని ప్రభావం పడుతోంది. ఒకవైపు పేలుడు పదార్థాల కొరత ఉంటే మరోవైపున డీజిల్ కొరత కూడా తీవ్రంగానే ఉంది. సింగరేణి సంస్థకు పెద్ద ఎత్తున ఇది అవసరం అవుతుంది. ఓపీలో షావల్, డంపర్లు, డోజర్లు, భారీ వాహనాలు, పలు రకాల యంత్రాలు వాడకానికి డీజిల్ అవసరం ఉంది. దీనికోసం ప్రతిరోజు 10 లక్షల లీటర్ల వరకు డీజిల్ ని ఉపయోగిస్తూ ఉంటారు. అయితే అంత పెద్ద మొత్తంలో డీజిల్ సరఫరా చేయలేమని చమురు సంస్థలు స్పష్టం చేసినట్లు తెలియవచ్చింది. దీనితో ఆ యుద్ధం ప్రభావం సింగరేణి మీద పడుతుందది ప్రత్యక్షంగా. దీనికి కారణం సింగరేణికి అవసరమైనటువంటి ఇంధనం అలాగే సింగరేణిలో వాడేటువంటి బ్లాస్టింగ్కు వాడే ముడి సరకులు దొరకడం చాలా కష్ట సాధ్యం అవుతున్నటువంటి పరిస్థితి ఉంది. యుద్ధంతో పెద్ద సమస్య సింగరేణికి ఎదురవుతుందని సింగరేణి అధికారవార్గాలు అంటున్నాయి. ఈ సమస్య నుంచి బయట పడడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, లేకుంటే సింగరేణి భారీగా నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.



---



## రోప్వే ట్రాలీ తెగిపడి మహిళ మృతి
### మరో ఏడుగురికి గాయాలు

రాయ్పూర్, మార్చి 22: ఛత్తీస్గఢ్ జిల్లా మహాసముంద్ జిల్లాలో కొండపై నున్న ఆలయం నుంచి కిందకి వస్తున్న రోప్ వే ట్రాలీ తెగిపడటంతో ఒక మహిళ మృతిచెంది. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో మరో ఏడుగురు గాయపడ్డారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో ఎనిమిది మంది ప్రయాణికులతో ట్రాలీ కేబుల్ కిందకు వస్తుండగా తెగిపడినట్టు అధికారులు తెలిపారు. బాధితులు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కొండపై నున్న ఖల్లారి మాత ఆలయానికి వచ్చినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. మృతురాలిని రాయపూర్కు చెందిన 28 ఏళ్ల ఆయూషి సత్కార్గా గుర్తించారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అధికరాలు విచారణ జరుపుతున్నారు. ఖల్లారి మాత ఆలయం వద్ద జరిగిన ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి సామాజిక మాధ్యమంలో సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఖల్లారి మాతను ప్రార్థిస్తున్నట్టు చెప్పారు.

---


## ప్రభుత్వ రంగంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలకు
# పద్మశ్రీ కాకర్ల విశిష్ట కృషి

- శిరందాస్ శ్రీనివాస్కు కాకర్ల జీవిత సాఫల్య పురస్కారం
- నిమ్స్లో ప్రొఫెసర్ కాకర్ల జాతీయ సదస్సు

**జూబ్లీహిల్స్, మార్చి 22, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో ఆధునిక వైద్య విధానాన్ని, ప్రభుత్వ రంగంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను విస్తరించడానికి పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు చేసిన కృషి ఎనలేనిదని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో ఆదివారం పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. హైదరాబాద్లో నాలుగు తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల (టిమ్స్) ఏర్పాటుతో 4000 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. నిమ్స్లో అదనంగా 2000 బెడ్స్ ఉస్మానియా, కాకతీయ ఆసుపత్రులలో మరో 3000 బెడ్స్తో వైద్య అనుబంధ ప్రొఫెషనల్స్కు ఎన్నో ఉద్యోగాలు రానున్నాయన్నారు. కాకర్ల చేసిన సేవలను, కృషిని సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఆయన పేరుపై గత 15 ఏండ్లుగా ప్రతి ఏటా జాతీయ స్థాయిలో సదస్సును నిర్వహిస్తూ, విశిష్ట వ్యక్తులను గుర్తిస్తూ క్రెస్ట్ సహకారంతో ప్రొఫెసర్ కాకర్ల జీవిత సాఫల్య అవార్డులను అందిస్తున్నామన్నారు. కాకర్ల శత జయంతి సందర్భంగా జీవితసాఫల్య అవార్డును నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్, రేడియాలజీ ఇమేజింగ్, థెరప్యూటిక్ ప్రొఫెషనల్స్ జాతీయ మండలి అధ్యక్షుడు శిరందాస్ శ్రీనివాస్కు 2025 సంవత్సరానికిగాను అవార్డును ప్రకటించడం గర్వకారణం అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ప్రొఫెసర్, రేడియాలజీ విభాగాధిపతి, పూర్వ డీన్ డాక్టర్ ఎస్. రామ్మూర్తి, కాకర్ల సుబ్బారావు రేడియాలజీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ ఎన్. కవితా రెడ్డి, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ (సర్) జాతీయ అధ్యక్షులు, మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ సభ్యులు శంకర్ కె భగత్, సర్ చైర్మన్ మునిరత్నం, అకడమిక్ డైరెక్టర్, కెఎస్ఆర్ జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ దామోదర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.ఏ.వారిస్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహేష్ బసవేని పాల్గొన్నారు. సదస్సులో దాదాపు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్తమ పరిశోధన పత్రం అవార్డును శ్రీ రామచంద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్కు చెందిన విద్యార్థి చెరుకూరి ధనుష్ అందుకున్నారు.

---

## భారత్ నౌకాదళంలోకి వచ్చే నెల 3న
# ఐఎన్ఎస్ తారాగిరి



**న్యూఢిల్లీ, మార్చి 22:** ఇండియన్ నేవీలో అత్యాధునిక 'మిస్సైల్ పవర్ హౌస్' చేరబోతోంది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన స్టెల్త్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' ఏప్రిల్ 3న అధికారికంగా నౌకాదళంలో ప్రవేశించనుంది. ఈ విషయాన్ని రక్షణరంగ అధికారులు తెలిపారు. అత్యాధునిక ఆయుధాలు, రాడార్ల వ్యవస్థతో నిర్మించిన ఈ యుద్ధనౌక విశాఖపట్నంలో జరిగే కమిషన్ కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ చేతులు మీదుగా నేవీ అమ్ముల పొదిలోకి చేరుతుంది. మన దేశం యుద్ధ నౌకల నిర్మాణం, రూపకల్పనలో స్వయంసమృద్ధి శక్తిగా ఎదుగు తోందని చెప్పడానికి తారాగిరి నిదర్శనం. ఈ నౌక 6,670 టన్నుల బరువు ఉంటుంది. ప్రాజెక్టు 17ఎ క్లాస్లో ఇది నాలుగో నౌక. మజ్ గావ్ డాక్ షిప్బిల్డింగ్ లిమిటెడ్ నిర్మించిన మూడో నౌక. కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్లాంట్తో నడిచే తారాగిరి, అధిక వేగం, అత్యధికకాలం ప్రయాణించే శక్తితో బహుముఖ నౌకా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇందులో సూపర్సోనిక్ వేగం కలిగిన బ్రహ్మోస్ వంటి ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణులు, మధ్యస్థ స్థాయి ఉపరితలం నుంచి గగనతలంపైకి ప్రయోగించే క్షిపణులు, ఒకేసారి పలు లక్ష్యాలను గుర్తించి ట్రాక్ చేయగల మల్టీ ఫంక్షన్ రాడార్, ప్రత్యేకతలతో కూడి శత్రు జలాంతర్గాములపైకి దాడి చేయగల యుద్ధ సామగ్రి ఉంటాయి.శత్రు దాడులను సిబ్బంది క్షణాల్లో తిప్పికొట్టేలా కాంబాట్ మేనేజ్మెంట్ సిస్టంతో వీటిని అనుసంధానించారు. మునుపటి డిజైన్ల కన్నా ఎంతో ఆధునికంగా రూపొందించిన ఈ యుద్ధనౌక.. శత్రు రాడార్లకు చిక్కకుండా ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంది. ఈ నౌకలో 75 శాతంపైగా స్వదేశీ పరికరాల వినియోగంలో 200కుపైగా ఎంఎస్ఎంఇ సంస్థలు పాలుపంచుకున్నాయి. ప్రభుత్వ ఆత్మనిర్భరత కార్యక్రమానికి, స్వదేశీ నౌకాశ్రయా ల అత్యాధు నిక ఇంజినీరింగ్ సామర్థ్యా లకు ఇది ప్రతిరూ పమని కేంద్ర రక్షణ శాఖ తెలిపింది. సముద్ర జలాల్లో అగ్రశ్రేణి వేటగాడిగానే కాకుండా, ఆధుని క దౌత్యంలోని సంక్లిష్ట తలను, మానవీయ సంక్షోభాలను ఎదుర్కొ వడానికి తారాగిరిని నిర్మించినట్లు అధికారులు చెప్పారు.

# చేతులు నాజూగ్గా మారాలంటే

బరువు తగ్గాలనేది కొందరి ఆలోచన అయితే... మరికొందరు మహిళలు మాత్రం చేతులు నాజూగ్గా కనిపించాలి. ఇవి సన్నగానే కాదు... బలంగానూ ఉండాలి. అందుకోసమే ఈ వ్యాయామాలు....



**కుర్చీతో...** బలమైన కుర్చీని తీసుకోండి. దాని అంచుల్ని పట్టుకుని మీరూ అక్కడే కూర్చోండి. ఇప్పుడు మీ కాళ్లను ముందుకు చాచి, మెల్లగా కుర్చీ నుంచి కిందకి రావాలి. ఈ సమయంలో మీ బరువంతా చేతుల మీద ఉండాలి. తిరిగి మళ్లీ పైకి లేవాలి. ఇలా రోజులో పది సార్లైనా చేస్తూ ఉండండి. వీటినే చెయిర్ డిప్స్ అంటారు. ఇవి భుజాలు, చేతుల దగ్గర ఉన్న కొవ్వుని తగ్గిస్తాయి. బలంగానూ మారుస్తాయి.

**చున్నీతో....** రెసిస్టెన్స్ బ్యాండ్స్లా చున్నీని ఉపయోగించి చేతులని టోన్ చేయవచ్చు. చున్నీ కొనలను రెండు చేతులతో పట్టుకుని తల వెనక్కి ముందుకీ తీసుకురండి ఇలా కనీసం ఓ పదిహేను సార్లు చేయండి. క్రమంగా ఫలితం మీకే కనిపిస్తుంది.

**నీళ్ల సీసలతో...** రెండు చేతుల్లో లీటరు బరువున్న నీళ్ల సీసాలను పట్టుకుని పక్కకు చాచండి. అలా చాచిన చేతులను చిన్నగా సవ్యదిశలో 50 సార్లు, అపసవ్యదిశలో 50 సార్లు తిప్పాలి. ఇలా తిప్పడం వల్ల మీ భుజాలు, చేతుల దగ్గరున్న కొవ్వు తగ్గి, బలంగా మారుతాయి. ◻

# బ్రేకప్ అయిందని బాధపడితే ఎలా?

ప్రేమ.. ఇది ఎంతటి మధురానుభూతులను పంచు.. విఫలమైతే అంతకంటే ఎక్కువగా బాధపెడుతుంది. కొంతమంది ఇలాంటప్పుడు మానసికంగా కుంగిపోతుంటారు. ఇదిగో ఇలాంటి ప్రతి కూల పరిస్థితుల్లోనే ఆచితూచి అడుగేయాల రిలేషన్షిప్ నిపుణులు. అప్పుడే జీవితంలో ముందుకెళ్లచ్చంటున్నారు. అలాకాకుండా క్షణికావేశానికి లోనైనా జీవితమే ప్రశ్నార్థకమవుతుందంటున్నారు. మరి, విఫలమైన ప్రేమ నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలంటే ఏం చేయాలో.. తెలుసుకుందాం..



ప్రేమలో విఫలమైన అమ్మాయిల్లో చాలామంది తమలో లోపాలు వెతుక్కుంటారంటున్నారు నిపుణులు. ఇలాంటి ప్రతికూల ఆలోచనలు వారిని మరింతగా కుంగదీసి క్షణికావేశానికి లోనయ్యేలా చేస్తాయి. వారిని మరింత డిప్రెషన్లోకి నెట్టేస్తాయి. ఇలాంటి సమయంలో ఎలాంటి ప్రమాదకర నిర్ణయం తీసుకోవడానికైనా మనసును ఉసిగొల్పుతాయి. కాబట్టి ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సానుకూల ఆలోచనలు చేయాలని నిపుణులు భావిస్తున్నారు. నిజానికి మీలోని శారీరక లోపాలే బ్రేక్ కారణమైతే.. అది మీ తప్పు కాదని, అందుకు బాధపడాల్సిన అవసరం అంతకన్నా లేదంటున్నారు. ఎవరూ ఏ విషయంలోనూ సంపూర్ణం కాదని.. మిమ్మల్ని మీరుగా ప్రేమించే వ్యక్తి భవిష్యత్తులో తప్పకుండా తారపడతారన్న సానుకూల దృక్పథం, స్వీయ ప్రేమను అలవర్చుకోమంటున్నారు. మనల్ని వద్దని వదిలేసి వెళ్లిపోయిన వాళ్ల గురించి కోపంతోనైనా ఎక్కువగా ఆలోచించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదంటున్నారు నిపుణులు. అదే జరిగిందేదో జరిగిపోయింది.. ఇక ఈ విషయం ఇక్కడితో వదిలేసి. జరగబోయే సంగతి చూద్దాం..! అంటూ వాళ్లను క్షమించండి.. వాళ్ల ఆలోచనలు క్రమంగా మనసు నుంచి దూరమవుతాయి. కాబట్టి ఇలాంటి సానుకూల దృక్పథం వల్ల కొన్నాళ్లకు మీరు మీకు నచ్చిన దృష్టి పెట్టగలుగుతారు. భవిష్యత్తులో ముందుకెళ్లడానికి ఇంతకంటే ఇంకేం కావాలి చెప్పండి!!

**దినచర్యే.. గొప్ప రిలీఫ్!** మనసు బాగోలేనప్పుడు ఏ పని పైనా దృష్టి పెట్టలేం. అలాగని రోజూ గత జ్ఞాపకాలను తలచు కుంటూ కూర్చుంటే జీవితంలో ముందు కెళ్లలేం. కాబట్టి ఇలాంటి ప్రతికూల తల నుంచి బయట పడాలంటే చక్కటి దిన చర్యను అలవర్చు కోవాలంటున్నారు నిపు ణులు. ఉదయం లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకు మీ పనులన్నీ ప్రాధాన్య తల ప్రకారం చేసేలా ప్రణాళిక వేసుకోం మధ్య మధ్యలో మీ కిష్టమైన వ్యాప కాలపై దృష్టి పెట్టండి వారంతా గడిపేలా ప్లాన్ చేసుకోండి. ఇక మనసును ప్రశాంత పరిచే యోగా, ధ్యానం.. వంటి అల వాట్లకు మీ జీవనశైలి లోచోటు కల్పించండి.. కాస్త కష్టమైనా ఇలా ఓ రెండు వారాలు లేదంటే ఓ నెల రోజుల పాటు కచ్చితంగా రొటీన్ ప్రకారం ఫాలో అయ్యారంటే ఎలాంటి చెడు ఆలోచనలు మీ మనసులోకి రావు. ◻



# ఆమెకు సాహసాలంటే ఇష్టం..

ఆర్మీలో చేరడం ఆమె కల... భయాన్ని వదిలి.. గెలుపు దిశగా కదిలి అందుకోసమే ఆటల్నీ, సాహసా లను ఇష్టపడటం ఆరంభించారు. కానీ, అన్నీ అనుకున్నట్లే జరగవు కదా! కోరుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. అయినా నిరాశపడలేదు. మనసుకు ఉన్నట్లుగా నడుస్తూ వైవిధ్యాన్ని చూపుతోంది. హైదరాబాద్‌కు చెందిన అంజనీ, అడ్వెంచర్ స్పోర్ట్స్ సాధన చేశారు మారథాన్లలో పోటీపడుతున్నారు. సైక్లింగ్ రెవల్యూ షన్ క్లబ్‌ని ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ ఐరన్మియన్ 70.3 పోటీలో పాల్గొని 7.49 గంటల్లో పూర్తి చేశారు.

నేను పంజాబ్లోని ఫరీద్‌కోట్‌లో పుట్టా. అలాగని నేను తెలుగమ్మాయిని కాదనుకునేరు. మా స్వస్థలం కాకినాడ. నాన్న సత్యనారాయణ ఆర్మీ అధికారి కావడంతో తరచూ బదిలీలు జరిగేవి. అలా దేశం లోని వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో నా చదువు సాగింది. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో గ్రాడ్యుయేషన్, ఉస్మా నియా యూనివర్సిటీలో పిజి చేశా. ఆర్మీలో చేరాలను కుని ఎస్బీ ఇంటర్వ్యూ కోసం శిక్షణ తీసుకున్నా, అది సాధ్యపడలేదు. దీనితో నా అడుగులు ప్రపం చం వైపు మళ్లాయి. ఐదు కిలోమీటర్లు పది అయ్యాయి. తర్వాత హాఫ్ మారథాన్ చేశా. అది మొదలు ఎన్నో మార థాన్లు, అలా మారథాన్లు పూర్తిచేశా. అయితే, సైక్లింగ్ మొదలుపెట్టింది మాత్రం కోవిడ్ సమయం లోనే 'హ్యాపీ హైదరాబాద్' అనే కమ్యూనిటీలో కోర్ మెంబర్ అయ్యాను. మొదట్లో ఓ పాత సైకిల్‌తో సరదాగా పోటీల్లో పాల్గొనే దాన్ని తర్వాత అది అభిరుచిగా మారడంతో పలుమార్లు 100, 200,300 సైక్లింగ్ రైలులో పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్నారు. తర్వాత కొంతమంది. కలిసి హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ప్రారం భించా, ఇప్పుడిప్పుడే హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ క్లబ్‌గా మారింది.

**పర్వతాలపై భయాన్ని వదిలి...** నాకు సాహసాలంటే ఇష్టం. ముఖ్యంగా పర్వతారోహణ చేయాలనే ఆసక్తి, దానితో ఉత్తర కాశీలో ఉన్న నెహ్రూ ఇన్ డిగ్రీ ఆఫ్ మోంటెనీరింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఎవరెస్ట్ బేస్ క్యాంపును పూర్తిచేశాను. ఆపై 2023లో ఆఫ్రికాలోని కిలిమంజారో, 2024లో యూరప్‌ని ఎల్ బ్రస్లను అధి రోహించా, ఇదంతా ఒకెత్తయితే... గోవాలో జరిగిన ఐరన్మ్యాన్ 70.3 పోటీలు మరో ఎత్తు. ఇందులో సైక్లింగ్, రన్నింగ్‌లతో పాటు స్విమ్మింగ్ కూడా వచ్చి ఉండాలి. నాకేమో ఈత రాదు... దీనికోసమే శిక్షణ తీసుకున్నా. ఈ పోటీల్లో సాధన కోసం ఓ సారి చెన్నైలో సముద్రంలోకి దిగి కొంత దూరం వెళ్లాక మునిగిపోయాను. చనిపోయాననే అనుకున్నా స్థానికులు కొందరు బయటికి తీసుకురావడంతో బతికి బయటపడ్డా. తర్వాత నేను చేస్తున్న తప్పులను సరిచేసుకుంటూ నేర్చుకున్నాను. నవంబరులో ఈ పోటీలు జరిగాయి. ఇందులో 1.9 కిటికీలు ఓపెన్ స్విమ్మింగ్, 90కిలోమీటర్లు సైక్లింగ్, 21.1 కిటికీలు రన్నింగ్ పూర్తి చేయాలి. ఆ పోటీని 7.49 గంటల్లో పూర్తి చేసి విజయం సాధించాను. ◻

# నీటి మీద రాతలు

గురుకులంలో అజేయుడు, విజేయుడు పోటీ పడుతూ చదివేవారు. ఒకరోజు వాళ్లిద్దరి మధ్య వాదన వచ్చింది. ఎవరికి వారు గురువుకు తానంటే ఇష్టం అంటున్నారు. కాసేపటికి అది గొడవగా మారడంతో గురువు వారిని పిలిచి శాంతించండి ఇక్కడ విద్యనభ్యసించే ప్రతి ఒక్కరూ నాకు ప్రియమైనవారే అందరినీ సమానంగా చూస్తాను. నెన్నయినా స్వీకరించటంలోనే ఒక్కొక్కరి స్థాయి ఒక్కో విధంగా ఉంటుంది. అంతమాత్రాన నాకు ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదు, ఇంత చిన్న విషయం. గురించి తర్కించుకుని ఆవేశపడతారా? గొప్పవాళ్లు కోపానికి ఆమడదూరంలో ఉంటారు. ఉత్తముల కోసం నీటిమీద రాత లాంటిది, అది క్షణంలో చెరిగిపోతుంది మధ్యముల కోపం ఇసుక మీద రాత వంటిది. చిన్న అల వచ్చినా చెదిరిపోయినట్టు కొద్ది సేపటికి మాయమైపోతుంది. అధముల కోసం రాయి మీద చెక్కిన రాత లాంటిది. అది కలకాలం నిలిచిపోతుంది కనుక ఎలా ఉండాలో మీరే తేల్చుకోండి. అతి చిన్న విషయాలకు మీరు ముందుకు పోతూ ఇతరులను దహించటం అవసరమా! వేదోపనిషత్తులు, రామాయణ భారతాలు అభ్యసించి మహోన్నతంగా ఎదగాల్సిన మీరు అల్ప విషయాలతో కలత చెంది కల్లోలం సృష్టించటం సముచితమేనా? ఎప్పుడైనా చిరుకోపాలు వస్తే కావచ్చు. అవి నీటి మీద రాతల్లా ఇట్టే సమసిపోవాలే కానీ శలాక్షరాల్లా శాశ్వతంగా నిలిచిపోతే పాటు తక్కినవారికి అది ఇద్దరు పారమైంది. ◻



# అరె.. తప్పులున్నాయా?



అరె... నేను ఒకటికి రెండుసార్లు చదివాను. నాకు తప్పులేవీ కనిపించలేదు. ఇంకొకరు చదివితే కానీ తెలియట్లేదు నేను రాసిన దాంట్లో తప్పులున్నాయని. ఇది పెద్దవాళ్లతోపాటు తరచూ విద్యార్థుల నుంచీ వింటుంటాం కాదా! దీన్నే 'కాగ్నెటివ్ బయాస్' అంటున్నారు నిపుణులు. అంటే మనం చదవాలనుకున్న అక్షరం లేదా పదం, వాక్యం కాబట్టి మన మెదడు దాన్ని ముందుగానే ఊహించి చదువుతుందట. అంతేకాదు, అక్షరాలను విడివిడిగా కాకుండా పదాన్ని కలిపి చూస్తుంది. ఇలాపాటు చదివేటప్పుడు మన బ్రెయిన్ వేగంగా కనిపించేటప్పుడు. ఆ ప్రయత్నంలోనే తప్పులున్నప్పటికీ ఇలా గుర్తించలేకపోతారట. చదవడం కొత్తగా నేర్చుకుంటున్నప్పుడు, పరీక్షల సమయంలో వేగంగా చదవడం, నిద్రలేమి, అలసట వల్ల కూడా ఇలా జరుగుతుందట. ఇవేకాదు, పనులు వేగంగా పూర్తి చేయాలి, తొందరగా నిర్ణయాలు తీసుకోవాలి అనుకునేలా బ్రెయిన్‌లోని లాజికల్ భాగాలు లోతుగా ఆలోచిస్తాయి. అంటే ఫాస్ట్ థింకింగ్, స్లో థింకింగ్... ఈ రెండిటిని ఏకకాలంలో చేస్తుంది. అందువల్లే ఇలా జరుగుతుందని కాహ్నెమాన్ సర్వేలో వెల్లడైంది. అయితే దీనికి పరిష్కార మార్గాలు ఉన్నాయి. మనం రాసిన ఐదూపది నిమిషాల్లో చదవడం, అక్షరాల్ని విడివిడిగా పైకి చదవడం, రాసింది మరొకరికి చదివి వినిపించడం వంటి నిపుణులు. ◻

# ఆలు కీమా



**కావలసిన పదార్థాలు:**

మటన్ కీమా: అర కిలో, ఆలు గడ్డలు: రెండు(పెద్దవి), నూనె: రెండు టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి: ఎనిమిది, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, టమాట: రెండు, గడ్డపెరుగు: పావుకప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్: ఒక టేబుల్ స్పూన్, మిరియాల పొడి: అర టీస్పూన్, పసుపు: పావు టీస్పూన్, ధనియాల పొడి: ఒకటిన్నర టీస్పూన్, గరం మసాల: ఒక టీస్పూన్, వేయించిన జీలకర్ర పొడి: అర టీస్పూన్, యాలకులు: రెండు, దాల్చిన చెక్క: చిన్న ముక్క, ఉప్పు: తగినంత, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం:**

కడాయిలో నూనె వేడయ్యాక ఎండు మిర్చి వేయించాలి. వేగిన మిర్చిని పక్కన పెట్టి, అదే నూనెలో దాల్చిన చెక్క, యాలకులు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ వేయించుకోవాలి. దోరగా వేగాక అల్లం వెల్లుల్లి పేస్ట్, మటన్ కీమా, ధనియాల పొడి, మిరియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, పసుపు వేసి పది నిమిషాల పాటు సన్నని మంటపై ఉడికించాలి. టమాట ముక్కలు, పెరుగు, చిన్నగా తుంచిన వేయించిన ఎండు మిర్చి వేసి తగినన్ని నీళ్లు పోసి మూతపెట్టి నలభై నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించాలి. నూనె పైకి తేలాక తొక్కతీసిన ఆలుగడ్డ ముక్కలు, తగినంత ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు వేసి మరిన్ని నీళ్లుపోసి మరో పావుగంటపాటు ఉడికించాలి. చివరగా కొత్తిమీర తురుము వేసిదించుకుంటే నోరూరించే ఆలూ కీమా సిద్ధం. ◻

తెర



# శంబాల తరువాత సందీప్ కిషన్‌తో షైనింగ్ పిక్చర్స్

శంబాల బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. శంబాల తరువాత దర్శక, నిర్మాతలు కలిసి ఎటువంటి ప్రాజెక్ట్ చేస్తారా? అని అంతా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఆ ఎదురుచూపుకి సమాధానంగా సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు. ఈ సినిమా ప్రకటన కోసం ఓ క్రేజీ కాన్సెప్ట్ పోస్టర్‌ను వదిలారు. ఈ పోస్టర్‌లో ఒక సింహం, తోడేలు కనిపిస్తున్నాయి. యుద్ధభూమి బ్యాక్ గ్రౌండ్‌లో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ అలా నిటారుగా నిల్చుని ఉంది. కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు అనే క్యాప్షన్ చూస్తే ఈ చిత్రం ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం దర్శక, నిర్మాతలు సక్సెస్ ఫుల్ హీరో సందీప్ కిషన్‌ను ఎంచుకున్నారు. ఈ సోషియోఫాంటసీ థ్రిల్లర్‌తో ఒక సరికొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇది దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ కలిసి చేస్తున్న రెండో ప్రాజెక్ట్. ఈసారి సృజనాత్మక, సాంకేతిక ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ఈ సినిమాని రూపొందించేందుకు రెడీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇది సందీప్ కిషన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు.

# ఏప్రిల్ 17న వస్తున్న తిమ్మరాజుపల్లి టీవీ



న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేప ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా తిమ్మరాజుపల్లి టీవీ. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. తిమ్మరాజుపల్లి టీవీ చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్‌లో ఖిఖితిమ్మరాజుపల్లి టీవీఖిఖి సినిమా గ్రాండ్ రివీల్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు తేజ విహాన్ మాట్లాడుతూ ఇలా కొత్త వాళ్లతో మూవీ చేసి వాళ్లను ప్రోత్సహించాలనేది కిరణ్ అన్న కల. ఆయన ఎస్ ఆర్ కల్యాణమండపం సినిమా రిలీజ్ ముందే కొత్త వాళ్లతో మూవీ చేయాలని నిర్ణయించుకున్నారు. నటుడు అనిల్ మాట్లాడుతూ తిమ్మరాజుపల్లి టీవీ చిత్రంలో వరదరాజులు అనే క్యారెక్టర్ చేశాను. ఇది నెగిటివ్ గా ఉండే పాత్ర. ఈ సినిమాలో నటించే అవకాశం కల్పించిన ప్రొడ్యూసర్స్‌కు, కిరణ్ గారికి థ్యాంక్స్ అన్నారు.

# డైమండ్ డెకాయిట్ ఆడియో ఫంక్షన్



తెలుగు తెరపై సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఎమోషనల్ రివెంజ్ డ్రామా డైమండ్ డెకాయిట్. పార్థ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి యాదవ్ దర్శకత్వంలో, పార్థ గోపాల్ మేఘన జంటగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఓ వినూత్న పోటీకి తెర లేపింది.

అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి:

మొదటి బహుమతి - 1,00,000

రెండవ బహుమతి - 50,000

కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించదానికి ఈ ఛాలెంజ్ ను ప్రకటించామని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ సందర్భంగా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ.. సినిమా పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. చిత్ర నిర్మాత, హీరో పార్థ గోపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

# ఘనంగా అరెరే.. అరెరే.. మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల



హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సింగర్, నటి దియా అందించిన అరెరే.. అరెరే..మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. బటర్‌ఫ్లై మ్యూజిక్ బ్యానర్‌పై రూపొందిన ఈ మ్యూజిక్ వీడియో విడుదల వేడుకకు సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, హీరో పూరి ఆకాష్, సినీ ప్రముఖులు సమీర్, సాగర్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, నటుడు, మిమిక్రి శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు ఆడియోను విడుదల చేసి చిత్రబృందానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ..దియా ఒక వండర్‌ఫుల్ టాలెంట్. ఈ అరెరే.. అరెరే.. మ్యూజిక్ ఆల్బమ్ చాలా హృద్యంగా ఉంది. ఆమె గాత్రం, నటన రెండింట్లోనూ ప్రతిభ స్పష్టంగా కనిపిస్తోంది.

రఘు కుంచె మాట్లాడుతూ..ఇది డిజిటల్ యుగం. ప్రతిభ ఉన్నవారు అవకాశాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. తమ టాలెంట్‌తోనే ముందుకు రావచ్చు. దియా అలాంటి ప్రతిభావంతురాలు. నటి, సింగర్ దియా మాట్లాడుతూ.. ఈ ఆల్బమ్ రూపుదిద్దుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా మీద నమ్మకం ఉంచి ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన టీమ్ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

# విష్ణు మంచు రిలీజ్ చేసిన విజయ్ ఆంటోని వంద దేవుళ్లు ఫస్ట్ లుక్



మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో వచ్చిన బిచ్చగాడు చిత్రం ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఈ కాంబో కలిసి వచ్చింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వంద దేవుళ్లు అనే చిత్రం రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా డైనమిక్ స్టార్ విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. చెరుకు తోటలో విజయ్ ఆంటోనీ కత్తి పట్టుకున్న తీరు, వెనకాలే స్వాసిక మాసీ లుక్ అదిరిపోయింది. విజయ్ ఆంటోని ఇందులో రా అండ్ రస్టిక్ పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తూ చిత్రయూనిట్‌కు విష్ణు మంచు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

# డెకాయిట్ జైన్ మేరీ ఖాన్ ఫస్ట్ లుక్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్ లో డెకాయిట్‌ఖితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ కజిన్ బ్రదర్ కుమార్తె జైన్ మేరీ ఖాన్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. జైన్ మారీ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఖాకీ యూనిఫామ్‌లో భుజాలపై స్టార్ ఎపాలెట్స్, హోల్స్టర్ బెల్ట్‌తో తుపాకీ పట్టుకుని ముందుకు గురిపెట్టిన ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ఈ పోస్టర్‌ను చూసిన ఆమిర్ ఖాన్ వెంటనే స్పందించి అభినందనలు తెలుపుతూ మొత్తం టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిందీ ప్రేక్షకుల్లో సినిమాకు మరింత హైప్‌ను తెచ్చింది. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న డెకాయిట్‌కి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటో గ్రాఫర్ దనుష్ భాస్కర్ రగ్డ్ విజువల్స్‌ను అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది.

ఆట

# సన్ రైజింగ్ హైదరాబాద్


ఇషాన్ కిషన్

**ఇండియన్ రిచ్ క్రికెట్ లీగ్ ఐపీఎల్ టైటిల్ ఫేవరెట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒకటి. 2013లో లో ఇంట్రీ ఇచ్చిన సన్ రైజర్స్ 2016లో ఛాంపియన్‌గా నిలిచింది. 2018, 2024లో ఫైనల్ చేరినా తృటిలో కప్ మిస్సయింది. టాప్ సిక్స్‌లో అందరూ మ్యాచ్‌విన్నర్లే కాబట్టి ఈసారి భారీ ఆశలతో బరిలోకి దిగుతున్నది. ట్రావిడ్ హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్‌తో టాప్ ఆర్డర్... క్లాసెన్, నితీష్ రెడ్డి, లివింగ్ స్టోన్ రూపంలో మిడిల్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. ఆల్‌రౌండర్లు అదనపు బలం. బౌలింగ్ కొంచెం బలహీనంగా ఉన్నా సన్ రైజర్స్ హైదరాబాద్‌ను ప్రమాదకర జట్లలో ఒకటిగా పరిగణిస్తున్నారు.**

## దుమ్మురేపే బ్యాటింగ్ బౌలింగే అసలు పరీక్ష

(వార్త క్రీడా విభాగం) సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఈసారి అత్యంత ప్రమాదకర జట్లలో ఒకటిగా పేరుగాంచింది. దూకుడు బ్యాటింగ్, మ్యాచ్‌గెలిపించే బౌలింగ్ సమన్వయంతో జట్టు సమతుల్యంగా ఉంది. ఈ జట్టులో 3 కీలక ఆటగాళ్లు ప్రత్యేకంగా నిలుస్తున్నారు. వీరే జట్టుకు ప్రధాన బలం.

**అగ్రెసివ్ ఓపెనింగ్**

సన్‌రైజర్స్‌కు ఏ జట్టుకు లేని విధంగా అగ్రెసివ్ ఓపెనర్లు సొంతం. అభిషేక్ శర్మ ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ప్రారంభంలోనే వేగంగా పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచుతాడు. తన దూకుడు ఆటతీరుతో మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చగలడు. అతని ధైర్యం, స్థిరత్వం జట్టుకు గొప్ప బలం. గత ఐపీఎల్ సీజన్‌లో 193కు పైగా స్ట్రయిక్ రేట్‌తో 439 రన్స్ సాధించాడు. పంజాబ్ కింగ్స్‌పై 55 బంతుల్లో 141 రన్స్ ఇన్నింగ్స్ ఐపీఎల్ 2025కే హైలైట్. ప్రపంచకప్ ఫైనల్‌తో మునుపటి ట్రాక్ అందుకున్న అభిషేక్ బ్యాట్ ఝుళిపిస్తే ఎంతటి బౌలరైనా ధమాలే. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్. ఈ ఆస్ట్రేలియన్ క్రీజ్‌లో కుదురుకుంటే ఇక అంతే. వేగంగా పరుగులు వచ్చి పడాల్సిందే. గత ఐపీఎల్‌లో 162 స్ట్రయిక్ రేట్‌తో 374రన్స్ సాధించాడు. టాప్ త్రిలో ఉన్న మరో బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్. గత ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సెంచరీతో సహా మొత్తం 354రన్స్ చేశాడు. ప్రపంచకప్‌లో ఇషాన్ జోరు చూసిన వారందరూ ఐపీఎల్‌లో ఇషాన్‌ను ఆపడం కష్టమేనని తేల్చేస్తున్నారు. కెప్టెన్‌గా కొత్త బాధ్యతలు మోస్తున్న ఇషాన్.. ఫస్ట్‌డౌన్‌లో సుటబుల్. మిడిల్ ఓవర్లలో నిలబడి అవసరమైన సమయంలో వేగంగా పరుగులు సాధించగలడు. జట్టును ముందుకు నడిపించే శక్తి అతనికి ఉంది.

**క్లాసెన్ కొండంత అండ**

మోస్ట్ వాల్యూబుల్ సౌతాఫ్రికాప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్... స్లాగ్ ఓవర్లలో మ్యాచ్‌ను మార్చగల ఆటగాడు. స్పిన్‌ను చీల్చి చెండాడగలడు. కొన్ని బంతుల్లోనే భారీ పరుగులు సాధించగలడు. అతని దూకుడు ఆటతీరు జట్టుకు విజయాన్ని అందించే కీలక అంశం. క్లాసెన్ గత ఐపీఎల్‌లోనూ జోరు చూపాడు. 172 స్ట్రయిక్ రేట్‌తో ఏకంగా 487 రన్స్ సాధించాడు. సన్ రైజర్స్‌కు క్లాసెన్, నితిష్ రెడ్డి, లివింగ్ స్టోన్ రూపంలో పటిష్టమైన మిడిల్ ఆర్డర్ ఉంది. గత ఐపీఎల్‌లో ఆర్సీబీకి ఆడిన ఇంగ్లాండ్ ప్లేయర్ లివింగ్ స్టోన్ ను వేలంలో సన్‌రైజర్స్ 13కోట్లు వెచ్చింది తీసుకుంది. సూపర్ ఆల్‌రౌండర్ అయిన లివింగ్ స్టోన్ ధనాధన్ బ్యాటింగ్‌తో పాటు ఉపయుక్త స్పిన్నర్‌కు జట్టుకు లాభం.

**ఎస్ఆర్‌హెచ్ జట్టు(అంచనా)**

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(కెప్టెన్, హెన్రిచ్ క్లాసెన్, నితిష్ కుమార్‌రెడ్డి, లివింగ్‌స్టోన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, జైదేవ్ ఉనద్కత్, ఇషాన్ మలింగ, హర్ష్ దూబే.

**బౌలింగ్‌పైనే బెంగ**

సన్‌రైజర్స్ బ్యాటింగ్ పటిష్టంగానే ఉన్నా బౌలింగ్ ఆందోళన రేపుతోంది. పాట్ కమిన్స్ గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడంతో పేస్ అటాక్ బలహీనంగా మారింది. వెటరన్ పేసర్ జయ్‌దేవ్ ఉనద్కత్, శ్రీలంక ప్లేయర్ మలింగపైనే బౌలింగ్ భారం. బౌలింగ్ డిపార్ట్‌మెంట్ మెరుగవాల్సి ఉంది.

**స్థిరంగా రాణిస్తేనే కప్**

ఐపీఎల్ 2026 ప్రారంభం నుంచి స్థిరమైన ప్రదర్శన జట్టును సన్‌రైజర్స్‌ను విజేతగా నిలబెట్టే అవకాశం ఉంది. ఈసారి గత తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగితే జట్టు కప్ గెలిచే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్ జట్టు ఈసారి ఆశాజనకంగా కనిపిస్తోంది. టాప్ ఆర్డర్ ఫామ్ కొనసాగిస్తే జట్టు విజయం సాధించడం కష్టమేమీ కాదు.


అభిషేక్ శర్మ ధనాధన్‌పై ఆశలు



# కివీస్‌పై సౌతాఫ్రికా గెలుపు


**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్, సౌతాఫ్రికాల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ రసవత్తరంగా మారింది. వెల్లింగ్టన్‌లో జరిగిన నాలుగో టీ20లో దక్షిణాఫ్రికా 19 పరుగులతో గెలుపొందింది. దీంతో 5మ్యాచ్‌ల సిరీస్‌లో 2-2తో రెండు జట్లు సమంగా నిలిచాయి. తొలుత బ్యాటింగ్‌చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 164 రన్స్ చేసింది. ఎస్తర్‌హూజిన్ (36బంతుల్లో 57) 7 ఫోర్లు, 3 సిక్సర్లతో టాప్ స్కోరర్‌గా నిలవగా, రుబిన్ హెర్మన్ (28 నాటౌట్), టోనీ డి జోర్జి (23) రాణించారు. కివీస్ బౌలర్లలో కైల్ జేమీసన్2వికెట్లు పడగొట్టాడు. అనంతరం 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో145 పరుగులకు ఆలౌటైంది. టిమ్ రాబిన్‌సన్ (22 బంతుల్లో 32) టాప్ స్కోరర్‌గా నిలవగా, డేన్ క్లైవర్ (26) పర్వాలేదనిపించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 3 వికెట్లు పడగొట్టగా, బార్త్‌మన్, సుబ్రెయన్, కేశవ్ మహరాజ్‌లు తలా రెండు వికెట్లు పడగొట్టారు. అర్ధ సెంచరీతో మెరిసిన ఎస్తర్ హూజిన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు.

టాస్ గెలిచిన సౌతాఫ్రికాకు ఆదిలోనే షాక్ తగిలింది. వియాన్ ముల్డర్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత టోనీ డిజార్జి, హూజిన్‌లు రెండో వికెట్‌కు 81పరుగులు జోడించి సఫారీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. టోనీ ఔటైన తర్వాత ఈజులోకి వచ్చిన రుబిన్ హెర్మన్ ధాటిగా ఆడాడు. ఎస్తర్‌హూజిన్ పెవిలియన్ చేరిన తర్వాత ఇన్నింగ్స్ చివర్లో జాసన్ స్మిత్, డియాన్ ఫెరస్టర్‌లు బ్యాట్ ఝుళిపించడంతో సౌతాఫ్రికా గౌరప్రదమైన స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో ఆది నుంచే తడబడిన న్యూజిలాండ్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. సౌతాఫ్రికా,


కొయెట్జీ 3 వికెట్లు

# రివ్వున దూసుకుపోతున్న అతికా

**ఢిల్లీ:** వేగంగా దూసుకుపోయే ఫార్ములావన్‌లో పురుషులదే ఆధిక్యం. ఈ రంగంలోనూ మహిళా రేసర్లు దూసుకువస్తున్నారు. అందునా భారత్‌కు చెందిన 11 ఏళ్ల అతికామిర్ కార్‌రేసింగ్‌లో సంచలనాలు సృష్టిస్తోది. తన తొలి ప్రయత్నంలోనే రేస్ కార్టింగ్‌లో అంచనాలకు మించి రాణించింది. అద్భుతమైన రేసింగ్‌నైపుణ్యంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం భారత్ తరఫున అతికా మిర్ ప్రపంచ వేదికపై అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న భారతీయ కార్టర్‌గా నిలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన అతికా మిర్ ప్రస్తుతం దుబాయ్‌లో నివసిస్తోంది. అతికా రేసింగ్ కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తండ్రి ఆసిర్ మిర్ భారత మొట్టమొదటి జాతీయ కార్టింగ్ చాంపియన్. 2021లో అబుదాబిలో జరిగిన ఫార్ములా వన్ సీజన్ ఫైనల్లో లూయిస్ హామిల్టన్, వెర్ స్టాపెన్‌ల మధ్య జరిగిన టైటిల్ పోరును చూసిన తర్వాత అతికా మిర్ రేసింగ్‌పై ఇష్టాన్ని పెంచుకుంది. తండ్రి ప్రోత్సహంతో కార్టింగ్‌లో రివ్వున దూసుకువచ్చింది. నమ్మకం, ఆత్మవిశ్వాసం ఇవాళ తనను రేసింగ్‌ను కెరీర్‌గా ఎంచుకునేలా చేశాయి. ఫార్ములా 1ను చేరుకోవడమే అంతిమ లక్ష్యమని అతికా మిర్ పేర్కొంది. ప్రస్తుతం ఇటలీలో రేసింగ్ చేస్తున్నట్లు అతికా మిర్ తెలిపింది.



# టాప్ కంపెనీల్లో లక్ష కోట్ల మార్కెట్ క్యాప్ కోత




**ముంబయి, మార్చి 22:** దేశీయ స్టాక్ మార్కెట్లు గడిచిన వారం ఫ్లాట్‌గా ముగిసినప్పటికీ దేశంలోని అత్యంత విలువైన కంపెనీలలో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీ నష్టాలను చవిచూసింది. టాప్10 కంపెనీలలో ఐదు సంస్థలు కలిపి ఏకంగా లక్ష కోట్ల రూపాయలకు పైగా మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను కోల్పోయాయి. ఈమొత్తంలో అధికవాటా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌దే కావడం గమనార్హం. గత వారంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ ఏకంగారూ. 56,124.48 కోట్లు పతనమైంది. దీంతో ఆ సంస్థ మార్కెట్ క్యాప్ రూ.12,01,267.28 కోట్లకు తగ్గింది. ఇదే బాటలో హిందుస్థాన్ యూనిలీవర్ రూ. 18,009.62 కోట్లు, బజాజ్ ఫైనాన్స్ రూ. 15,338.42కోట్లు నష్టపోయాయి. వీటితో పాటు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రూ.7,127.63 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 6,171.72 కోట్లు చొప్పున తమ మార్కెట్ విలువను కోల్పోయాయి. ఈ ఐదు కంపెనీల మొత్తం నష్టం రూ. 1,02,771.87 కోట్లుగా నమోదైంది. బీఎస్ఈ సెన్సెక్స్ కేవలం 30.96 పాయింట్లు (0.04 ), ఎన్ఎస్ఈ నిఫ్టీ 36.6 పాయింట్లు (0.15 ) మాత్రమే నష్టపోయి ఫ్లాట్‌గా ముగిశాయి. మార్కెట్ ట్రెండ్‌పై రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చ్) అజిత్ మిశ్రా స్పందిస్తూ మార్కెట్లు నెగటివ్ ధోరణితో ఫ్లాట్‌గా ముగిశాయని తెలిపారు. వారం మొదటి మూడు సెషన్లలో సానుకూలంగా ఉన్నప్పటికీ, గురువారం నాటి భారీ పతనం ఆ లాభాలను తుడిచిపెట్టిందని, చివరి రోజు మార్కెట్ ఒడుదొడుకులకు లోనైందని ఆయన వివరించారు. ఒకవైపు కొన్ని దిగ్గజాలు నష్టపోగా, మరోవైపు కొన్ని కంపెనీలు బలమైన లాభాలను ఆర్జించాయి. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ గరిష్ఠంగా రూ. 24,462.03 కోట్లు పెరిగి రూ. 10,52,893.75 కోట్లకు చేరింది. ప్రభుత్వరంగ దిగ్గజం ఎస్‌బీఐ కూడారూ. 10,707.52కోట్లు లాభపడి, తన మార్కెట్‌క్యాప్‌ను రూ. 9,76,968.57 కోట్లకు పెంచుకుంది.

# ట్రంప్ క్రిప్టో బిజినెస్ రూ.6700 కోట్ల లాభాలు



**వాషింగ్టన్, మార్చి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి చెందిన క్రిప్టోకరెన్సీ వ్యాపారం కేవలం ఆరు నెలల వ్యవధిలోనే కళ్లు చెదిరే లాభాలు ఆర్జించింది. సుమారు 6,700 కోట్లు ఆర్జించినట్లు బిజినెస్ నిపుణులు చెపుతున్నారు. దశాబ్దాలుగా ట్రంప్ ఆర్గనైజేషన్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రియల్ ఎస్టేట్, గోల్ఫ్ కోర్సుల ఆదాయాన్ని కూడా ఈ క్రిప్టో వ్యాపారం అధిగమించింది.

ట్రంప్ కుటుంబానికి చెందిన వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ అనే సంస్థ ఈ ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో 463మిలియన్ డాలర్లు కంపెనీ టోకెన్ల విక్రయాల ద్వారా రాగా, ట్రంప్ పేరుతో ఉన్న ఒక మెమెకాయిన్ ద్వారా మరో 336 మిలియన్ డాలర్లు సమకూరాయి. ఈ టోకెన్ల అమ్మకాల ద్వారా వచ్చే నికర లాభంలో ట్రంప్ కుటుంబ సంస్థకు 75 శాతం వాటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భారీ లాభాల కన్నా ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారి వివరాలు ఇప్పుడు తీవ్ర వివాదానికి, అనుమానాలకు దారితీస్తున్నాయి. ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ భద్రతా సలహాదారు షేక్ తహ్నూన్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు చెందిన ఒక సంస్థ ఇందులో 49 శాతం వాటాను 500 మిలియన్ డాలర్లకు కొను గోలు చేయడం సంచలనం సృష్టిస్తోంది. క్రిప్టో వ్యాపారి జస్టిన్ సన్ భారీగా ట్రంప్ టోకెన్లు కొనడం, ఆ తర్వాత ఆయనపై అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ దర్యాప్తును నిలిపివేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. అధ్యక్షుడిగా ఉంటూనే, తన కుటుంబ వ్యాపారంలోకి విదేశీ ప్రభుత్వాలు, ప్రముఖుల నుంచి భారీగా నిధులు రావడం ప్రయోజనాల ఘర్షణకు దారితీస్తుందని నైతిక నిపుణులు, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ట్రంప్ ప్రభుత్వం క్రిప్టో రంగానికి అనుకూలంగా తీసుకుంటున్న నిర్ణయాల వెనుక ఈ పెట్టుబడుల ప్రభావం ఉండొచ్చని సెనేటర్ ఎలిజబెత్ వారెన్ వంటి నేతలు విమర్శిస్తున్నారు.




'పాన్' తప్పనిసరిచేస్తూ..


# కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ, మార్చి 22:** ఆదాయపు పన్ను నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ముఖ్యంగా సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిస్తూ స్థిరాస్తి కొనుగోళ్లలో పాన్ కార్డు కనీస పరిమితిని భారీగా పెంచింది. ఇప్పటివరకు రూ.10 లక్షలు దాటిన ప్రతి ఆస్తి లావాదేవీకి పాన్ తప్పనిసరి కాగా మారిన నిబంధనల ప్రకారం ఆ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు తెలిపింది.

నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఫ్లాట్లు లేదా ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాలు (రిడీఏ) చేసుకునే వారికి ఈ నిర్ణయం పెద్ద ఊరటనిస్తుంది. పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. ఏప్రిల్ 1, 2026 నుంచి ఈ కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఆస్తి కొనుగోళ్లతో పాటు ఇతర ఆర్థిక లావాదేవీల్లోనూ కీలక సవరణలు జరిగాయి. ఇదివరకు కార్లు కొంటే ధరతో సంబంధం లేకుండా పాన్ అడిగేవారు.

ఇకపై ద్విచక్ర వాహనాలతో సహా ఏ మోటారు వాహనమైనా దాని ధర రూ.5 లక్షలు మించితేనే పాన్ ఇవ్వాల్సి ఉంటుంది. బ్యాంక్ ఖాతాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువ నగదు జమ చేసినా లేదా విత్‌డ్రా చేసినా ఇకపై పాన్ వివరాలు సమర్పించాలి. హోటల్ బిల్లులు, రెస్టారెంట్లు లేదా ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే చెల్లింపుల పరిమితిని రూ.50 వేల నుంచి రూ.1 లక్షకు పెంచారు. ఇన్సూరెన్స్ రంగంలో పారదర్శకత కోసం ఇకపై ప్రతి పాలసీ కొనుగోలుకు పాన్ తప్పనిసరి చేశారు.

# విదేశీ ఇన్వెస్టర్లు రూ.88,180 కోట్లు విత్‌డ్రా




**ముంబయి, మార్చి 22:** భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో ఈ ఏడాది మార్చి మాసం మార్కెట్లను వణికించింది. వారం రోజులుగా దలాల్ స్ట్రీట్‌లో విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. కేవలం ఒకే వారంలో సుమారు రూ. 35,475 కోట్ల విలువైన విదేశీ పెట్టుబడులు విత్‌డ్రా అయ్యాయి. మొత్తంగా ఇప్పటివరకు రూ. 88,180 కోట్లు బయటకు వెళ్లడం 2026లోనే అతిపెద్ద రికార్డు. ఇది మార్కెట్ సెంటిమెంట్ ఎంత బలహీనంగా ఉందో సూచిస్తోంది.

స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్న ప్రధాన అంశం పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాల ఆర్థిక ధోరణులను మార్చివేస్తున్నాయి. అనిశ్చితి నెలకున్నప్పుడు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడరు. వారు తమ పెట్టుబడులను భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచిఉపసంహరించుకుని, సురక్షితమైన ఆస్తులుగా భావించే బంగారం లేదా అమెరికా డాలర్ల వైపు మళ్లుతారు. దీనినే ఆర్థిక పరిభాషలో రిస్క్‌ఆఫ్ అని పిలుస్తారు. భారత్‌తన చమురు అవసరాలలో దాదాపు 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. పశ్చిమాసియాలో దాడులు పెరగడం వల్ల చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయం మార్కెట్లో నెలకొంది. చమురు ధరలు పెరిగితే ప్రభావం రవాణా రంగంపై పడి, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇది అంతిమంగా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

ద్రవ్యోల్బణం పెరిగితే ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉండదు ఇది కంపెనీల లాభాలకు కోతపెడుతుంది. విదేశీ ఇన్వెస్టర్లు ఈ ముప్పును ముందే పసిగట్టి తమ వాటాలను విక్రయిస్తున్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను తరచుగా హాట్ మనీ అని పిలుస్తారు. ఎందుకంటే వీరు లాభాలు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడికి వెళ్తారు ముప్పు కనిపిస్తే అంతే వేగంగా బయటకు వచ్చేస్తారు. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ డేటాను పరిశీలిస్తే ఈ వారం అమ్మకాల పరంపర షాక్‌కు గురిచేస్తోంది. సోమవారం అత్యధికంగా రూ. 10,827 కోట్ల ఉపసంహరణ ప్రారంభమైంది.

## టాటా క్యాపిటల్‌కు 413 కోట్ల పన్ను నోటీసులు




**ముంబయి, మార్చి 22:** టాటాగ్రూప్‌లోని ఆర్థిక సేవల సంస్థ టాటా క్యాపిటల్‌కు ఆదాయపు పన్ను శాఖ నుంచి భారీ డిమాండ్ నోటీసు అందింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రీఅసెస్మెంట్ ప్రక్రియలో భాగంగాముంబై పన్నుల శాఖ రూ.413.18 కోట్ల డిమాండ్‌తో నోటీసులు జారీ చేసింది. ఈ డిమాండ్‌లో గణన దోషాలు ఉన్నాయని, దీనిపై రెక్టిఫికేషన్ అప్పీల్ దాఖలు చేయనున్నట్లు టాటా క్యాపిటల్ చెపుతూ ఈ పరిణామం వల్ల సంస్థపై తక్షణమే ఎలాంటి ఆర్థిక ప్రభావం ఉండబోదని స్పష్టంచేసింది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 143(3) రెడ్ విత్ సెక్షన్ 147 కింద డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. 2026 మార్చి 20న ఈ ఆర్డర్ జారీ కాగా, మరుసటి రోజున దానిని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు వివరించింది. ఈ డిమాండ్‌లో రూ.202.72 కోట్ల వడ్డీ కూడా కలిసి ఉంది. చెల్లించిన పన్నుల క్రెడిట్‌లో తేడాలు, కొన్ని ఇతర డిస్అలవెన్స్‌ల కారణంగా ఈ డిమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రీఅసెస్మెంట్ వాస్తవానికి టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (టీసీఎఫ్ఎస్ఎల్)కు సంబంధించినది. ఈ సంస్థ 2023 ఏప్రిల్ 1 నుంచి టాటా క్యాపిటల్‌లో విలీనమైంది. టీసీఎఫ్ఎస్ఎల్ గతంలో టీడీఎస్, టీసీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ రూపంలో 225.89కోట్లు చెల్లించిందని అసెసింగ్ అధికారి కేవలం 16.36 కోట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని కంపెనీ తెలిపింది. దీనివల్ల రూ.209.52 కోట్ల మేర షార్ట్ ట్యాక్స్ క్రెడిట్ ఏర్పడిందని, దానిపై పొరపాటున 202.72 కోట్ల వడ్డీని కూడా లెక్కించారని పేర్కొంది.




# ఎటిఎం విత్‌డ్రా, యుపిఐ లావాదేవీల్లో మారిన రూల్స్

**ముంబయి, మార్చి 22:** ఏటీఎమ్ నగదు ఉపసంహరణ, యూపీఐ లావాదేవీలకు సంబంధించి ఏప్రిల్ 1 నుంచి బ్యాంకులు నిబంధనల్లో మార్పులు తెస్తున్నాయి. ముఖ్యంగాఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వంటివి తమ కస్టమర్ల కోసం కొత్త మార్గదర్శకాలను ప్రకటించాయి. ఈ మార్పుల గురించి వినియోగదారులు ముందే తెలుసుకోవడం ద్వారా అనవసర చార్జీలను నివారించుకోవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఏటీఎమ్ లావాదేవీల లెక్కింపు విధానంలో మార్పు చేసింది. ఇప్పటివరకు డెబిట్ కార్డు ద్వారా ఏటీఎమ్‌లో తీసిన నగదును మాత్రమే ఉచిత లావాదేవీల పరిమితిలో లెక్కించేవారు. ఏప్రిల్ 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చేసే నగదు ఉపసంహరణలను కూడా ఈ కోటాలోనే పరిగణిస్తారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎమ్‌లలో నెలకు 5 సార్లు, ఇతర బ్యాంకుల ఏటీఎమ్‌లలో (మెట్రోలలో3, నాన్‌మెట్రోలలో5) ఉచితంగా నగదు తీసుకోవచ్చు. ఈ పరిమితి దాటితే ప్రతి లావాదేవీకి రూ.23తో పాటు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కొన్ని డెబిట్ కార్డులపై రోజు వారీ నగదు ఉపసంహరణ పరిమితిని తగ్గించింది. రిస్క్ మేనేజ్ మెంట్, కార్డుల వినియోగం తీరు తెన్నుల్లోఏకీకృత విధానం కోసం ఈ మార్పులు చేసినట్లు సమాచారం. పీఎన్‌బీ కస్టమర్లు డెబిట్‌కార్డు రకాన్ని బట్టి రోజుకు గరిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ నగదును తీసుకోవచ్చు. గతంలో లక్ష వరకూ నగదు ఉపసంహరణకు అనుమతి ఉన్న కార్డుల పరిమితిలో కూడా కోత పడింది. ఇక జియో పేమెంట్స్ బ్యాంక్ తన కస్టమర్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వద్ద నగదు తీసుకునే కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఏప్రిల్ 1 నుంచి రూపే ప్లాటినం డెబిట్ కార్డులపై ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ పొందాలంటే, వినియోగదారులు నిర్దేశిత మొత్తంలో ఖర్చు చేయాలనే కొత్త నిబంధనను ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.